సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 304
బుధవారం 25-1-2023


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'


అదరగొట్టి అగ్రస్థానానికి...
న్యూజిలాండ్‌పై 3–0తో సిరీస్ నెగ్గడంతో వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్. -12లో


ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు
సెన్సెక్స్ నష్టం 37 పాయింట్లు.. నిఫ్టీ యథాతథ ముగింపు. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


కొలీజియం తీర్మానం ఆందోళనకరం
'ఐబీ', 'రా' రహస్య పత్రాల్లో కొన్ని భాగాలను బహిర్గతం చేయాలని కొలీజియం తీర్మానించడం ఆందోళనకరమని రిజిజు అన్నారు.
- వివరాలు 6లో▶



'డాక్యుమెంటరీ' రగడ
'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట రూపొందిన బీబీసీ డాక్యుమెంటరీని ఎస్‌ఎఫ్‌ఐ తదితర సంఘాలు కేరళలో ప్రదర్శించాయి.
- వివరాలు 6లో▶


అణచివేతలు నిజాన్ని ఆపలేవు
గుజరాత్ అల్లర్లకు మోదీనే బాధ్యుడంటూ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని రాహుల్ గాంధీ పరోక్షంగా సమర్థించారు.
- వివరాలు 6లో▶


బొమ్మల కొలువు..
కళకు రాజపోషణ అవసరమే గానీ, కళ జీవించాల్సింది దాతల దయాదాక్షిణ్యాలపై కాదంటున్నారు చిత్రానూద్.
- వివరాలు 11లో▶

న్యూస్‌రీల్

త్వరలోనే పోడు పట్టాల పంపిణీ


త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కేస్లాపూర్ నుంచే పోడు పట్టాలు పంపిణీ చేస్తామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద ఎక్కువ మందికి న్యాయం చేసేలా చూస్తామని చెప్పారు.
- వివరాలు 5లో▶


పాతది మాఫీ కాక.. కొత్త రుణం రాక..


రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు రైతుబంధు సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేస్తుంటే, ఆ మొత్తాన్ని కొన్ని బ్యాంకులు అప్పుల కింద జమ చేసుకుంటున్నాయి.
- వివరాలు 2లో▶

ఎవరితోనైనా పొత్తులకు సిద్ధం


ఓట్లు చీలవద్దన్నదే తమ అభిమతమని ఇందు కోసం ఎవరితోనైనా పొత్తులకు సిద్ధమని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణలో 7నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందన్నారు.
- వివరాలు 10లో▶

మేథ్స్‌లో తిప్పలు.. కెమిస్ట్రీలో స్కోర్


జేఈఈ మెయిన్స్ గణితంలో ఇచ్చిన ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయని, ఫిజిక్స్ మధ్యస్తంగా ఉందని, కెమిస్ట్రీలో ఎక్కువ స్కోర్ చేసే వీలుందని విద్యార్థులు తెలిపారు. గ్రాఫ్ బేస్డ్ తదితర ప్రశ్నలు తేలిగ్గా ఉన్నాయన్నారు.
- వివరాలు 14లో▶


సచివాలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

బీఆర్‌ఎస్ 'పరేడ్'!

17న సచివాలయం ప్రారంభం సందర్భంగా బల ప్రదర్శనకు సిద్ధం
అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ

తమిళనాడు, జార్ఖండ్ సీఎంలు స్టాలిన్, సొరెన్‌లకు ఆహ్వానం

- బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ సహా మరికొందరు నేతలకు కూడా..
- 13న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మోదీ సభను మించేలా నిర్వహించాలని యోచన
- సభ ఏర్పాట్లు, జన సమీకరణపై త్వరలో నేతలతో కేసీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభం సందర్భంగా బీఆర్‌ఎస్ బల ప్రదర్శనకు సిద్ధమవుతోంది. 13న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ప్రధాని మోదీతో సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. అంతకు మించేలా 17వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి భారీగా జన సమీకరణ చేయడంతోపాటు పలు రాష్ట్రాల సీఎంలు, జాతీయ స్థాయి నేతలను ఆహ్వానించనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు, ఇతర అంశాలపై సీఎం కేసీఆర్ త్వరలోనే నేతలతో భేటీ కానున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు మోదీ సభ కోసం బీజేపీ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. మొత్తంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఫిబ్రవరిలో సికింద్రాబాద్ పరేడ్ మైదానం వేదికగా భారీ బహిరంగ సభలతో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాయి.

కేసీఆర్ పుట్టినరోజున ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని వచ్చే నెల 17న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మిగతా 3వ పేజీలో ▶

ముహూర్తం దగ్గర పడింది.. వేగం పెంచండి..
- కొత్త సచివాలయ పనులపై సీఎం ఆదేశం
- రెండు గంటల పాటు పనుల పరిశీలన

- వివరాలు 3లో▶



ఆస్కార్‌కు 'నాటు.. నాటు..'

తొలిసారి నామినేషన్ దక్కించుకున్న తెలుగు సినిమా పాట

- బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో పోటీకి..
- దాదాపు 22 ఏళ్ల తర్వాత ఆస్కార్ బరిలో భారతీయ సినిమా
- బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'ఆల్ దట్ బ్రీత్స్'
- డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు నామినేషన్


ది ఎలిఫెంట్ విస్పరర్స్


ఆల్ దట్ బ్రీత్స్

మన దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉర్రూతలూగించిన తెలుగు పాట 'నాటు.. నాటు..'కు ఆస్కార్ నామినేషన్ లభించింది. ఆస్కార్ బరిలో నిలిచిన తొలి తెలుగు సినిమాగా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచి చరిత్ర సృష్టించింది. అంతేకాదు దాదాపు 22 ఏళ్ల తర్వాత భారతీయ సినిమా ఈ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తంగా 95 ఆస్కార్ అవార్డుల బరిలో మన దేశం నుంచి.. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు.. నాటు..'పాటతోపాటు బెస్ట్ డాక్యుమెంటరీ మిగతా 2వ పేజీలో ▶


ఇటీవల మరణించిన కార్యకర్తలకు కార్యవర్గ సమావేశంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు. చిత్రంలో సునీల్ బన్సల్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ తదితరులు

కేసీఆర్ మార్క్ పాలిటిక్స్‌ను తిప్పికొట్టాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గభేటీలో సునీల్ బన్సల్ పిలుపు
పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయాలని నిర్దేశం..

- అరాచకపాలనపై అవిశ్రాంత పోరాటం చేయాలని తీర్మానం
- ఓటమి భయంతోనే టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా మారిందని ధ్వజం
- డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు..పలు తీర్మానాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ మార్క్ రాజకీయాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు రాష్ట్ర పార్టీ సన్నద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్‌బన్సల్ పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపించే కొద్దీ కేసీఆర్ తనదైన పద్ధతుల్లో బీజేపీని జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఇరుకున పెట్టేందుకు చేసే ప్రయత్నాలను నీరుగార్చాలని సూచించారు. వచ్చే నెల 10 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న 9 వేల వీధి సమావేశాల (స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్)ను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో సునీల్ బన్సల్ మాట్లాడారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు జాతీయ నాయకత్వం నిర్దేశించిన కార్యక్రమాలన్నింటినీ తు.చ. తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అంతకుముందు మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా!

- అమలు చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు
- బడ్జెట్‌లో ప్రవేశపెట్టే యోచన
- ఏటా రూ. 500 కోట్లతో అమలుకు ప్రతిపాదన
- రైతు యూనిట్‌గా బీమా పథకానికి రూపకల్పన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో అందుకు దాదాపు రూ. 500 కోట్ల మేర నిధులు కేటాయించాలని నివేదించినట్లు సమాచారం. బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడితే వచ్చే వానాకాలం సీజన్ నుంచి దీన్ని అమలు చేస్తామని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నుంచి 2020లో వైదొలిగాక రాష్ట్రంలో ఎలాంటి పంటల బీమా పథకం అమలు కావడంలేదు. దీంతో పంట నష్టం జరిగినా రైతులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది. దీనిపై సర్వత్రా విమర్శలు రావడంతో వ్యవసాయ శాఖ సొంత పంటల బీమాపై దృష్టిసారించింది.


బెంగాల్ తరహాలో...: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలోనే రాష్ట్రంలోనూ బీమా పథకాన్ని అమలు చేసే అవకాశముంది. దీనిపై సీఎం కేసీఆర్ గతంలోనే అసెంబ్లీలో ప్రకటన చేశారు. బెంగాల్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో మిగతా 5వ పేజీలో ▶

ఆ మిల్లులే ఎందుకు స్పెషల్?

రెండేళ్లుగా సీఎంఆర్ ఇవ్వకున్నా సహకరిస్తున్న అధికారులు
2019-20 యాసంగి సీఎంఆర్ నేటికీ ఇవ్వని 118 మిల్లులు
ఆ బియ్యం విలువ రూ.230 కోట్లు
బియ్యం మాయం చేసినా ఇప్పటికీ ఆగని ధాన్యం కేటాయింపు
సీఎంఆర్ గడువును ఎప్పటికప్పుడు పొడిగిస్తున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొందరు మిల్లర్ల పట్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని మిల్లుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఈ శాఖ కొందరి విషయంలో ప్రోత్సాహం అందిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైసా పెట్టుబడి పెట్టే పని, శ్రమ లేకుండా ఏడాదికి రెండు సీజన్‌లలో ప్రభుత్వమే ధాన్యాన్ని సేకరించి, మిల్లింగ్ చేయించి డబ్బులు ఇస్తుండగా, మిల్లర్లు మాత్రం తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ మిగతా 3వ పేజీలో ▶


...కొంత కాలంగా మార్చడానికి తీవ్ర కృషి చేస్తున్నారుగా సార్!



అనుమానితుడు చున్‌లి ఝావోను అదుపులోకి తీసుకుంటున్న పోలీస్

కాల్పులతో దద్దరిల్లిన అమెరికా

కాలిఫోర్నియాలో రెండు ఘటనల్లో ఏడుగురు మృతి
అయోవాలో ఇద్దరు విద్యార్థులు మృతి, టీచర్‌కు గాయాలు

హాఫ్‌మూన్ బే/డెస్‌మోయిన్స్: అగ్రరాజ్యం అమెరికా మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్‌ఫ్రాన్సిస్కోకు 30 మైళ్ల దూరంలోని హాఫ్‌మూన్ బేలో జరిగిన కాల్పుల్లో ఏడుగురు చనిపోగా ఒకరు గాయపడ్డారు. అయోవా రాష్ట్రం డెస్‌మోయిన్స్‌లోని ఓ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఒక టీచర్ తీవ్రంగా గాయపడ్డారు. హాఫ్‌మూన్ బే ఘటనపై అధ్యక్షుడు బైడెన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హాఫ్‌మూన్ బేలోని మష్రూమ్ ఫాం, ట్రక్కింగ్ ఫర్మ్‌లలో కాల్పులకు తెగబడినట్లు అనుమానిస్తున్న చున్‌లి ఝావో(67) పోలీసుల అదుపులో ఉన్నాడు. ఆ రెండు చోట్లలో ఏదో ఒక దానిలో అతడు పనిచేస్తూ ఉండి ఉంటాడని శాన్‌మాటియో కౌంటీ పోలీసులు చెప్పారు. కాల్పుల్లో చనిపోయిన వారు అక్కడి పనివారని, అసంతృప్తితోనే అతడు ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని భావిస్తున్నామన్నారు. మష్రూమ్ ఫాంలో కాల్పులు మిగతా 6వ పేజీలో ▶

మనుషుల కంటే తుపాకులెక్కువ 6లో

కార్పొరేట్ల కోసమే మోదీ పాలన

కార్పొరేట్ సంస్థలకు రూ.12 లక్షల కోట్లు మాఫీ చేశారు

- ఇది నిజం కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తా: మంత్రి కేటీఆర్
- దమ్ముంటే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇప్పించండి
- నారాయణపేట సభలో బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్


భలే ఉన్నాయి: ఓ ప్రజాప్రతినిధి ఇచ్చిన చింతకాయలతో మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి తదితరులు

నారాయణపేట: మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ.12లక్షల కోట్లను మాఫీ చేసిందని.. ఇది నిజం కాకపోతే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. మాట్లాడితే దేశం కోసం, ధర్మం కోసం అంటారు.. అది నిజం కాదు. కేవలం అదానీ, అంబానీ కోసమే మోదీ పాలన కొనసాగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పేదలకు రావాల్సిన పైసలన్నీ మోదీ దోస్తులు అదానీ, అంబానీలకు చేరుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.12లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్రం చిత్తశుద్ధితో ఆలోచిస్తే దేశంలో రైతాంగానికి రూ.14.50 లక్షల కోట్లతో ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చన్నారు. మంగళవారం నారాయణపేటలో మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డితో కలిసి రూ.196కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల మిగతా 10వ పేజీలో ▶

మోదీ ఓ అసమర్థ ప్రధాని..

- నరేంద్రమోదీ ఓ అసమర్థ, పనికి మాలిన ప్రధాని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ రూ.30లక్షల కోట్లు అదనంగా గుంజింది కేంద్ర ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. పీఎం కష్టపడి కరోనా వ్యాక్సిన్ కనుగొన్నారు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటుండు. ఎంత హాస్యాస్పదమండి... మోదీ చూ మంత్రం వేస్తే కరోనా వ్యాక్సిన్ తయారైందంట...శాస్త్రవేత్తలు, డాక్టర్లు, నర్సులు వారంతా ఎందుకున్నట్లు అని కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.


'భరోస్'ను చూపుతున్న కేంద్ర మంత్రులు ధర్మేంద్ర, అశ్వినీ వైష్ణవ్

దేశీయ ఓఎస్ 'భరోస్' పరీక్ష సక్సెస్

డేటా ప్రైవసీలో ముందడుగు: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: ఐఐటీ–మద్రాస్ అభివృద్ధి చేసిన దేశీయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) 'భరోస్'ను కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్ మంగళవారం విజయవంతంగా పరీక్షించారు. డేటా ప్రైవసీ విషయంలో ఇది కీలకమైన ముందడుగు అని ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. బలమైన, దేశీయ, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలతో పేద ప్రజలు ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఇలాంటి స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్‌తో 'డిజిటల్ ఇండియా' కల సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. భరోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఐఐటీ–మద్రాస్‌కు చెందిన జండ్ కే ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(జండ్‌కాప్స్) అభివృద్ధి చేసింది. కమర్షియల్ ఆఫ్–ద–షెల్ఫ్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయొచ్చు. మొదట కొన్ని సంస్థలకే భరోస్ సేవలు అందిస్తున్నారు. భరోస్‌తో ఎలాంటి డిఫాల్ట్ యాప్‌లు రావు. అంటే కొన్ని యాప్‌లు తప్పనిసరిగా వాడాలంటూ యూజర్లపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. ఫోన్లలోని డేటాను కాపాడుకోవాలంటే ఈ ఓఎస్ చక్కగా ఉపయోగపడుతుంది. ఫోన్లలోని యాప్‌లకు అనుమతి ఇచ్చే విషయంలో మరింత నియంత్రణ సాధ్యమవుతుంది. నమ్మకమైన యాప్‌లకే అనుమతి ఇచ్చే వెసులుబాటు ఉంటుంది.

క్లుప్తంగా...

అనుమతి రాకున్నా.. యాత్రను ఆపేది లేదు



సాక్షి, హైదరాబాద్: ప్రజాప్రస్థాన పాదయాత్రను ఈ నెల 28వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల తెలిపారు. పాదయాత్రను ఆపిన దగ్గర నుంచే తిరిగి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పాదయాత్ర కేసీఆర్ పాలనకు అంతిమ యాత్ర అని అభివర్ణించారు. తన పాదయాత్రను ఆపి కేసీఆర్ చాలా పెద్ద తప్పు చేశారని, తన పాదయాత్రతోనే కేసీఆర్ పాలనకు అంతం మొదలైందన్నారు. పోలీసులు అనుమతించినా, అనుమతించకపోయినా పాదయాత్ర జరుగుతుందన్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా ప్రస్థాన పాదయాత్ర ఫలితమే ఆయన సంక్షేమ పాలన, అద్భుత పథకాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తన పాదయాత్రను ఫిబ్రవరిలో ముగించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళితే తెలంగాణలో రాష్ట్రపతి పాలన వచ్చినట్లేనని, కానీ ముందస్తు వచ్చే అవకాశం లేదని ఆమె చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని ప్రమోట్ చేసేందుకు కేసీఆర్‌కు ముఖ్యమంత్రి పదవి అవసరమన్నారు. ముందస్తు వస్తుందంటున్న రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అని, సొంత పార్టీలోనే ఆయనపై వ్యతిరేకత ఉందని అన్నారు. రానున్న ఎన్నికల్లో పాలేరు నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కేసీఆర్ షర్మిలకు భయపడుతున్నారని, అందుకే ఖమ్మంలో సభ పెట్టారని ఆమె ఎద్దేవా చేశారు.

ఎమ్మార్పీఎస్, బీజేపీ బాహాబాహీ



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల ప్రాంగణం దగ్గర మంగళవారం మధ్యాహ్నం ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ భగీరథ కాలనీ కమాన్ ఎదుట మహబూబ్‌నగర్– భూత్పూర్ రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ ఆందోళనకారులు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు లోపలికి రాళ్లు రువ్వారు. దీంతో బీజేవైఎం, బీజేపీ కార్యకర్తలు లోపలి నుంచి బయటకు రావడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు కట్టెలతో దాడి చేసుకోవడంతోపాటు పిడిగుద్దులు కురిపించుకున్నారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నంలో హెడ్‌కానిస్టేబుల్ బాలయ్య తలకు తీవ్ర గాయమైంది. పలు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. ఈ ఘటనపై బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యతోపాటు మరో 25 మందిపై కేసు నమోదు చేశారు.

గాంధీ భవన్ వద్ద పోలీస్ అభ్యర్థుల దీక్ష



సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగార్థుల ఆందోళనతో మంగళవారం గాంధీ భవన్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. దేహదారుఢ్య పోటీల్లో భాగంగా నిర్వహించిన పరుగు పందెంలో అర్హత సాధించిన వారిని మెయిన్స్ పరీక్షకు అనుమతించాలనే డిమాండ్‌తో కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు చేపట్టిన ఆందోళన రాత్రి వరకూ కొనసాగింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నేతృత్వంలో వందలాది మంది నిరుద్యోగులు గాంధీ భవన్ మెట్ల వద్ద దీక్షకు దిగారు. అంతకుముందు వారు గాంధీ భవన్‌లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకే గాంధీ భవన్ గేట్లకు తాళాలు వేశారు. అయితే నిరుద్యోగులు, ఎన్ఎస్‌యూఐ నేతలతో చర్చలు, కాంగ్రెస్ నేతల జోక్యంతో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 50 మందిని పోలీసులు లోనికి అనుమతించారు. దీంతో నిరుద్యోగ అభ్యర్థులు బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ మెట్ల ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం నిరసనకారులు ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్, కాంగ్రెస్ నేతలు మహేశ్‌కుమార్ గౌడ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలిసి కేసీఆర్ దిష్టిబొమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆందోళన విరమించాలని పోలీసులు హెచ్చరించినా వారు ససేమిరా అనడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మాజీ ఎంపీ మల్లు రవి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు భూపతిరెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు నిరుద్యోగులకు మద్దతుగా నిలిచారు. అన్ని జిల్లాల్లో ఆందోళనలకు నిరుద్యోగులు పిలుపునిచ్చారు.

పాతది మాఫీ కాక.. కొత్త రుణం రాక..

రుణాలు రెన్యువల్ కాక డిఫాల్టర్లుగా మారుతున్న వైనం



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రైతుబంధు సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేస్తుంటే, ఆ మొత్తాన్ని కొన్ని బ్యాంకులు అప్పుల కింద జమ చేసుకుంటున్నాయి. రుణాలు రెన్యువల్ కాని వారు డిఫాల్టర్లుగా మారిపోతున్నారు. కొన్ని బ్యాంకులు అప్పులు పెరిగిపోయాయని పేర్కొంటూ కొత్త రుణాలు ఇవ్వడం లేదు. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. రైతుల లక్షలోపు రుణాలు మాఫీ చేయాల్సి ఉండగా, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల నుంచి 50 వేల వరకున్న రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా రూ.37 వేల వరకు రుణాలు మాఫీ చేసింది. ఆ తర్వాత రూ.38 వేల వరకున్న రుణాలతో ఒక బిల్లు, రూ.38 వేల నుంచి రూ.39 వేల వరకున్న రుణాలతో మరో బిల్లును వ్యవసాయ శాఖ తయారు చేసి ఆర్థిక శాఖకు పంపించింది. అయితే రుణమాఫీకి నిధులు సర్దుబాటు చేయకపోవటంతో సొమ్ము మంజూరు కాలేదని వ్యవసాయ వర్గాలు తెలిపాయి.

రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు లబోదిబో

31,00,000
రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులు

- రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామన్న ప్రభుత్వం
- ఇప్పటివరకు రూ.37 వేలలోపు రుణాలే మాఫీ
- 5.66 లక్షల మంది రైతులకే లబ్ధి
- మొత్తం రూ.19,198.38 కోట్లకు
- రూ.1,171.38 కోట్లే మాఫీ

రూ.20,164.20కోట్లు కేటాయించినా..

2018 ఎన్నికల సమయంలో లక్ష రూపాయల వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మొత్తంగా 36.66 లక్షల మంది రైతులకు చెందిన రూ.19,198.38 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు రుణమాఫీ కోసం రూ.20,164.20 కోట్లు కేటాయించినా, అందులో రూ.1,171.38 కోట్లు మాత్రమే విడుదల చేసింది. వాటితో 5.66 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయగా, మరో 31 లక్షల మంది ఎదురుచూపులు చూస్తున్నారు. 2020లో రూ.25 వేలలోపు రుణాల కోసం రూ. 408.38 కోట్లు రుణమాఫీకి బదిలీ చేసింది. 2021 ఆగస్టులో రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం రూ.1,790 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.25 వేల నుంచి రూ.37 వేల లోపు రైతులకు చెందిన రూ.763 కోట్ల రుణాలను మాత్రమే మాఫీ చేసింది. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

సర్కారు సూచన పట్టించుకోని బ్యాంకర్లు

రుణమాఫీని ప్రభుత్వం విడతల వారీగా చేస్తోంది. ఈ విధంగా లక్షలోపు రుణమాఫీలో కేవలం రూ.37 వేల వరకు రుణాలను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో మిగతా వారికి రెన్యువల్ సమస్య వచ్చింది. రుణాలు రెన్యువల్ చేసుకోకపోతే డిఫాల్టర్లుగా మారుతారు. అయితే కొన్నిచోట్ల బ్యాంకులు ప్రభుత్వ సూచనను పట్టించుకోకుండా రైతుబంధు సొమ్మును రుణమాఫీ కింద జమ చేసుకుంటున్నాయి. దీంతో కొందరి రుణాలు రెన్యువల్ అవుతున్నా, అధిక సంఖ్యలో రైతులు రెన్యువల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులు తొలుత బకాయిలు చెల్లించాలని, తర్వాత రుణమాఫీ సొమ్మును వారి ఖాతాలో వేస్తామని సూచించింది. కొందరు రైతులు అలా చెల్లించగా, కొందరు రైతులు మాత్రం డబ్బులు లేకపోవడంతో బ్యాంకులకు చెల్లించలేకపోయారు. దీంతో లక్షలాది మంది రైతులు డిఫాల్టర్లుగా మారినట్లు అంచనా. రుణమాఫీకి అర్హులైన రైతుల సొమ్మును ఇస్తామని, వారిని ఎవరినీ డిఫాల్టర్లుగా ప్రకటించవద్దని వ్యవసాయశాఖ బ్యాంకులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఈసారి బడ్జెట్లో అయినా రుణమాఫీకి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సొమ్ము కేటాయించి విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



రైతు రుణమాఫీ కోసం పంట రుణాల వివరాలు

లక్ష లోపు రుణాలు	రైతులు	మొత్తం(రూ.కోట్లలో)
0– రూ. 25వేలు	2.96 లక్షలు	408.38
రూ. 25– రూ.50 వేలు	5.72 లక్షలు	1,790
రూ. 50– రూ.75 వేలు	7 లక్షలు	4,000
రూ. 75– రూ.లక్ష వరకు	21 లక్షలు	13,000
మొత్తం	36.68 లక్షలు	19,198.38

ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు

పంట పెట్టుబడి కోసం బ్యాంకులో లక్ష రూపాయల రుణం తీసుకున్నా. దిగుబడి రాకపోవడంతో తిరిగి చెల్లించలేకపోయా. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పడంతో సంతోషపడ్డా. లక్ష రూపాయలు మాఫీ అయిపోతాయని ఆశగా ఎదురుచూశా. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. పైగా వడ్డీ లక్షకు పెరిగింది. ఇప్పుడు యాసంగి సాగుకు బ్యాంకులో రుణం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బయట అధిక వడ్డీకి అప్పు తీసుకుని 4.26 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేశా.

కముటం స్వామి
రైతు, కేసముద్రం,
ఉమ్మడి వరంగల్ జిల్లా

పర్యాటక కేంద్రంగా రంగనాయకసాగర్: హరీశ్‌రావు



దివ్యాంగుడు శివకుమార్‌కు నూతన మోటార్ సైకిల్‌ను అందించి ఆయనతో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: రంగనాయకసాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం రంగనాయకసాగర్ ఎడమ కాల్వనుంచి నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు కాళేశ్వరం నీళ్లతో ఎకరం భూమి పారలేదని మాట్లాడుతున్నారని, కాళేశ్వరం ఫలితం ఏమిటో గ్రామాలకు వచ్చి పారే నీళ్లను చూస్తే తెలుస్తుందన్నారు. స్థానికులకు ఉద్యోగాలు రావాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తే కాంగ్రెస్, బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకార సంఘాలలో ఇప్పటికే నమోదైన 3.6 లక్షల మందితో పాటు నూతనంగా నమోదయ్యే మత్స్యకారులందరికీ ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఫొటోతో కూడిన డిజిటల్ గుర్తింపు కార్డులు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ, రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం పాల్గొన్నారు.

కువైట్ కాన్సులేట్‌లో వీసాల పరిశీలన

నిబంధనలను మార్చిన ఆ దేశ విదేశాంగ శాఖ
- కాలయాపన, ఆర్థికభారం అంటున్న వలసకార్మికులు

మోర్తాడ్(బాల్కొండ)

మనదేశం నుంచి వెళ్లే వారికిగాను కువైట్ వీసా నిబంధనలను సవరించింది. కువైట్ నుంచి వీసాలు జారీ అయిన తరువాత అవి అసలువో నకిలీవో తేల్చడానికి ఆ దేశ కాన్సులేట్‌ల పరిశీలన కోసం పంపాల్సి ఉంది. ఈ కొత్త నిబంధన పదిహేను రోజుల కింద అమలులోకి వచ్చింది. వీసాలను కాన్సులేట్ పరిశీలన కోసం పంపడం వల్ల కాలయాపనతో పాటు ఆర్థికంగా భారం పడుతుందని వలస కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కువైట్‌లో ఉపాధి పొందాలనుకునే వారు లైసెన్స్‌డ్ ఏజెన్సీలు, లేదా తమకు తెలిసిన వారి ద్వారా వీసాలను పొందిన తరువాత పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) తీసుకోవాల్సి ఉంటుంది. గల్ఫ్ దేశాల్లో ఒక్క కువైట్‌కు మాత్రమే పీసీసీ తప్పనిసరి అనే నిబంధన ఉంది. వీసా కాపీల పరిశీలనను ఇప్పుడు అదనంగా చేర్చారు. కువైట్ నుంచి వీసాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నారు. ఈ వీసాలు అన్ని కువైట్ విదేశాంగ శాఖ ద్వారానే జారీ అవుతున్నాయి. విదేశాంగ శాఖ ఆమోదంతోనే వీసాలు జారీ కాగా, వాటిని మరోసారి తమ కాన్సులేట్‌ల్లో పరిశీలనకు పంపాలని కువైట్ ప్రభుత్వం సూచించడం అర్థరహితమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఢిల్లీ, ముంబైలోనే కాన్సులేట్‌లు

కువైట్ విదేశాంగ శాఖకు సంబంధించిన కాన్సులేట్‌లు ఢిల్లీ, ముంబైలలోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి కువైట్‌కు భారీగానే వలసలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో కాన్సులేట్ ఏర్పాటు చేయాలని కొన్ని సంవత్సరాల నుంచి వలస కార్మికులు కోరుతున్నారు. కువైట్ ప్రభుత్వం గతంలో సానుకూలంగా స్పందించినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. కువైట్ ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లో తీసుకురావడంతో కాన్సులేట్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

కేసీఆర్ మార్క్ పాలిటిక్స్‌ను తిప్పికొట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడిన నేతలంతా కేసీఆర్ రాజకీయాలు చేస్తారని ప్రస్తావించగా, బీజేపీ కూడా రాజకీయ పార్టీయేనని కేసీఆర్‌కు తగ్గట్టుగా మన వ్యూహాలు ఉండాలని చెప్పారు.

అవిశ్రాంత పోరాటం.. బీజేపీ తీర్మానం

కేసీఆర్ సర్కార్ అవినీతి, అరాచకపాలనపై బీజేపీ అవిశ్రాంత పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యవర్గం స్పష్టంచేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామయాత్ర, ప్రజాగోస–బీజేపీ భరోసా వంటి కార్యక్రమాలతో బీఆర్ఎస్‌పై జరిపే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. అన్ని రంగాల్లో విఫలమైన బీఆర్ఎస్ సర్కార్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చేలా బీజేపీని గెలిపించాలని కోరింది. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీఆర్ఎస్ తెలంగాణవాదాన్ని విడిచిపెట్టి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందని పేర్కొంది. ప్రజాక్షేత్రంలో తమ వైఫల్యాలు చర్చకు రాకుండా చేసేందుకు కేసీఆర్ రాజకీయ కుట్రకు తెరలేపారని బీజేపీ మండిపడింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసమే పుట్టినట్టుగా చెప్పుకునే పార్టీ పేరులోంచి తెలంగాణ పదాన్ని తొలగించి ప్రజలను దారుణంగా వంచించిందని ధ్వజమెత్తింది. జీహెచ్ఎంసీ, పౌరసరఫరాలు, విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టేశారని, ప్రభుత్వరంగ కార్పొరేషన్లు అప్పులతోనే నడుస్తున్నాయని ఆరోపించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈమేరకు ప్రతిపాదించిన రాజకీయతీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రతిపాదించగా, పార్టీ నేతలు ఏపీ జితేందర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి బలపరిచారు.

కాళేశ్వరంలో అవినీతి..

కేసీఆర్ నేతృత్వంలోని అవినీతి, కుటుంబ, నియంతృత్వ పాలనతో ఎనిమిదిన్నరేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తీర్మానంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసులు తమ విధులు నిర్వహించకుండా ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై తప్పుడు కేసులు బనాయించే పనిలో పడ్డారని ధ్వజమెత్తారు. మహిళలపై హత్యాచారాలు పెరగడంతో పాటు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి ముమ్మాటికి నిజమని, ఇది బీఆర్ఎస్ నేతలకు ఏటీఎంగా మారిందనే ఆరోపణకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం తీరు తెన్నులపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.గంగిడి మనోహర్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టగా, ఈటల రాజేందర్, డీకే అరుణ, సంకినేని వేంకటేశ్వర రావు బలపరిచారు. స్వతంత్ర భారతంలో తొలిసారిగా జీ–20 దేశాలకు నాయకత్వం వహించే అవకాశం తెచ్చినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించారు.

బడుగు వర్గాలను మోసం చేశారు

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల ప్రజలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఈ భేటీలో పార్టీ నేతలు చింతల రామచంద్రారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, డా.జి.విజయరామారావు, రవీంద్రనాయక్‌లు ఆయా వర్గాల వారీగా ప్రస్తావించారు. ఉప ఎన్నికలు వస్తేనే సీఎం కేసీఆర్‌కు దళితులు, బీసీలు, ఎస్టీలు గుర్తుకొస్తారని మండిపడ్డారు. హుజూరాబాద్ ఎన్నికలప్పుడు ఆర్భాటంగా ప్రకటించిన దళితబంధును సరిగా అమలుచేయకుండా దళిత సమాజాన్ని వంచించారని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో తాంత్రికుల సూచనలతో పాలన

యువరాజు, యువరాణిలతో ప్రజలు విసిగిపోయారు • బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ధ్వజం




సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'రాష్ట్రంలో తాంత్రికులు, మాంత్రికుల సూచనలతో పాలన నడుస్తోంది. తాంత్రికుడు చెప్పారని టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి తరుణ్ చుగ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబసభ్యుల మద్యం కుంభకోణంపై ఇతర రాష్ట్రాల్లోనూ చర్చ జరుగుతోందని... దేశమంతా దోచుకోవడానికే బీఆర్ఎస్ ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. మంగళవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీలో ఒక యువరాజు ఉంటే... కేసీఆర్ కుటుంబంలో యువరాజుతోపాటు యువరాణి ఉన్నారని ఎద్దేవా చేశారు. రాచరికపాలనలో యువరాజు, యువరాణి నడిపిస్తున్న పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. 'కేసీఆర్ పాలనకు కౌంట్ డౌన్ మొదలైంది. తెలంగాణలో సాయంత్రం 4 గంటల తరువాత నడిచే సర్కార్ కొనసాగుతోంది. కేసీఆర్ ప్రభుత్వం మత్తులో ఊగుతోంది. బండి సంజయ్ పాదయాత్రను ఎలా అడ్డుకోవాలి అని కుట్రలు చేస్తున్నారు. కేసీఆర్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీజేపీని ఆపలేరు' అని తరుణ్ ఛుగ్ అన్నారు. యువకులు, దళితులు, ఉద్యోగులు, డాక్టర్లు, నిరుద్యోగులు, మహిళలు, రోడ్డున పడ్డారన్నారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారని, 60 మందికి పైగా సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ అవినీతి కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించేందుకు బీజేపీ కార్యకర్తలు 9 నెలలు నిర్విరామంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశమంతా కాంగ్రెస్ పార్టీ ముగింపు దశలో ఉందని, వెంటిలేటర్‌పై కొనసాగుతోందని దుయ్యబట్టారు.

'పవర్‌పాయింట్'తో బదులిస్తాం: కిషన్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విమర్శకులకు సమాధానమిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేస్తుందన్నారు. కేంద్రం తెలంగాణకు ఏం చేసిందనే అంశంపై పూర్తి గణాంకాలతో నివేదిక తయారు చేస్తున్నామని.. స్థానిక ప్రముఖులను ఆహ్వానించి మోదీ తెలంగాణకు ఏవిధంగా ప్రాధాన్యతనిస్తున్నారో వివరిస్తామన్నారు. పవర్ ప్రాజెక్టులకు ఇచ్చే మొత్తం రుణాల్లో 16 శాతం తెలంగాణకే ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో వెయ్యి మందిని ఆహ్వానించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు. మండలస్థాయిలోనూ ఈ కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఒక్కో కుటుంబంపై రూ.6 లక్షల అప్పు: బండి



మద్యం ద్వారా తెలంగాణలో ఒక్కో కుటుంబం ఏటా రూ.50 వేల ఆదాయాన్ని కేసీఆర్ ప్రభుత్వానికిస్తే.. ఆ ఒక్కో కుటుంబంపై ఆయన రూ.6 లక్షల అప్పు గిఫ్ట్‌గా ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నేడు దివాళా తీయించారని మండిపడ్డారు. 'రూ.5 లక్షల కోట్లకు పైగా అప్పు చేశారు. పెన్షన్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు మాత్రం వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారు. 2014కు ముందు ఆయన కుటుంబ ఆస్తులెన్ని? అధికారంలోకి వచ్చాక సంపాదించిన ఆస్తులెన్ని?.. అనే విషయంపై అసెంబ్లీ సమావేశాలకు ముందే శ్వేతపత్రం విడుదల చేయాలి' అని అన్నారు. 2014 నాటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నేటి ఆర్థిక పరిస్థితి, తెచ్చిన అప్పులు, వాటిని ఏ విధంగా ఖర్చు పెట్టారనే దానిపైనా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని నీ పుట్టిన రోజు నాడు ఎలా ప్రారంభిస్తావని కేసీఆర్‌ను నిలదీశారు. అంబేడ్కర్ జయంతి రోజునే సచివాలయం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 317 జీఓ పేరుతో ఉద్యోగులను ఇంకా ఇబ్బంది పెడితే ఊరుకోబోమని.. ఈనెల 30లోగా ఆ సమస్యను పరిష్కరించి బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో అదే రోజు ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి మెడలు వంచుతామని హెచ్చరించారు.

ఆస్కార్‌కు 'నాటు.. నాటు..'

▶ మొదటి పేజీ తరువాయి

ఫీచర్ ఫిల్మ్ విభాగంలో షార్ట్‌లిస్ట్ అయిన షౌనక్ సేన్ 'ఆల్ దట్ బ్రీత్స్', డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు నామినేషన్స్ దక్కాయి. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13న) ఆస్కార్ అవార్డుల ప్రదానం జరగనుంది.

మొత్తం 23 విభాగాల్లో ప్రకటన

ఈసారి ఆస్కార్ అవార్డుల కోసం మొత్తం 23 విభాగాల్లో నామినేషన్లను వ్యాఖ్యాతలు రిజ్ అహ్మద్, అల్లిసన్ విలియమ్స్ మంగళవారం ప్రకటించారు. ఈసారి 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్'చిత్రం 11 విభాగాల్లో నామినేషన్లతో హవా కొనసాగించింది. తర్వాత 'ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్'చిత్రాలు తొమ్మిది విభాగాల్లో.. 'ఎల్విస్'సినిమా ఎనిమిది విభాగాల్లో.. 'ది ఫేబుల్ మ్యాన్స్'ఏడు, 'టార్'అండ్ 'టాప్‌గన్: మ్యావరిక్'చిత్రాలు ఆరు, 'బ్లాక్ పాంథర్: వకాండ ఫరెవర్'ఐదు, 'అవతార్: ద వే ఆఫ్ వాటర్' నాలుగు విభాగాల్లో నామినేషన్స్ సాధించాయి.

ఆ సినిమాలకు రాని చాన్స్!

ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి ఇండియా తరఫున అధికారికంగా పంపిన గుజరాతీ సినిమా 'ఛెల్లో షో'షార్ట్‌లిస్ట్‌లో ఉన్నా నామినేషన్ దక్కించుకోలేకపోయింది. దానికి బదులు 'ఆర్ఆర్ఆర్'ను అధికారిక ఎంట్రీగా పంపి ఉంటే నామినేషన్ దక్కేదేమోనని సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక 'కాంతార', 'ది కశ్మీరీ ఫైల్స్', 'విక్రాంత్ రోణ', 'గంగూబాయి కతియావాడి', 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'తదితర ఎనిమిది భారతీయ చిత్రాలు ఆస్కార్ రిమైండర్ లిస్ట్‌లో ఉన్నా.. వీటికి ఏ విభాగంలోనూ నామినేషన్ దక్కలేదు.

తెలుగులో తొలి నామినేషన్

బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో మొత్తం 15 పాటలు షార్ట్‌లిస్ట్‌లో నిలవగా, 'నాటు.. నాటు.. (ఆర్ఆర్ఆర్)'పాటతోపాటు 'టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్ (అప్లాజ్)', 'హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్ మ్యావరిక్)', 'లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్)', 'దిస్ ఈజ్ ఎ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎట్ వన్స్)'పాటలు నామినేషన్ దక్కించుకున్నాయి. ఇక ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న తొలి తెలుగు సినిమాగా 'ఆర్ఆర్ఆర్' చరిత్ర సృష్టించింది. అలాగే 'లగాన్'(2001) తర్వాత మరో భారతీయ చిత్రానికి ఆస్కార్ నామినేషన్ దక్కడం మళ్లీ ఇప్పుడే కావడం విశేషం. బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇప్పటివరకు 'మదర్ ఇండియా'(1957), 'సలామ్ బాంబే'(1988), 'లగాన్'(2001) చిత్రాలకు నామినేషన్స్ దక్కినా అవార్డులు రాలేదు.

ఉత్సాహంలో 'ఆర్ఆర్ఆర్'టీమ్..

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్'కు ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. 'నాటు నాటు..'పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా.. కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటకు నామినేషన్ దక్కడం పట్ల 'ఆర్ఆర్ఆర్'యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. 'చరిత్ర సృష్టించాం.. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 95వ అకాడమీ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్న విషయాన్ని పంచుకోవడాన్ని గర్వంగా, గౌరవంగా భావిస్తున్నాం'అని ట్వీట్ చేసింది. పలువురు సినీరంగ ప్రముఖులు 'ఆర్ఆర్ఆర్'టీమ్‌ను ప్రశంసిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

ప్రధాన విభాగాల్లో పోటీదారులు..: ఆస్కార్ ఉత్తమ చిత్రం విభాగంలో ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్, ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్, ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్, అవతార్: ది వే ఆఫ్ వాటర్, టాప్ గన్ మ్యావరిక్, ఎల్విస్‌ది ఫేబుల్‌మ్యాన్స్, టార్, ట్రయాంగిల్ ఆఫ్ సాడ్ నెస్, ఉమెన్ టాకింగ్ చిత్రాలు నామినేషన్ దక్కించుకున్నాయి.

- ఉత్తమ నటుడి విభాగంలో ఆస్టిన్ బట్లర్ (ఎల్విస్), కొలిన్ ఫార్రెల్ (ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్), బ్రెండన్ ఫ్రాసెర్ (ది వేల్), బిల్ నిగీ (లివింగ్), పాల్ మెస్కల్ (ఆఫ్టర్‌సన్) పోటీలో ఉన్నారు.
- ఉత్తమ నటి విభాగంలో కేట్ బ్లాంచెట్ (టార్), అన్నా డె అర్మాస్ (బ్లాండ్), ఆండ్రియా రైజ్‌బరో (టు లెస్లీ), మిషెల్ యో (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), మిషెల్ విలియమ్స్ (ది ఫేబుల్ మ్యాన్స్) బరిలో నిలిచారు.
- ఉత్తమ దర్శకుడి విభాగంలో మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్), డానియల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టీఫెన్ స్పీల్‌బర్గ్ (ది ఫేబుల్ మ్యాన్స్), రూబెన్ ఆస్ట్లండ్ (ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్), టడ్ ఫీల్డ్ (టార్) నామినేషన్ దక్కించుకున్నారు.

– సాక్షి సినిమా డెస్క్

జోరుగా 'నాటు.. నాటు..' వేస్తున్నా

ఆస్కార్ నామినేషన్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. అభిమానులే నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం తారక్, చరణ్‌ల కంటే జోరుగా నాటు నాటు చేస్తున్నాను. నా సినిమాలో నా పెద్దన్న పాటకు ఆస్కార్ నామినేషన్ వచ్చింది. చంద్రబోస్, ప్రేమ్ మాస్టర్, రాహుల్, భైరవల సహకారం అమూల్యమైనది. తారక్, చరణ్‌ల సింక్, స్టైల్ సూపర్. వాళ్లు ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లోకి నృత్యం చేశారు. పాట కోసం వారిని హింసించినందుకు క్షమించాలి. కానీ మళ్లీ అలా చేయడానికి వెనుకాడను. సినిమా, పాట ప్రమోషన్ కోసం పనిచేసిన అందరికీ ధన్యవాదాలు. ఇక మరో అడుగు ముందుకు వేయాలి

– ఎస్ఎస్ రాజమౌళి,
ఆర్ఆర్ఆర్ సినిమా దర్శకుడు



సాక్షి, హైదరాబాద్

పొద్దున లేస్తే హడావుడి. ఇంట్లో పనులు చక్కబెట్టుకుని ఆఫీసుకు పరుగులు పెట్టాలి. ఉదయం 9–10 గంటల నుంచి సాయంత్రం 5–6 గంటల వరకు పనేపని. ఆఫీసు నుంచి బయల్దేరగానే సరుకులు తీసుకెళ్లడమో, మరేదైనా చోటికి వెళ్లడమో ఆలోచనలు. మొత్తంగా అన్నీ కలిసి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి నెలకొంటుంది. ఆఫీసులో ఉదయం ఉత్సాహంగానే ఉన్నా.. మధ్యాహ్నం కల్లా నీరసం వచ్చేస్తుంది. ఈ క్రమంలోనే కాసేపు కునుకు తీసి, రీఫ్రెష్ అయ్యేందుకు కంపెనీలు వీలు కల్పిస్తున్నాయి.

ఆఫీసులో కునుకేస్తే!

పని మధ్యలో ఉద్యోగులకు విశ్రాంతినిస్తున్న పలు సంస్థలు

'షార్ట్ స్లీప్ ఇన్ ఆఫీస్'

కరోనా మహమ్మారి తర్వాతి పరిస్థితుల్లో ఆఫీసు పని విధానాల్లో చాలా మార్పులు వచ్చాయి. వర్క్ ఫ్రం హోంతో మొదలై హైబ్రిడ్ మోడల్ వరకు చేరాయి. ఇటీవలికాలంలో షార్ట్ స్లీప్ ఇన్ ఆఫీస్ (స్వల్ప నిద్ర) విధానం మొదలైంది. ఆఫీసు పని సమయంలో మధ్యలో స్వల్ప విశ్రాంతి తీసుకునే వెసులుబాటును పలు సంస్థలు కల్పిస్తున్నాయి. ఇందుకోసం కార్యాలయంలోనే నిద్ర పోయేందుకు వీలుగా ఏర్పాట్లను చేస్తున్నాయి. ఇలా విశ్రాంతి ఇవ్వటంతో ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గి, రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని, ఉత్పాదకత పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు.

- కార్యాలయాలలో కాసేపు నిద్ర పోయేందుకు వీలుగా ఏర్పాట్లు
- ఉద్యోగుల్లో ఉత్సాహం, ఉత్పాదకత పెరుగుదల
- ఒత్తిడి నుంచి ఉపశమనంతో ఆరోగ్యం కూడా అంటున్న నిపుణులు
- లీసియస్, వేక్‌ఫిట్, సింప్లీ లెర్న్, నో బ్రోకర్, సాల్వ్ వంటి కంపెనీలు 'నిద్ర' బాటలో..

స్టార్టప్ కంపెనీల్లో ఎక్కువగా..



సాధారణ ఆఫీసులలో లాగా స్టార్టప్ కంపెనీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు అంటూ పనివేళలు ఉండవు. ఉదయం, సాయంత్రం మరింత ఎక్కువ సమయం పనిచేయాల్సి ఉంటుంది. అలాంటి సంస్థలలో ఉద్యోగులకు పని మధ్యలో కాసేపు విశ్రాంతి ఇస్తే.. అన్ని వేళల్లో ఒకేరకమైన ఏకాగ్రతతో పనిచేయగలుగుతారని నిపుణులు చెప్తున్నారు. ఫర్నిచర్ కంపెనీ వేక్‌ఫిట్ తాజాగా 'రైట్ టు న్యాప్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో ప్రతి ఉద్యోగి రోజూ మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల వరకు కునుకు తీయవచ్చు.

నిద్ర ఒక్కటే కాదు..

ఆఫీసులో నిద్ర గదులేకాదు.. బ్రేక్ అవుట్ జోన్‌లు, మీటింగ్‌లు లేనిరోజు వంటి వినూత్న పని విధానాలను కూడా సంస్థలు అందుబాటులోకి తెస్తున్నాయి. ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాయి. ఎక్కువసేపు ఒకేచోట కూర్చోకుండా మధ్యలో కాసేపు వాకింగ్, ధ్యానం చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నాయి. టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌లను కూడా అందిస్తున్నాయి. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగులకు మీటింగ్‌లు లేని వారం, రోజు అని ముందుగానే సమాచారం ఇస్తున్నాయి. దీంతో ఉద్యోగులు జాబ్ తర్వాత వ్యక్తిగత పనుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకునే వీలు ఉంటుంది.

ఏ కంపెనీలలో ఉందంటే..

లీసియస్, సింప్లీ లెర్న్, సాల్వ్, నో బ్రోకర్, వేక్‌ఫిట్, రేజర్‌పే వంటి యువ యాజమాన్య కంపెనీలు, స్టార్టప్స్ తమ ఉద్యోగులు ఆఫీసులో స్వల్ప సమయం పాటు కునుకుతీసే వెసులుబాటును కల్పిస్తున్నాయి.

నిపుణులు చెప్తున్న లాభాలివీ..

- పని మధ్యలో విశ్రాంతి వల్ల ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారు.
- పనిలో ఉత్పాదకత మరింతగా పెరుగుతుంది.
- దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా నిర్ణయాలు తీసుకోగలుగుతారు.
- మానసిక, శారీరక ఒత్తిడి లేకుండా ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయగలుగుతారు.
- చీటికి మాటికీ అనారోగ్య సమస్యలతో గైర్హాజరు కావటం తగ్గుతుంది.
- ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటుండటంతో ఉద్యోగులకు యాజమాన్యంపై గౌరవం పెరుగుతుంది.

వీ హబ్‌లో మదర్స్ రూమ్

పని మధ్యలో కొంత సమయం విశ్రాంతి అనేది మహిళా ఉద్యోగులకు అత్యవసరం. అందుకే వీ–హబ్‌లో మదర్స్ రూమ్, రిలాక్స్ రూమ్ వంటి ప్రత్యేక వసతులను ఏర్పాటు చేశాం. ఉద్యోగులకు 24/7 భద్రత, అవసరమైన వసతులను కల్పించినప్పుడే వారు ఉత్సాహంగా పనిచేయగలుగుతారు.

– దీప్తి రావుల, సీఈఓ, వీ–హబ్

కాసేపు నిద్ర మా పాలసీలో భాగం



మా కంపెనీలో ఉద్యోగుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మధ్యాహ్నం అరగంట సేపు ఉద్యోగులకు నిద్ర సమయం అనేది పాలసీలో భాగం చేశాం. కాసేపు విశ్రాంతితో ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పని మీద ఏకాగ్రత చూపుతున్నారు.

– ఉమానాథ్ నాయక్, హెచ్‌ఆర్ హెడ్, వేక్‌ఫిట్

31లోగా 'వేతన' ప్రకటన చేయాలి

- ఫిబ్రవరి 2న విద్యుత్ సౌధ ముట్టడి, మహాధర్నా
- తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటన



ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న విద్యుత్ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై ఈ నెల 31లోగా ప్రకటన చేయాలని, లేనిపక్షంలో వచ్చే నెల 2 నుంచి ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటించింది. ఫిబ్రవరి 1న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని, 2న విద్యుత్ సౌధ ముట్టడి, మహాధర్నా నిర్వహిస్తామని వెల్లడించింది. జేఏసీ నేతలు మంగళవారం విద్యుత్ సౌధలో తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అమల్లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ గడువు గతేడాది మార్చి 31తో ముగిసిపోగా, అదే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉందని నేతలు జి.సాయిబాబు, రత్నాకర్‌రావు, శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పీఆర్సీపై గతేడాది మే 30న సంప్రదింపుల కమిటీని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఏర్పాటు చేసినా, ఇప్పటి వరకు పీఆర్సీపై ప్రకటన చేయలేదన్నారు. 1999, అక్టోబర్ 2 నుంచి 2004, ఆగస్టు 31 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్‌కి బదులు జీపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు.

క్లుప్తంగా...

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌ఈడీ)) ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఫిబ్రవరి 20 నుంచి మార్చి 29 వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని బీఐఆర్‌ఈడీ డైరెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, ఎమ్మెస్ ఆఫీస్‌కు ఇంటర్‌పాస్ ఆపై విద్యార్హత, మొబైల్ సర్వీసింగ్‌కు పదోతరగతి పాస్ ఆపై విద్యార్హత, రిఫ్రిజిరేటర్, ఏసీరిపేర్‌కు టెన్త్ పాస్ లేదా ఫెయిల్ విద్యార్హతలుగా పేర్కొన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సదుపాయం ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు తమ వెబ్‌సైట్ www.bired. org ద్వారా వచ్చేనెల 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మళ్లీ వీఆర్‌ఏల సమ్మె 'సైరన్'!

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) మళ్లీ ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి రెండేళ్ల క్రితం శాసనసభలో ప్రకటించిన విధంగా వీఆర్‌ఏలకు పేస్కేలు, అర్హులైన వారికి పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో 80 రోజుల పాటు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. అయితే మునుగోడు ఎన్నికల సమయంలో రెవెన్యూ జేఏసీని చర్చలకు పిలిచిన అధికార యంత్రాంగం.. ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, తమను కార్యాలయాల చుట్టూ తిప్పి కాలయాపన చేశారు తప్పితే కార్యాచరణ చేయలేదని మంగళవారం పటాన్‌చెరులో నిర్వహించిన వీఆర్‌ఏ జేఏసీ సమావేశంలో సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 28లోగా ప్రభుత్వం చర్చలకు పిలిచి కార్యాచరణ ప్రకటించాలని, లేకుంటే అదేరోజు తమ ఆందోళన కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ చైర్మన్ రాజయ్య తెలిపారు. ఈ సమావేశంలో కో చైర్మన్ రమేశ్ బహదూర్, సెక్రెటరీ జనరల్ దాదెమియా, కన్వీనర్ సాయన్న, కో కన్వీనర్ వెంకటేశ్, వంగూరు రాములుతో పాటు అన్ని జిల్లాల జేఏసీలు పాల్గొన్నాయి.

'హాథ్‌సే హాథ్ జోడో' ఇన్‌చార్జ్‌ల నియామకం



సాక్షి, హైదరాబాద్: ఈనెల 26వ తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్న హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల కోసం కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీ లను నియమించింది. యాత్రలను క్షేత్రస్థాయి నుంచి సమన్వయం చేయడం కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులకు బాధ్యతలు అప్పగిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుమతి మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జీరో సర్వీసుతో బదిలీలకు వినతి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీల్లో జీరో సర్వీసు నిబంధనకు అవకాశం ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం అధ్యక్షుడు ఎం.చెన్నయ్య డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, వెబ్ ఆప్షన్లలో 'నాట్ విల్లింగ్' ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ 'పరేడ్'!

▶ మొదటి పేజీ తరువాయి

పుట్టినరోజు సందర్భంగా ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం కొత్త సచివాలయానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం నిర్విరామంగా శ్రమిస్తోంది. వేద పండితుల సూచన మేరకు ఫిబ్రవరి 17వ తేదీ శుక్రవారం ఉదయం వాస్తుపూజ, చండీయాగం, సుదర్శనయాగం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి. తర్వాత 11.30 గంటల నుంచి 12.30 గంటల మధ్య సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. తర్వాత పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభలో ఆహ్వానిత ముఖ్యమంత్రులతో పాటు ఇతర నేతలు పాల్గొంటారు.

ఖమ్మం సభ తరహాలో.. : కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం, కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభను నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలతోపాటు యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, వామపక్షాల జాతీయ నేతలు పాల్గొన్నారు. అదే తరహాలో సచివాలయ ప్రారంభోత్సవం, పరేడ్‌గ్రౌండ్స్ సభను నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఆ రాష్ట్ర సీఎం నితీశ్‌కుమార్ తరఫున జేడీయూ జాతీయ అధ్యక్షుడు లలన్ సింగ్, బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్‌తో పాటు మరికొందరు ముఖ్య నేతలు పాల్గొంటారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు.

నాలుగు రోజుల తేడాలోనే..: పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ మోదీ సభకు, బీఆర్‌ఎస్ సభకు మధ్య కేవలం నాలుగు రోజులే గడువు ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే భారీగా జన సమీకరణతో సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ సభకు తమిళనాడు, జార్ఖండ్ సీఎంలు, బిహార్ ఉప ముఖ్యమంత్రి, ఇతర నేతలు హాజరుకానుండటం బీఆర్‌ఎస్‌కు జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత పెరిగేందుకు దోహదం చేస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. సభకు జన సమీకరణ, ఏర్పాట్లకు సంబంధించి సీఎం కేసీఆర్.. త్వరలో గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిసింది.

దేశమంతా తెలంగాణ పథకాలు కావాలి

కవితతో భేటీలో కర్ణాటక, తమిళనాడు, కేరళ రైతు నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని తాము కోరుకుంటున్నట్లు కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. మూడు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల నేతలు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందించడం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ఇతర రాష్ట్రాల రైతులు కూడా కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు.



మంగళవారం సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి వేముల

ముహూర్తం దగ్గర పడింది.. వేగం పెంచండి

- కొత్త సచివాలయ పనులపై సీఎం కేసీఆర్ ఆదేశం
- నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయ భవనాన్ని ప్రారంభించేందుకు సమయం దగ్గరపడిందని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఫిబ్రవరి 17న సచివాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో.. సోమవారం సాయంత్రం ఆయన దాదాపు రెండు గంటల పాటు నిర్మాణ పనులను పరిశీలించారు. లుంబినీ పార్కు వైపు నిర్మిస్తున్న ప్రధాన ద్వారం, దాని ముందు విస్తరిస్తున్న రోడ్డు, లోపలికి వేస్తున్న రోడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. నైరుతి దిక్కున నిర్మిస్తున్న బ్యాంకులు, క్యాంటీన్, మీడియా సెంటర్, సందర్శకుల వెయిటింగ్ బ్లాక్, ప్రార్థనా మందిరాలను చూసి.. వాటి పురోగతిపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగుల కోసం విడిగా నిర్మిస్తున్న భవనం, పార్కింగ్ స్థలం, దాని సామర్థ్యం తదితర వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పచ్చిక బయళ్లు, ఫౌంటెయిన్లను పరిశీలిస్తూ.. మొదటి అంతస్తుకు చేరుకుని ఫ్లోరింగ్, సీలింగ్, ఫర్నిచర్‌ను పరిశీలించారు. తర్వాత లిఫ్టు ద్వారా ఆరో అంతస్తుకు చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి, సీఎస్ చాంబర్లు, సమావేశ మందిరాలను పరిశీలించి పలు మార్పులు సూచించారు. ఈ చోట్ల ఏర్పాటు చేసే కళాకృతులు మరింత సృజనాత్మకంగా ఉండాలన్నారు. సచివాలయం పైనుంచి ప్రాంగణం, పరిసర ప్రాంతాలను కేసీఆర్ పరిశీలించారు. సీఎం వెంట మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, ఆరూరి రమేశ్, దివాకర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆ మిల్లులే ఎందుకు స్పెషల్?

▶ మొదటి పేజీ తరువాయి



చేయకుండా పక్కదారులు పట్టిస్తుండడం ఇటీవలి కాలంలో పెరిగింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా పలుమార్లు సీరియస్ కాగా రాష్ట్ర ప్రభుత్వం సంజాయిషీ చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది. అయినా రాష్ట్రంలోని కొందరు మిల్లర్ల తీరులో మార్పు రాకపోగా, అక్రమాలకు పాల్పడే మిల్లుల పట్ల పౌరసరఫరాల శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది.

మూడేళ్లు దాటినా 118 మిల్లులకు పూర్తి సహకారం...

మూడేళ్ల క్రితం 2019–20 యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కోసం మిల్లులకు ధాన్యం కేటాయించగా, 118 మంది మిల్లర్లు 1,00,427 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అప్పగించకుండా మాయం చేశారు. ఈ బియ్యం విలువ సుమారు రూ. 230 కోట్లు. ఈ బియ్యాన్ని తిరిగి రాబట్టుకునేందుకు 2020–21 వరకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ నేపథ్యంలో మిల్లర్లకు సంబంధించిన ఓ నాయకుడు , ప్రభుత్వంలోని పెద్దలు రంగ ప్రవేశం చేసి ఆయా మిల్లర్లపై చర్యలు తీసుకోకుండా అడ్డుపడ్డట్టు సమాచారం. దీంతో సదరు మిల్లర్లకు.. మాయమైన బియ్యాన్ని తిరిగి అప్పగించేందుకు ప్రభుత్వం గడువు ఇస్తూ వచ్చింది. రెండేళ్లు గడువు ఇచ్చినా స్పందించకపోవడంతో స్వాహా చేసిన లక్ష మెట్రిక్ టన్నుల బియ్యానికి 25 శాతం అదనంగా ఇవ్వాలని, బియ్యం విలువపై 12 శాతం వడ్డీని చెల్లించాలని రెండు నెలల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. అయినా ఆ 118 మంది మిల్లర్లు కనీసంగా ఆ ఆదేశాలను పట్టించుకోలేదు. దాంతో డిసెంబర్ నెలాఖరు వరకు తొలుత గడువు ఇచ్చిన అధికారులు తరువాత గుట్టు చప్పుడు కాకుండా ఈ జనవరి నెలాఖరు వరకు గడువు పెంచారు. అయినప్పటికీ చాలా మంది మిల్లర్ల నుంచి స్పందన లేదని పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు.

అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా.. యథావిధిగా సీఎంఆర్

సీఎంఆర్ కోసం ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని 118 మిల్లులు పక్కదారి పట్టించినట్లు పౌరసరఫరాల శాఖకు తెలిసినప్పటికీ... మూడేళ్లుగా యథాతథంగా సీఎంఆర్ కింద ధాన్యాన్ని కేటాయిస్తూనే ఉన్నారు. గత రెండు మూడేళ్లుగా కొన్ని జిల్లాల్లో సీఎంఆర్ ఇవ్వని మిల్లులకు ధాన్యం కేటాయించకుండా చర్యలు తీసుకున్నట్లు చెపుతున్న అధికారులు 'ఈ 118' మిల్లులకు మాత్రం ఏరోజూ ధాన్యం కేటాయింపు నిలుపుదల చేయలేదని తెలుస్తోంది. వాటికి ఎందుకంత ప్రాధాన్యత ఇస్తున్నారు... ఏకంగా రూ.230 కోట్ల విలువైన బియ్యాన్ని మాయం చేసిన మిల్లులను రక్షిస్తున్న వారెవరు అని పౌరసరఫరాల శాఖలోనే చర్చ జరుగుతోంది. ఈనెలాఖరు లోగా ఇవ్వాల్సిన లక్ష మెట్రిక్ టన్నుల్లో ఎంత మేర అప్పగిస్తారో తెలియదు కానీ... మరోసారి గడువు పెంచేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

సాక్షి

బుధవారం, జనవరి, 25

బాయ్‌కాట్ చేయాల్సింది ఇదీ!

ఇది నిజంగా అసాధారణమే. ఒక జాతీయ పార్టీ కీలక సారథి, అందులోనూ ప్రధానమంత్రి హోదాలో దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి ఈ తరహా సూచన చేయడం మునుపెన్నడూ కనలేదు, వినలేదు. సినిమాల లాంటి అసంగతమైన వాటిపై అనవసర వ్యాఖ్యలు చేసి, మన కఠోరశ్రమపై నీలినీడలు కమ్ముకొనే పరిస్థితి తేవద్దని ప్రధాని నరేంద్ర మోదీ అధికార బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఇటీవల అన్నారన్న వార్త అందుకే ప్రధానమైనది. మోదీ వ్యాఖ్యలకు తాజా ప్రేరణ - షారుఖ్ ఖాన్ నటించిన తాజా హిందీ చిత్రం 'పఠాన్'పై కొందరు బీజేపీ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు, వివాదాలు. ఒకపక్క సోషల్ మీడియాలో బాయ్‌కాట్ ప్రచారాలు, మరోపక్క సినీ ప్రముఖుల గత చరిత్రలు, సినిమాల్లో దుస్తులపై అత్యుత్సాహ రాజకీయ దుమారాలు కలసి కొన్నేళ్ళుగా హిందీ చిత్రసీమ ఉక్కిరిబిక్కిరి అవుతున్న వేళ మోదీ మాట ఒకింత ఊరట.

ఏ సందర్భంలో, ఏ ఉద్దేశంతో ఇచ్చినప్పటికీ ఆ స్థాయి వ్యక్తి ఇలాంటి సలహా ఇవ్వాల్సిన పరిస్థితి రావడం దేశంలో నెలకొన్న అసహన వాతావరణానికి అద్దం పడుతోంది. సోషల్ మీడియాలో హిందీ సినీ పరిశ్రమను కొన్నాళ్ళుగా వెంటాడుతున్న భూతం – బాయ్‌కాట్ ప్రచారం. విమర్శలు, ట్రోలింగ్‌ల నుంచి చివరకిది సంక్షోభం స్థాయికి వెళ్ళింది. ఆ మాటకొస్తే కొన్ని సినిమాలపై విద్వేష ప్రచారాలు, బాయ్‌కాట్ పిలుపులతో గడచిన 2022 'బాయ్‌కాట్ బాలీవుడ్' నామ సంవత్సరంగా పాపులరైంది. చిత్రంగా బాయ్‌కాట్లేవీ జనంలో నుంచి తమకు తాము వచ్చినవి కావు. కొన్ని ట్విట్టర్ ఖాతాలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల తతంగం. ప్రత్యేకించి నిర్ణీత సినిమాలపైనే, వాటి రిలీజ్ వేళే సోషల్ మీడియా విద్వేషం వెళ్ళగక్కడం, మతోన్మాదపు మాటలతో లక్షలకొద్దీ ట్వీట్లు వెల్లువెత్తడం ఓ పకడ్బందీ పథకమే.

నిరుడు అలియా భట్ 'డార్లింగ్స్', ఆమిర్‌ఖాన్ 'లాల్‌సింగ్ చద్దా', విజయ్ దేవరకొండ 'లైగర్', రణబీర్ కపూర్ 'బ్రహ్మాస్త్ర'– ఇలా అనేకం బాయ్‌కాట్ విద్వేషం బారిన పడ్డవే. ఆ వరుసలో తాజా చేరిక 'పఠాన్'. ఈ యాక్షన్–థ్రిల్లర్ గూఢచారి చిత్రం 57 ఏళ్ళ వయసులో షారుఖ్ కెరీర్‌తో పాటు కరోనా నుంచి కుదేలైన హిందీ చిత్రసీమనూ మళ్ళీ పట్టాలెక్కిస్తుందని ఓ ఆశ. ఆ పరిస్థితుల్లో అందులోని 'బేషరమ్' పాటపై, ఆ పాటలో నాయిక ధరించిన ఆరెంజ్ రంగు బికినీపై, పాటలోని కొన్ని పదాలపై మధ్యప్రదేశ్ మంత్రి సహా విశ్వహిందూ పరిషత్ తదితర మితవాద సంస్థలు నిరసనల మొదలు నిషేధాల బెదిరింపుల దాకా వెళ్ళారు. చివరకు తమ నియామకమైన సెన్సార్ బోర్డ్ ఛైర్మన్ ప్రసూన్ జోషీ చేతనే ధర్మోపన్యాసాలు చెప్పించి, భావప్రకటనా స్వేచ్ఛను గాలికొదిలి సినిమాలో మార్పులు చేయించడం అప్రజాస్వామికమే.

అధికార పక్షానికి దగ్గరైన సినీ పెద్దలకూ ఈ సెగ తగిలి, కథ విదేశీ మీడియా దాకా వెళ్ళిందంటే తప్పెవరిది? ఎప్పుడూ పెదవి విప్పని అమితాబ్ సైతం కోల్‌కతా అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేదికపై పౌరహక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడాల్సి వచ్చింది. హీరో సునీల్ శెట్టి అస్తుబిస్తయిన చిత్రసీమ అవస్థను యూపీ సీఎంకు మొరపెట్టుకోవాల్సి వచ్చింది. పరిస్థితి చేయిదాటినప్పటికీ, ఇప్పటికైనా ప్రధాని తన వారికి సుద్దులు చెప్పడం చిరు సాంత్వన. అయినా సరే గోల పూర్తిగా సద్దుమణగలేదు. హిందూ స్వామీజీ అవిముక్తేశ్వరానంద సరస్వతి ఏకంగా 'ధర్మ సెన్సార్ బోర్డ్' పెట్టి, సినిమాల్లో సనాతన ధర్మ వ్యతిరేకత ఉంటే అడ్డుకుంటామనడం పరాకాష్ఠ.

జన్మనిచ్చిన తల్లితండ్రుల నుంచి ఇస్లామ్ ధర్మాన్ని గ్రహించి, క్రైస్తవ పాఠశాలలో చదువుకొని, ఢిల్లీ రామ్‌లీలా ఉత్సవాల్లో వానర వీరుడిగా నటించి, 'జై సీతారామ్‌కీ' అని నినదించి, హిందూస్త్రీని వివాహమాడి, పిల్లల్ని లౌకిక భారతీయులుగా పెంచుతున్న షారుఖ్ ఇవాళ ఈ ఉన్మాదులకు తన నిజాయతీని నిరూపించుకోవాల్సి రావడం సమాజానికే సిగ్గుచేటు. సెన్సారైన సినిమాలు సైతం కొన్నేళ్ళుగా చిక్కుల్లో పడుతున్నాయి. ఇందిరా గాంధీ కాలపు 'ఆంధీ', 'కిస్సా కుర్సీకా' నుంచి టీవీ సీరియల్ 'తమస్' (1988) మీదుగా ఇటీవలి 'పద్మావత్' (2018) దాకా అనేక చిత్రాలు కుల, మత, రాజకీయాల పేర అభ్యంతరకర చిత్రీకరణ అంటూ మూకస్వామ్యం పాలబడ్డాయి.

సెన్సార్ సర్టిఫికెట్లకూ, చట్టానికీ అతీతంగా వ్యవహరిస్తున్న రాజకీయ, నైతిక పోలీసు మూకల ముందు మోకరిల్లాల్సి వస్తున్న సినీసీమ ఇకనైనా ఒక్కతాటిపైకి రావాలి. సెన్సార్ బోర్డ్ సంస్కరణలపై మళ్ళీ చర్చ లేవనెత్తాలి. ఒకప్పుడు సెన్సార్ బోర్డ్ నిర్ణయాలపైనా అప్పీల్ చేసుకొనేందుకు అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉండేది. ఘనత వహించిన సర్కార్ గత ఏడాది దాన్ని ఏకపక్షంగా రద్దు చేసేసింది. ఇక, 2016 నాటి శ్యామ్‌బెనెగల్ కమిటీ, 2013 నాటి జస్టిస్ ముకుల్ ముద్గల్ కమిటీల సిఫార్సులకు అతీగతీ లేదు. వాటిని అమలు చేసేలా పాలకులను ఒప్పిస్తే మంచిది.

ఏమైనా, దేశంలో అన్నిటికీ అసహనం పెరిగిపోతున్న వేళ కళను కళగా చూడడం నేర్చుకోవాలి. అసభ్యాలు, అభ్యంతరాలుంటే అడ్డుకోవడానికి ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన సెన్సార్ బోర్డ్, పోలీసు వ్యవస్థ ఉండనే ఉన్నాయి. వాటిని తోసిరాజని రాజ్యాంగేతర నైతిక సెన్సారింగ్, పోలీసింగ్ చేయాలనుకోవడమే పెద్ద తప్పు. వీటికి తక్షణం అడ్డుకట్ట పడకపోతే... అనేక కులాలు, ధర్మాలు, భావజాలాల సహజీవనంతో రంగురంగుల ఇంద్రచాపమైన మన సంస్కృతి మొత్తానికీ ఒకే దేశం - ఒకే భావజాలం – ఒకే సంస్కృతి అనే దురవస్థ పడుతుంది. అప్పుడు కళ కాంతి తప్పుతుంది. వేల ఏళ్ళ చరిత్ర గల భారతావని కళవళ పడుతుంది. తస్మాత్ జాగ్రత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.చవితి రా.6.32 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.2.06 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.9.23 నుండి 10.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.51 నుండి 12.33 వరకు, **అమృతఘడియలు:** సా.6.30 నుండి 8.01 వరకు

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

డాక్యుమెంటరీ అంతా డొల్లతనమే!

విశ్లేషణ



వెంపటి శశి శేఖర్

భారత ప్రధాని నరేంద్ర మోదీపై బీబీసీ గతవారం ప్రసారం చేసిన డాక్యుమెంటరీ.. 'ఇండియా : ది మోదీ క్వశ్చన్' ప్రపంచవ్యాప్తంగా పెను వివాదాన్ని రాజేసింది. డాక్యుమెంటరీపై ఇండియా తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆ లింకులను తక్షణం బ్లాక్ చేయాలని ట్విట్టర్, యూట్యూబ్‌లను ఆదేశించింది. బ్రిటన్ ప్రధాని రుషి సునాక్ డాక్యుమెంటరీలోని అంశాలను తాను పూర్తిగా అంగీకరించడం లేదని ఇప్పటికే ప్రకటించగా, తాజాగా అమెరికా స్పందించింది. 'భారత్–అమెరికా' భాగస్వామ్య విలువలే తమకు ముఖ్యం అంటూ.. వివాదానికి దూరంగా జరిగింది! కాగా, 2002 నాటి గుజరాత్ అల్లర్లు కేంద్ర బిందువుగా బీబీసీ ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సమయంలోనే భారత్‌లోని ఆ సంస్థ రిపోర్టర్ ఒకరు గత 20 ఏళ్లలో దేశంలో భారీస్థాయి హింసాత్మక సంఘటనలు తగ్గిపోయాయని ఒక కథనం ప్రసారం చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ డాక్యుమెంటరీ వ్యవహారం చూస్తూంటే... మిగతా విపరిణామాలతో పాటూ భారత్‌తో యూకే సంబంధాలూ దెబ్బతినే ప్రమాదం ఉందేమో అనిపిస్తోంది.

'ద బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్' (బీబీసీ) యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వ అధికార ప్రజా ప్రసార సంస్థ. రాయల్ ఛార్టర్ కింద ఏర్పాటైంది. బీబీసీకి ఆర్థిక నిధులు ప్రధానంగా యూకే ప్రజల నుంచి వసూలు చేసే లైసెన్స్ ఫీజు ద్వారా అందుతాయి. ఇలా ప్రజల సొమ్ము బీబీసీకి ఇవ్వడంపై ఇటీవల విమర్శలూ వచ్చాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు. ప్రేక్షకులు, వీక్షకులు.. ఓటీటీలతో పాటు, ఇతర డిజిటల్ మాధ్యమాల వైపు మళ్లుతూండటం, బీబీసీ సంపాదకీయ వర్గ పోకడలపై తీవ్రమైన ప్రశ్నలు వస్తూండటం, రాజకీయ వివక్ష వంటివి ఆ కారణాల్లో కొన్ని. తాము స్వతంత్రంగానే ఉన్నామని, నిష్పాక్షికంగానే వ్యవహరిస్తున్నామని బీబీసీ చెబుతున్నా దేశపు వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు అది బ్రిటిష్ నిఘా వర్గాలకు సాయంగా నిలవడం దశాబ్దాలుగా జరుగుతున్న విషయం బహిరంగ రహస్యం కూడా.

వివక్షాపూరితం

భారత్‌లో ఇటీవలి కాలంలోనూ బీబీసీ సంపాదకీయ వర్గం పోకడలు వివక్షాపూరితంగా ఉన్న ఆరోపణలు వచ్చాయి. మరీ ముఖ్యంగా 'సిటిజన్ షిప్ ఎమెండ్‌మెంట్ యాక్ట్'పై ఢిల్లీలో జరిగిన అల్లర్ల విషయంలో బీబీసీ రెచ్చగొట్టేలా వ్యవహరించిందని, కోవిడ్ మరణాలపై కూడా సున్నితంగా వ్యవహరించలేదని ఆరోపణలున్నాయి. అందుకే.. బీబీసీ ప్రధాని నరేంద్రమోదీ, ముస్లిం సమాజాలను కేంద్రంగా చేసుకుని రెండు భాగాల డాక్యుమెంటరీ ప్రసారం చేయాలని నిర్ణయించడం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు.

ఈ డాక్యుమెంటరీల్లో తొలి భాగం జనవరి 17వ తేదీ ప్రసారమైంది. ఆ డాక్యుమెంటరీని చూస్తే ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. యూకే ప్రజల సొమ్ముతో నడిచే బీబీసీ... భారత్ లాంటి దేశాల్లో వాణిజ్య అవసరాల కోసమే పనిచేస్తూండవచ్చునని అనుకోవచ్చు. మరిన్ని ఎక్కువ క్లిక్‌లు వచ్చేలా శీర్షికలు పెట్టడం కూడా అందుకే. అయితే 2002 నాటి గుజరాత్ అల్లర్లు కేంద్ర బిందువుగా బీబీసీ ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సమయంలోనే భారత్ లోని ఆ సంస్థ రిపోర్టర్ ఒకరు గత 20 ఏళ్లలో దేశంలో భారీస్థాయి హింసాత్మక సంఘటనలు తగ్గిపోయాయని ఒక కథనం ప్రసారం చేయడం ఆసక్తి రేకెత్తిస్తోంది. భారత్‌లో మతాల మధ్య అంతరాన్ని ఉపయోగించుకోవాలని బీబీసీ ఎందుకు అనుకుంటోందన్నది పెద్ద ప్రశ్న. అది కూడా పెద్దపెద్ద ఘర్షణలనేవి దాదాపుగా లేని ఈ పరిస్థితుల్లో?

ఈ విషయాలను కాసేపు పక్కనబెట్టినా ఈ డాక్యుమెంటరీలో గుజరాత్ అల్లర్ల విషయాన్ని చూపిన విధానంపై మాత్రం నిశిత పరిశీలన జరపాల్సిందే. ఎందుకంటే.. ఈ దేశపు అత్యున్నత న్యాయస్థానం తన అభిప్రాయాన్ని స్పష్టం చేసిన అంశంపై ఈ డాక్యుమెంటరీ మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతోంది. అంతేకాదు.. భారత్, యూకేల మధ్య దౌత్య సంబంధాలను కూడా దెబ్బతీసేలా ఉందీ డాక్యుమెంటరీ. తొలి భాగం మొత్తం 2002 నాటి గుజరాత్ మతఘర్షణలు తరువాతి పరిణామాలపై తీశారు. బీబీసీ ఆ కాలంలో తీసిన వీడియో ఫుటేజీలు, అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన ఇంటర్వ్యూలను ఈ డాక్యుమెంటరీలో వాడుకున్నారు. ఇది ఓ తప్పుడు వాదన తాలూకూ పునరుక్తి మినహా మరోటి కాదు. ఈ రకమైన వాదనతోనే అల్లర్లపై ఇరవై ఏళ్లపాటు కోర్టు కేసులు నడిచాయి. ఆ తరువాత సుప్రీంకోర్టు వాటిని చెత్తబుట్టలో వేసేసింది. గుర్తు తెలియని మోదీ వ్యతిరేకులపై ఆధారపడుతూ చేసిన ఈ డాక్యుమెంటరీ కొత్తగా చెప్పేదేమీ లేదు... పాతగాయాలను మళ్లీ రెచ్చగొట్టి కోపం, విద్వేషాలను పెంపొందించడం మినహా!



ఘటనల క్రమాన్ని మార్చింది

ఈ డాక్యుమెంటరీలోని మొత్తం విషయంలో ఐదు అంశాల గురించి వివరణ అవసరమవుతుంది. మొట్టమొదటగా చెప్పుకోవాల్సింది ఘటనల క్రమాన్ని మార్చిన విధం. 2002 ఫిబ్రవరిలో జరిగిన గోధ్రా ఘటన తరువాత డిసెంబరులో గుజరాత్ ఎన్నికలు జరిగినట్లు చూపించారు. వర్గాలుగా చీల్చే ప్రయత్నం అన్నమాట. ఈ క్రమంలో సెప్టెంబరులో అక్షరధామ్‌పై జరిగిన ఉగ్రదాడి గురించి అస్సలు ప్రస్తావనే లేదు. అలాగే అక్షరధామ్ దాడి తరువాత పరిస్థితిని అత్యద్భుతంగా చక్కదిద్దిన వైనమూ లేకుండా పోయింది. ఇక రెండో విషయానికి వద్దాం. అది.. హింసకు సంబంధించిన లెక్కల్లోని డొల్లతనం. కొన్ని ఘటనలను పెద్దవిగా చూపేందుకు గ్రాఫిక్‌లు కూడా వేశారు కానీ.. 2002 అల్లర్లను పోలీసులు ఎలా అదుపు చేశారన్న విషయంలో వాస్తవాలను విస్మరించారు. మొత్తం 4,247 కేసులు నమోదయ్యాయనీ, 26,974 మందిని అరెస్ట్ చేశారనీ, గుంపులను చెదరగొట్టేందుకు ఏకంగా 15,369 భాష్పవాయు గోళాలు వాడారనీ, తొలి 72 గంటల్లోనే పోలీసులు 5450 రౌండ్ల బుల్లెట్లు ప్రయోగించిన ఫలితంగా 101 మంది ఆందోళనకారులు మరణించారనీ బీబీసీకి తెలియకుండా ఏమీ ఉండదు. బీబీసీ డాక్యుమెంటరీతో వచ్చిన మూడో చిక్కేమిటంటే.. వాళ్లూ వీళ్లూ చెప్పిన విషయాలపై ఎక్కువగా ఆధారపడటం. సాక్షులు, సాక్ష్యాలు ఏవీ కొత్తగా లేకపోవడం.

నిజానికి రెండు దశాబ్దాలపాటు నరేంద్ర మోదీని ఏదో ఒక రకంగా వ్యక్తిగతంగానైనా 2002 అల్లర్లలో ఇరికించాలని బోలెడన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇవన్నీ కూడా తప్పుడు ఆరోపణలు, సందేహాస్పద వ్యక్తుల మాటలపై ఆధారపడి చేసినవే. న్యాయస్థానాలు వీటి డొల్లతనాన్ని ఎప్పుడో తేల్చేశాయి. ఊరూపేరూ లేని వారి మాటలను వ్యాప్తి చేయడం.. అపవాదులు మోపడం మాత్రమేనని స్పష్టం చేశాయి. నాలుగవ సమస్య గురించి చూద్దాం. ఇందులో వ్యక్తులను ఉదాహరించిన పద్ధతి ప్రశ్నార్థకమైంది. సుప్రీంకోర్టు సమగ్రతను ప్రశ్నించేలా ఉన్నాయి ఇవి. చివరదైన ఐదవ సమస్య... బ్రిటిష్ దౌత్య కార్యాలయం నిర్వహించిందని చెబుతున్న రహస్య విచారణ. ఇందులో సత్యమెంతో, అవాస్తవాలెన్నో ఎవరికీ తెలియదు.

చిచ్చు పెట్టేందుకే...

అయితే.. ఈ డాక్యుమెంటరీలో బ్రిటిష్ విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి రహస్య విచారణపై అధికారికంగా ప్రకటన చేయడం వివాదాస్పద పోకడకు శ్రీకారం చుట్టినట్టు అవుతుంది. బీబీసీ తనదైన విదేశీ విధానాన్ని అమలు చేయాలని.. దౌత్యపరమైన ఇబ్బందులతో తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. భారత్‌లో మరోసారి మత ఘర్షణల చిచ్చు పెట్టేందుకు బీబీసీ చేసిన ఈ ప్రయత్నం.. తుది శ్వాస తీసుకుంటున్న తరుణంలో మనుగడ కోసం చేసిన నిష్ఫల ప్రయత్నంగా తోస్తోంది. బీబీసీ అధ్యక్షుడు ఇటీవల బీబీసీ ఏర్పాటు ఉద్దేశాల్లో పబ్లిక్ సర్వీస్ అన్నది తొలిగి పోయేలా ఉందని వ్యాఖ్యానించడం ఇక్కడ చెప్పుకోవాలి. ఈ డాక్యుమెంటరీ వ్యవహారం చూస్తూంటే... భారతీయ ప్రజాస్వామ్య సుస్థిరతను, అత్యున్నత ప్రభుత్వ సంస్థల సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ.... బీబీసీ పబ్లిక్ సర్వీసును పూర్తిగా వదులుకోవడమే కాకుండా.. భారత్‌తో యూకే సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నట్లు కనిపిస్తోంది.

వ్యాసకర్త ప్రసార భారతి మాజీ ఛైర్మన్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గోద్రా కథే కదా!



భారత్‌లోని అన్ని వర్సిటీలలో బీబీసీ డాక్యుమెంటరీ 'ఇండియా : ది మోదీ క్వశ్చన్'ను ప్రదర్శించనున్నట్లు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అందులో కొత్తగా మళ్లీ ఏం ఉంటుందని?!

– కోరా అబ్రహాం, జర్నలిస్ట్

ఎవరి మీద కోపం?



టర్కీలో స్వీడిష్ జెండాలను తగలబెడుతున్నా స్వీడన్‌లో ఎవరూ దాని గురించి పట్టించుకోరని వారికెవరైనా చెప్పారా? దేశం బలహీనంగా, అనిశ్చితంగా ఉన్నప్పుడు మాత్రమే జెండాలు శక్తిమంతమౌతాయి.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

మీరే మిగిలిన ఆశ



కశ్మీరీ పండిట్‌లు రాహుల్ గాంధీతో ఏమన్నారో వినండి : "మోదీ ప్రభుత్వం మమ్మల్ని ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఉపయోగించుకుంది. మా సంక్షేమం కోసం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు చేసిన వాటిని మోదీ ప్రభుత్వం తీసేసింది".

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్ట్


గుండెబలం కావాలి



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు భారతీయ క్రీడల్లో చీకటి కోణాన్ని బహిర్గతం చేశాయి. ముఖ్యంగా రెజ్లింగ్ ఫెడరేషన్‌కు నేతృత్వం వహిస్తున్న బి.జె.పి. ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్ వంటి ఘరానా వ్యక్తికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఎంతో ధైర్యం అవసరం.

– నిధీ రజ్దాన్, సంపాదకురాలు

జగమే మాయ



ఒక అపరిచితుడు బెంగళూరు కె.ఆర్. పురం ఫ్లై ఓవర్ పైనుంచి రోడ్డు మీదికి పది రూపాయల నోట్లను వెదజల్లడంపై పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. చివరికది ఒక కొత్త స్టార్టప్ కంపెనీ మార్కెటింగ్ వ్యూహం అని తేలినా ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఇది బెంగళూరు బాబూ..!

– వినయ్ అరవింద్, సోషలిస్ట్

బుల్ షిట్ (బి.ఎస్)



సంచలన వార్త! మరింత ప్రమాదకరమైన కొత్త కోవిడ్ వేరియంట్ బయటపడింది. దాని పేరు బి.ఎస్–24/7. ఇది ఇంగిత జ్ఞానంపై దాడి చేస్తుంది. సాక్ష్యాల ఆధారంగా ఔషధం అని రుజువైన వాటిని నాశనం చేస్తుంది. ఈ కొత్త వేరియంట్ ప్రధాన స్రవంతి మీడియా, ఫాసీ, సీడీసీ ద్వారా వ్యాపిస్తుంది.

– డాక్టర్ ఎలి డేవిడ్, పరిశోధకుడు

ఈ అహంకారాన్ని ఏమనాలి?



తనకు కుర్చీ తీసుకురావడంలో కాస్త జాప్యం అయినందుకు తమిళనాడు మంత్రి ఆవడి నాసర్ తమ పార్టీ కార్యకర్తపై గట్టిగా రాయి విసిరారు! ఆరు బయట తాత్కాలిక టెంట్‌లో ఏర్పాటైన సమావేశంలో తనకు వేయాల్సిన కుర్చీ కోసం ఆయన కొద్ది క్షణాలైనా వేచి వుండలేకపోయారు. ఇదీ మన నేతల తీరు. నీతులు చెప్పటానికే కానీ, ఆచరించడానికి మాత్రం కాదు!

– షబ్బీర్ అహ్మద్, ఎక్స్–పేపర్‌బాయ్

ఇన్‌బాక్స్

ఒక దేశం – ఒకే పువ్వు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ దశ ఏమిటో ఎటో
వివరాలు తెలియ జేయాలని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు

గాలులు ఎంత దూరం పోవాలనుకున్నాయో
అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు
ఇప్పుడిక్కడ సుడిగాలులకు అనుమతి లేదు

మేం కడుతున్న ఆ పేకమేడల్ని
సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
అందువల్ల ఈ చట్టాలు
సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చుట్టాలకు అనుగుణంగా
ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు

ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడటం మళ్లీ తిరిగి వెళ్ళడం
బలం పుంజుకుని మళ్లీ నీటి పిడికిళ్ళతో
తిరిగి రావడం ఇవన్నీ ఇప్పడిక కుదరదు
తిరుగుబాట్లు, ఉద్యమాలు,
హోరెత్తిపోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డులోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!

తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులో కొచ్చింది
ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట!

ఒక దేశం – ఒకే పువ్వు!!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలు ఒకే రకంగా ఉండవని –
ఉండటానికి వీలే లేదని –
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా
వారికి ఎవడు చెప్పాలి?

గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీవోలతోనో వెనక్కి మళ్ళదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప
మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో
అడ్రసు లేకుండా గల్లంతు కావల్సిందేనని
నామరూపాలు లేకుండా నశించాల్సిందేనని
వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా... కాపాడుకొమ్మని!!

– డాక్టర్ దేవరాజు మహారాజు
(దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమ నేపథ్యంలో)

ప్రజల చేతిలోని పాశుపతాస్త్రం

సందర్భం



రాజీవ్ కుమార్

ఈ రోజు భారత ఎన్నికల సంఘాన్ని స్థాపించిన రోజు. 2011 నుండి జాతీయ ఓటర్ల దినోత్సవంగా కూడా జనవరి 25ను జరుపుకొంటున్నాం. దీని ఉద్దేశం ఓటర్లుగా భారత పౌరులకు ఉన్న హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడమే. ఎన్నిల సంఘం (ఈసీ) పనితీరు, నిర్ణయం తీసుకునే స్వతంత్రతను నిర్ధారించడానికి రాజ్యాంగ సభ ఆర్టికల్ 324 ద్వారా రాజ్యాంగ హోదాను ఇచ్చింది. తక్కువ అక్షరాస్యత, ఉనికిలో లేని ఓటర్ల జాబితా యుగంలో వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికలను నిర్వహించడానికి శాశ్వతమైన స్వయంప్రతిపత్తి గల కమిషన్‌ను ఏర్పాటు చేయడం రాజ్యాంగ సభ దూరదృష్టికి ప్రతీక. ఈసీ నిష్పాక్షికత , విశ్వసనీయత ఆధారంగా ఇప్పటివరకు 17 లోక్‌సభ ఎన్నికలు; రాష్ట్రపతి ఎన్నికలు 16 సార్లు, అదే విధంగా ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి మరో 16 సార్లు ఎన్నికలు నిర్వహించింది. అలాగే 399 సార్లు శాసనసభ ఎన్నికలు నిర్వహించింది. 400వ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. చాలావరకు రాజకీయపార్టీల, ప్రజల విశ్వాసాన్ని ఎన్నికల సంఘం చూరగొన్నదనే చెప్పాలి.

పటిష్ఠమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి బలమైన, సమ్మిళిత ఎన్నికల భాగస్వామ్యం చాలా కీలకం. శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సక్రమంగా, విశ్వసనీయంగా ఉండాలి. అదే సమయంలో ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఈ సందర్భంగా 'మనం విధులను నిర్వర్తించకుండా వదిలేస్తే, హక్కుల కోసం పరుగు తీయాల్సి ఉంటుంది. అవి మనల్ని ఇష్టానుసారంగా తప్పించుకుంటాయి' అన్న మహాత్మాగాంధీ మాటలు గుర్తు కొస్తున్నాయి.

94 కోట్లకు పైగా నమోదిత ఓటర్లను కలిగి ఉన్న భారత్... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. గత సార్వత్రిక ఎన్నికలలో (2019) 67.4 శాతం ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మిగిలిన 30 కోట్ల మంది ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకురావడం ఇప్పుడు మనముందున్న పెద్ద సవాల్. యువత లోనూ, పట్టణ ఓటర్లలోనూ ఉన్న ఉదాసీనత; బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వలసపోవడం వంటి అనేక కారణాల వల్ల ఇంతమంది ఓటింగ్‌లో పాల్గొనలేదని చెప్పవచ్చు.

2022 నవంబర్ 5న హిమాచల్‌ప్రదేశ్ కల్పాలో మరణించిన మొట్టమొదటి భారత ఓటర్ శ్యామ్ శరణ్ నేగీకి నివాళులు అర్పించే గౌరవం నాకు లభించింది. ఆయన తన 106వ ఏట మరణించే ముందు కూడా ఓటు హక్కును ఉపయోగించుకుని ఓటు వేయకుండా ఉండే ఉదాసీన పౌరులకు తమ విధి ఏమిటో తెలియచేశారు. ఆయన స్ఫూర్తిని అందరూ అందుకోవాలి.



యువ ఓటర్లే భారత ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు. 2000 సంవత్సరం తర్వాత జన్మించిన తరం మన ఓటర్ల జాబితాలో చేరడం ప్రారంభించింది. ఓటర్లుగా వారి భాగస్వామ్యం మొత్తం శతాబ్దమంతా ప్రజాస్వామ్య భవిష్యత్తును రూపుదిద్దబోతోంది. అందువల్ల ఓటు వేసే వయస్సు వచ్చేలోపు పాఠశాల స్థాయిలోనే ప్రజాస్వామ్య బీజం విద్యార్థుల్లో నాటడం అత్యంత క్లిష్టమైనదే కాదు, ముఖ్యమైనది కూడా.

ప్రజాస్వామ్యంలో, ఓటర్లకు తాము ఓటు వేసే అభ్యర్థి నేపథ్యం గురించి తెలుసుకునే హక్కు ఉంది. ఈ కారణంగానే అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల గురించి వార్తాపత్రికల్లో తెలియజేయాలి. ఇప్పటికీ ఎన్నికల్లో కండబలాన్ని ఉపయోగించడానికి ప్రయత్నించేవారు కొన్ని రాష్ట్రాల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం ఉండకూడదు. ఎన్నికల్లో ధనబలాన్ని అరికట్టడం పెద్ద సవాల్‌గా మిగిలిపోయింది. చట్టాన్ని అమలు చేసే సంస్థల కఠినమైన నిఘా కారణంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో చాలా వరకు ఇటువంటి విపరీత ధోరణులకు అడ్డుకట్ట పడింది. ఎన్నికలను ప్రభావితం చేయగల స్థాయిలో ఇవ్వాళ సోషల్ మీడియా ఉంది. అందులో నకిలీ వార్తల ప్రచారం జరగకుండా చూడాల్సి ఉంది.

ఎన్నికలను అన్ని జాగ్రత్తలతో నిర్వహించడం ఎన్నికల సంఘం విధి. ఎన్నికల ప్రక్రియలో ఓటరే ప్రధాన భాగస్వామి. అందుకే ఓటు వేయడానికి కావలసిన స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ద్వారా ఓటర్లు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనేలా ఈసీ తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడానికి కంకణబద్ధమై ఉంది. పౌరులు ఓటరుగా తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి గర్వపడగలిగితే అది వారు ఎన్నుకున్న ప్రభుత్వ పాలనా స్థాయి మీద కూడా ప్రభావం చూపుతుంది. పౌరులందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు!

వ్యాసకర్త భారత ప్రధాన ఎన్నికల కమిషనర్
(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)

క్లుప్తంగా...

యాదగిరీశుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



ఆశీర్వచనం తీసుకుంటున్న జస్టిస్ సంతోష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సంతోష్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆచార్యులు జస్టిస్ సంతోష్‌రెడ్డికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ట అలంకార మూర్తులను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జస్టిస్ సంతోష్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. దర్శనం పూర్తయిన తర్వాత ప్రధానాలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. రాత్రి యాదాద్రి కొండకు దిగువనున్న ప్రెసిడెన్షియల్ సూట్‌లో బస చేశారు.

ఐఎస్‌బీతో టీఎస్‌ఆర్టీసీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల నిర్వహణలో డేటా విశ్లేషణకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)తో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ క్యాంపస్‌లో మంగళవారం టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల సమక్షంలో ఐఎస్‌బీ డేటా సైన్స్ విభాగ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనీశ్ గాంగ్వార్, టీఎస్‌ఆర్టీసీ ఐటీ చీఫ్ ఇంజనీర్ రాజశేఖర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రూట్ల క్రమబద్ధీకరణ, లాభాల గరిష్టీకరణపై డేటా విశ్లేషణ కోసం ఐఎస్‌బీతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సజ్జనార్ తెలిపారు. త్వరలోనే ఇది ఇతర ప్రజా రవాణా సంస్థలకు రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

హెచ్‌సీయూలో డాక్యుమెంటరీ ప్రదర్శనపై ఫిర్యాదు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో వివాదాస్పద డాక్యుమెంటరీ ప్రదర్శన చర్చనీయాంశంగా మారింది. బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని ఇటీవల రెండు సంఘాలు కలిసి హెచ్‌సీయూలో ప్రదర్శించినట్లు తెలిసింది. 2002 గోద్రా అల్లర్లు, రామమందిర నిర్మాణ ఘర్షణపై బీబీసీ డాక్యుమెంటరీ రూపొందించగా దానిపై భారతదేశంలో నిషేధం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. విషయం తెలుసుకున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం వివాదాస్పద డాక్యుమెంటరీని ప్రదర్శించడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేసింది. డాక్యుమెంటరీని ప్రదర్శించిన, తిలకించిన వారిపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులకు వారు ఫిర్యాదు చేశారు. దేశంలో మళ్లీ అల్లర్లు సృష్టించడానికి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఈ డాక్యుమెంటరీపై ఎలాంటి నిషేధం లేదని, సెన్సార్ మాత్రమే చేశారని, బీబీసీ నుంచి అనుమతి పొంది ప్రదర్శించుకోవచ్చని కొందరు వాదిస్తున్నట్లు తెలిసింది. అధికారికంగా ఫిర్యాదు రానిదే దీనిపై విచారణ చేయడం, కేసులు నమోదు చేయడం ఉండదని పోలీసులు స్పష్టం చేసినట్లు సమాచారం.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

- అధికారులకు సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాబోయే వేసవికాలంలో తాగునీటి సరాఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎంవో, మిషన్ భగీరథ విభాగం కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంతరాయాలు లేని తాగునీటి సరాఫరా కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆవాసాలు, విద్యాసంస్థలకు నిరాటంకంగా తాగునీటి సరాఫరా కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం తాగునీటి సరాఫరాపై మిషన్ భగీరథ కార్యాలయంలో స్మితా సబర్వాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సాగుతున్న బల్క్, ఇంట్రా సరాఫరా తీరుపై స్మితా సబర్వాల్ సంతృప్తి వ్యక్తంచేశారు. రిజర్వాయర్ల నీటి మట్టాల నిరంతర పర్యవేక్షణ ఇంటెక్ వెల్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో ఉన్న పంపులు, మోటార్ల వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెయిన్, సెకండరీ పైప్‌లైన్‌లలో ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే రిపేర్ చేసేలా మొబైల్ టీంలను నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. మారుమూల, అటవీ ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాలు, రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ తాగునీటి సరాఫరా తీరుపై గిరిజన, సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌చోంగ్తూతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, వివిధ జిల్లాల చీఫ్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

త్వరలోనే పోడు పట్టాల పంపిణీ

సీఎం చేతుల మీదుగా కేస్లాపూర్ నుంచే శ్రీకారం

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడి
- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి నాగోబా దర్శనం
- నాగోబా సన్నిధిలో అభివృద్ధికి సీఎం రూ. 12.5 కోట్లు మంజూరు చేశారన్న ఇంద్రకరణ్



గిరిజన దర్బార్‌లో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖా నాయక్ తదితరులు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో త్వరలోనే పోడు పట్టాలు పంపిణీ చేస్తామని, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కేస్లాపూర్ నుంచే అందిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద ఎక్కువ మందికి న్యాయం చేసేలా చూస్తామని, రైతుబంధు వర్తింపజేస్తామన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరుగుతున్న నాగోబా జాతరకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి ఆమె విచ్చేశారు. నాగోబాను దర్శించుకున్న అనంతరం గిరిజన దర్బార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో 3.8 లక్షల ఎకరాల పోడు భూములకు రైతుబంధు ఇచ్చి ఆదుకుంటామని సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు. 76 ఏళ్లుగా గిరిజన దర్బార్ నడుస్తోందని, ప్రపంచంలోనే అతిపెద్ద జాతరలో ఇది ఒకటన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనతికాలంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. గిరిజనుల కోసం అనేక గురుకులాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే అగ్రికల్చర్ బీఎస్సీ ఇక్కడ ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించారు. కొందరు ఏం తెలియకుండా మాట్లాడు తున్నారని నాగోబా జాతరకు వచ్చిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్రం ఉలుకు పలుకు లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. గిరిజనులకు 12% రిజర్వేషన్ల విషయంలో బీజేపీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. గిరిజనులకు 10% రిజర్వేషన్లను ఆమోదించి పంపితే కేంద్రం పక్కనబెట్టిందంటూ దుయ్యబట్టారు.

మెస్రం పెద్దలు సూచించినట్లుగా అభివృద్ధి పనులు: ఇంద్రకరణ్

రాష్ట్ర దేవాదాయ శాఖ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లలో 10% రిజర్వేషన్ల ప్రకారం 9 వేలకుపైగా ఉద్యోగాలు గిరిజనులకే దక్కుతాయన్నారు. నాగోబా సన్నిధిలో అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ. 12.5 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేశారని తెలిపారు. మెస్రం పెద్దలు సూచించిన ప్రతిపాదనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం దేవాలయాలకు ఏమైన నిధులు ఇచ్చిందా? అంటూ విమర్శించిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా రాష్ట్రంలోని ఆలయాలకు మంజూరు చేశారా అంటూ ధ్వజమెత్తారు. గిరిజన దర్బార్‌లో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దండే విఠల్, రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, రేఖాశ్యామ్ నాయక్, రాథోడ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు.

వాయిదాల్లో ఏసీడీ సేకరణ

టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు



మాట్లాడుతున్న గోపాల్‌రావు

హనుమకొండ: అదనపు వినియోగాధారిత డిపాజిట్(ఏసీడీ)ను వాయిదాల్లో చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి(ఎన్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయమైన విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీడీ విధింపుపై ఎలాంటి సందేహాలకు తావు లేదన్నారు. విద్యుత్ సర్వీస్ తీసుకున్నప్పటి కంటే అదనంగా లోడ్ పెరిగినప్పుడు ఆ మేరకు ఏసీడీ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏసీడీపై ప్రతి ఏడాది మే నెలలో వడ్డీ చెల్లిస్తూ బిల్లులు సర్దుబాటు చేస్తామని, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనల మేరకే ఏసీడీ విధిస్తున్నామన్నారు. ఇది విద్యుత్ పంపిణీ సంస్థల, పాలకమండలి సొంత నిర్ణయం కాదని స్పష్టం చేశారు. వినియోగదారులు వరుసగా రెండు నెలలు బిల్లు చెల్లించనప్పుడు మూడో నెల నోటీసు ఇచ్చి డిపాజిట్ నుంచి సంస్థకు రావాల్సిన బకాయిలు తీసుకుని సర్వీస్ రద్దు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో వినియోగదారులు వినియోగిస్తున్న యూనిట్లకు ఎంత బిల్లు వస్తుందో ఏడాదికి సగటున లెక్కించి రెండు నెలల బిల్లు మొత్తాన్ని ఏసీడీగా సేకరిస్తున్నామని, ఈ ఏసీడీని ఇంటి యజమాని చెల్లించాలన్నారు. అద్దెదారులు, ఇంటి యజమాని పరస్పర అవగాహనకు వచ్చి ఏడీసీని అద్దెదారులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, తలసరి వినియోగంలోనూ ముందున్నామన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎం మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు పోలవరం బ్యాక్‌వాటర్‌పై సమావేశం

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర జలశక్తిశాఖ నిర్వహణ
- పునరావాసం, ముంపు రక్షణ కోరుతున్న తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై బుధవారం కేంద్ర జలశక్తి శాఖ..ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో సమావేశం నిర్వహించనుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై గతేడాది సెప్టెంబర్ 29న కేంద్ర జలశక్తి శాఖ ముఖ్య కార్యదర్శుల స్థాయిలో సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత సాంకేతికపరమైన అంశాలపై ముంపు ప్రభావిత రాష్ట్రాలతో చర్చలు, సంప్రదింపుల కోసం కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కేంద్రానికి లేఖ రాయగా, సీడబ్ల్యూసీ నుంచి బదులు వచ్చింది. ఈ సమాధానాలపై ఏమైనా అభ్యంతరాలుంటే 20లోగా పంపించాలని ఆయా రాష్ట్రాలను సీడబ్ల్యూసీ కోరింది. ఫిబ్రవరి 15న పోలవరం ముంపుపై సుప్రీం కోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో 25న నిర్వహించనున్న సమావేశానికి ప్రాధాన్యత ఉందని సీడబ్ల్యూసీ తెలిపింది. పోలవరం ముంపు ప్రభావిత ప్రాంతాలకు రక్షణతో పాటు బాధిత రైతులకు పరిహారం, పునరావాసం కల్పించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది.

ఆదిలాబాద్‌లో అమరావతి రైతుల వంటావార్పు



పత్తి వ్యాపారి ఇంటి ముందు గుంటూరు జిల్లా రైతుల వంటావార్పు

కైలాస్‌నగర్: అప్పుగా ఇచ్చిన డబ్బు చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆదిలాబాద్‌లోని పత్తి వ్యాపారి సచిన్ ఇంటి ఎదుట రెండో రోజు మంగళవారమూ ఆందోళన కొనసాగించారు. స్థానిక రాణీసతీజీ కాలనీలోని వ్యాపారి ఇంటి ఎదుటే రాత్రి బస చేసిన రైతులు మంగళవారం ఉదయం, మధ్యాహ్నం అక్కడే వంటలు చేసుకుని భోజనం చేశారు. తమ నుంచి అప్పుగా తీసుకున్న రూ.6కోట్లు తిరిగి చెల్లించాలంటూ శాంతియుతంగా నిరసన చేపట్టారు. సదరు వ్యాపారి ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. డబ్బులు తిరిగి ఇచ్చే వరకూ ఆదిలాబాద్ నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. నిరసనలో వంశీ, కొండవేటి యేసుబాబు, నాగమల్లేశ, మస్తాన్ అలీ తదితరులు ఉన్నారు.

2030 నాటికి మూడో ఆర్థిక శక్తిగా భారత్

- ఐసీఏఐ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్



ఐసీఏఐ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

మాదాపూర్: ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2030 నాటికి మూడో ఆర్థిక శక్తిగా ఎదగనుందని కేంద్ర పార్లమెంట్ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 2023 స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 2047 నాటికి మనదేశం నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్నారు. సీఏ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన పట్టాలను అందజేశారు. ప్రపంచ ఆర్థిక స్థితిగతులపై చర్చలు నిర్వహించే జీ-20 దేశ సమావేశాల్లో ఐసీఏఐ కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఐసీఏఐ అధ్యక్షుడు దేబాషిస్ మిత్రా మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సీఏ ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 42% మహిళలే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ ఉపాధ్యక్షుడు అనికేత్ సునీల్ తలాటి, ఐసీఏఐ కౌన్సిల్ సభ్యులు శ్రీధర్ ముప్పాల, ప్రతినిధులు సుశీల్‌కుమార్ గోయల్, ప్రసన్నకుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



వీరభద్రం (ఫైల్)

కూసుమంచి: సోదరుడు కన్నుమూసిన బాధ నుంచి ఆ కుటుంబం ఇంకా బయటపడలేదు.. ఇంతలోనే తల్లి మృతి చెందింది.. ఆమె అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన తనయుడు కూడా గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన ఖమ్మం జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. జిల్లాలోని కూసుమంచి మండలం గట్టుసింగారానికి చెందిన దారా నారాయణ - ఆదెమ్మకు ఇద్దరు కుమారులు. నారాయణ చాలా ఏళ్ల క్రితమే మృతి చెందాడు. వీరి పెద్ద కుమారుడు వీరభద్రం మల్లేపల్లిలో, చిన్న కుమారుడు శరత్ ఖమ్మంలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో శరత్ ఈనెల 14న మృతి చెందాడు. కుటుంబం విషాదంలో ఉండగానే వీరభద్రం వద్ద ఉంటున్న ఆదెమ్మ సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలను మంగళవారం ఉదయం స్వగ్రామమైన గట్టుసింగారంలో నిర్వహించాక అంతా ఇంటికి వచ్చారు. అప్పటివరకు ఆవేదనతో ఉన్న వీరభద్రం (68) గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. రోజుల వ్యవధిలోనే ఇద్దరు కుమారులు, తల్లి మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఢిల్లీ పర్యటనలో తెలంగాణ సీఎస్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కన్ఫర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు సంబంధించిన జాబితా కోసం ఏర్పాటు చేసిన ఇంటర్వ్యూల కోసం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఒకరోజు ఢిల్లీ పర్యటన చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చిన సీఎస్ నేరుగా యూపీఎస్సీకి వెళ్లి అక్కడ మధ్యాహ్నం వరకు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం యూపీఎస్సీకి పంపించిన కన్ఫర్డ్ ఐఏఎస్, కన్ఫర్డ్ ఐపీఎస్‌ల జాబితాల ఆధారంగా నిర్వహించిన ఇంటర్వ్యూ ప్యానెల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా ఉంటారని యూపీఎస్సీ వర్గాలు తెలిపాయి. కాగా సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత శాంతికుమారి తొలిసారి ఢిల్లీ వచ్చారు. ఇంటర్వ్యూల అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

కామారెడ్డిలో ‘కన్యాశుల్కం’..!

- కామారెడ్డి జిల్లాలో పెళ్లిళ్ల ముసుగులో సవతి తల్లి దురాగతం
- ఆర్థికభారం సాకుతో రూ. 80 వేలకు ఒకరు, రూ. 50 వేలకు మరొకరిని అమ్మిన వైనం
- పోక్సో చట్టం కింద ఏడుగురిపై కేసు నమోదు, అరెస్ట్



మైనర్ బాలికలను విక్రయించిన నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కామారెడ్డి క్రైం: ఆర్థిక భారం సాకుతో 14 ఏళ్ల కవల బాలికలను ఓ సవతితల్లి అంగడి సరుకులుగా విక్రయించిన ఉదంతం కామారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెళ్లిళ్ల పేరిట ఒకరిని రూ. 80 వేలకు మరొకరిని రూ. 50 వేలకు అమ్మిన వైనం సంచలనం సృష్టించింది. కామారెడ్డి ఎస్పీ శ్రీనివాసరెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం... జిల్లాలోని మాచారెడ్డి మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు 14 ఏళ్ల కవల ఆడపిల్లలు ఉండగా రెండో భార్యకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే నలుగురు పిల్లలను పెంచడం ఆర్థిక భారమంటూ కవల పిల్లలను పెళ్లి పేరిట వదిలించుకోవాలని సవతితల్లి నిర్ణయించింది. ఇందుకు భర్తను ఒప్పించి కామారెడ్డిలో ఓ మార్వాడీని కలిసి అతనికి సోదరుడైన హైదరాబాద్‌వాసికి కవలల్లో చిన్న కూతురుని ఇచ్చి గతేడాది సెప్టెంబర్‌లోనే పెళ్లి జరిపించింది. ఇందుకుగాను రూ. 80 వేలకు ఒప్పందం కుదుర్చుకోగా అందులోంచి మార్వాడీ, మధ్యవర్తి రూ. 20 వేలు, కుల పెద్ద రూ. 10 వేలు తీసుకున్నారు. వివాహం అనంతరం బాలికను హైదరాబాద్ శివారులోని దండుపల్లి గ్రామానికి తీసుకెళ్లి కాపురం పెట్టాడు. అయితే అప్పటికే పెళ్లయ్యి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని... కొందరితో వివాహేతర సంబంధాలు కూడా ఉన్నాయని బాలికకు తెలిసింది. దీనిపై భర్తను ప్రశ్నించగా కొట్టడం, వేధించడం మొదలుపెట్టాడు. దీంతో అక్కడి నుంచి పారిపోయి కామారెడ్డి వచ్చిన బాలిక... తనకు జరిగిన అన్యాయం గురించి ఐసీడీఎస్ అధికారులకు తెలిపింది. అంతేగాకుండా తన అక్కను కూడా గతేడాది డిసెంబర్‌లో అదే మధ్యవర్తితో మాట్లాడి మరో వ్యక్తికి రూ. 50 వేలకు పెళ్లి పేరిట సవతితల్లి అమ్మిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకొచ్చింది. దీంతో జిల్లా బాలికా సంరక్షణ అధికారి స్రవంతి మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు బాలికలను రక్షించి బాలసదనంలో చేర్పించారు. మైనర్లకు వివాహం జరిపించిన సవతి తల్లి, తండ్రితోపాటు వారిని పెళ్లి చేసుకున్న శర్మన్, కృష్ణకుమార్, మధ్యవర్తులు కాల రాంబాటి, రమేష్, మహేందర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు రూ. 2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా!

▶ మొదటి పేజీ తరువాయి

మార్పులు చేసి బంగ్లా సస్య బీమా యోజన పేరుతో సొంత పథకం తీసుకొచ్చింది. నాలుగేళ్లుగా దీన్ని అమలు చేస్తోంది. బెంగాల్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆలుగడ్డ, చెరకు పంట విలువలో 4.85 శాతాన్ని ప్రీమియంగా రైతుల నుంచి వసూలు చేస్తుండగా, ఆహార ధాన్యాలు, వంట నూనెలకు సంబంధించిన పంటలకు రైతుల తరఫున పూర్తి ప్రీమియంను బెంగాల్ ప్రభుత్వమే భరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ సొంతంగా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని సర్కారు భావిస్తోంది. అంతేగాక రైతు యూనిట్‌గా బీమా పథకాన్ని తీసుకురావాలన్న అంశంపై కసరత్తు చేస్తోంది.

ఇప్పటివరకు బీమా కంపెనీల దోపిడీ...

పంటల బీమా విషయంలో బీమా కంపెనీలు ఇప్పటివరకు లాభాలను పెంచుకోవడంపైనే ఎక్కువగా దృష్టి సారించాయి. లాభాలు గణనీయంగా ఉన్నా ఏటా ప్రీమియం రేట్లను భారీగా పెంచేవి. 2013-14లో రైతులు, ప్రభుత్వం కలిపి పంటల ప్రీమియంగా రూ. 137.60 కోట్ల మేర చెల్లిస్తే రైతులకు క్లెయిమ్స్ కింద అందింది కేవలం రూ. 56.39 కోట్లే. ఆ ఏడాది 8.52 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లిస్తే కేవలం 1.18 లక్షల మంది రైతులే లబ్ధి పొందారు. 2012-13 వ్యవసాయ సీజన్‌లో 10 లక్షల మంది రైతులు రూ. 145.97 కోట్ల ప్రీమియం చెల్లిస్తే కేవలం 1.80 లక్షల మంది రైతులకు రూ. 78.86 కోట్ల మేర పరిహారం లభించింది. 2015-16లో మాత్రం 7.73 లక్షల మంది రైతులు రూ. 145.71 కోట్లు ప్రీమియం చెల్లిస్తే బీమా సంస్థలు రూ. 441.79 కోట్లను పరిహారంగా ఇచ్చాయని వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. 2016-17లో మళ్లీ బీమా కంపెనీలకే లాభాలు సమకూరాయి. ఆ ఏడాది 9.75 లక్షల మంది రైతులు రూ. 294.29 కోట్లు చెల్లిస్తే 2.35 లక్షల మంది రైతులకు రూ. 178.49 కోట్లు పరిహారం లభించింది.

కేంద్ర పథకంతో లాభం లేదని...

బీమా కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నా ప్రీమియం ధరలు ఎందుకు పెంచుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తూ వచ్చింది. ముఖ్యంగా తెలంగాణలో రబీలో చెల్లించే ప్రీమియం మొత్తం దాదాపు బీమా కంపెనీలను బాగు చేయడానికే అన్నట్లుగా అమలైంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రైవేటు బీమా కంపెనీలకు అవకాశం కల్పించడంతో ఈ పరిస్థితి మరింత దిగజారింది. పీఎంఎఫ్‌బీవై కింద వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుములకు రైతులు 2 శాతం, పసుపు రైతులు 5 శాతం ప్రీమియం చెల్లించాలి. పునరుద్ధరించిన వాతావరణ ఆధారిత బీమా కింద పత్తి, పత్తి, మిరప, ఆయిల్‌పాం, బత్తాయి పంటలకు పంట రుణంలో 5 శాతం రైతు ప్రీమియం కట్టాలి. జిల్లా జిల్లాకు ప్రీమియం ధరలు మారుతుంటాయి. అలాగే కేంద్ర పథకంలో గ్రామాన్ని యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో పెద్దగా ప్రయోజనం లేదన్న భావన నెలకొంది. వడగళ్లు, పెనుగాలులకు పంట నష్టపోతే తక్షణం 25 శాతం పరిహారం ఇవ్వాలనే నిబంధనను ప్రైవేటు బీమా కంపెనీలు అమలు చేయకపోవడం, అధిక సంఖ్యలో రైతులకు పరిహారం అందేలా కేంద్ర పథకం లేదన్న భావనతో 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం దాన్నుంచి బయటకు వచ్చింది.

బాసరలో వసంత పంచమి వేడుకలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రంలో వసంత పంచమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో విజయరామారావు స్థానిక వైదిక బృందం ఆధ్వర్యంలో వేడుకలను ప్రారంభించారు. బాసర ఆలయ స్థానాచార్య, ప్రధానార్చకుల పర్యవేక్షణలో గోమాతకు పూజలు చేశారు. తర్వాత యాగశాలలో యాగ పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు.

‘రాజ్‌భవన్‌లో రిపబ్లిక్ డే వేడుకలు దురదృష్టకరం’

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని రాజ్‌భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించడం దురదృష్టకరమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అభిప్రాయపడ్డారు. అనాదిగా ఢిల్లీలోని ఎర్రకోట వద్ద, హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, కానీ ఇప్పుడు రాజ్‌భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించడం రాష్ట్ర ప్రజలను అవమానపర్చడమేనని వ్యాఖ్యానించారు. ఇది స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో నిరంజన్ విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ సీఎం అయ్యాక జాతీయ పండుగల ప్రాధాన్యతలను తగ్గిస్తూ వస్తున్నారని, ఈ పండుగలను గోల్కొండ, పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారని విమర్శించారు. రిపబ్లిక్‌డే వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేయడం శోచనీయమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ల మధ్య విభేదాలు గవర్నర్, సీఎంల మధ్య విభేదాలుగా మారాయని, జాతీయ దినోత్సవాలకు మచ్చ తెచ్చేలా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

దేశంలో 4.90 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో దాదాపుగా 4.90 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. పెండింగ్ కేసుల త్వరితగతి విచారణ కోసం ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. అప్పుడే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని కేసుల విచారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో రిజిజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఈ–కమిటీ చీఫ్‌గా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. "4.90 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది చాలా పెద్ద సంఖ్య. అంటే చాలా మంది న్యాయం కోసం ఎదురు చూస్తున్నారన్నమాట. న్యాయం జరగడం ఆలస్యమవుతోందని అంటే న్యాయం చెయ్యడం తిరస్కరించడంగానే భావించాలి. వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలి" అని రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాల ఉమ్మడి కృషి కారణంగానే పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించగలమని వివరించారు.

జిందాల్‌కు బెదిరింపు

రాయ్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్ సెంట్రల్ జైలు ఖైదీ ఒకడు పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్‌కు బెదిరింపు లేఖ రాశాడు. రూ.50 కోట్లను 48 గంటల్లోగా పంపాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అందులో హెచ్చరించాడు. ఈ మేరకు గత వారం రాయ్‌గఢ్‌లోని పత్రపాలి గ్రామంలో ఉన్న జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్(జేఎస్‌పీఎల్)కు లేఖ అందింది. దీనిపై కోత్రా రోడ్ పోలీసులు సెక్షన్లు 386, 506 కింద కేసు నమోదు చేశారు. సదరు బెదిరింపు లేఖను బిలాస్‌పూర్ జైలులోని ఖైదీ పోస్టు ద్వారా పంపినట్లు తేలిందని దర్యాప్తులు పోలీసులు చెప్పారు.

నేపాల్‌లో భూకంపం

న్యూఢిల్లీ: నేపాల్‌లో మంగళవారం మధ్యాహ్నం రిక్టర్ స్కేల్‌పై 5.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ ప్రభావంతో ఢిల్లీతోపాటు రాజస్తాన్‌లోని జైపూర్‌లో ప్రకంపనలు సంభవించాయి. నేపాల్‌లోని సుదూర్ పశ్చిమ్ ప్రావిన్స్‌లోని బజురా జిల్లాలో భూకంప కేంద్రం ఉందని నేపాల్ అధికారులు చెప్పారు. భూకంపం ధాటికి కొండపై నుంచి బండరాయి దొర్లుకుంటూ వచ్చి మీదపడగా ఒక మహిళ చనిపోయింది. రెండిళ్లు కూలిపోగా, పలు ఇళ్లకు, ఒక ఆలయానికి పగుళ్లు వచ్చాయి. కొండచరియలు విరిగిపడి ఒకరు గాయపడగా, 40 గొర్రెలు చనిపోయాయి. ప్రకంపనలతో భయాందోళనలకు గురయ్యామని నోయిడా, ఢిల్లీ వాసులు చెప్పారు. ఆస్తి, ప్రాణనష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం లేదు.

మనుషుల కంటే తుపాకులెక్కువ!

3 వారాలు.. 38 కాల్పులు.. 70 ప్రాణాలు • ఇదీ అమెరికా...

మీకు ఒక విషయం తెలుసా..? అమెరికాలో నిప్పులు గక్కిన తుపాకీ తూటాలకు 1968–2017 మధ్య 15 లక్షల మంది అమాయకులు బలయ్యారు. ఈ సంఖ్య అమెరికా స్వాతంత్య్ర సంగ్రామం నుంచి ఆ దేశం చేసిన యుద్ధాల్లో కోల్పోయిన సైనికుల కంటే ఎక్కువ. గత ఏడాదే అమెరికా తుపాకుల విక్రయానికి సంబంధించి బైడెన్ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తెచ్చింది. అయినప్పటికీ కొత్త సంవత్సరంలో కేవలం మూడు వారాల్లో 38 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. దాదాపుగా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అగ్రరాజ్యంలో ఈ దారుణ మారణకాండను ఇక అరికట్టలేరా ?

అమెరికా నెత్తురోడుతోంది. గన్ కల్చర్ విష సంస్కృతి మరింతగా విస్తరిస్తోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కాల్పుల శబ్దాలు భయపెడుతున్నాయి. అయితే చంపడం, లేదంటే ఆత్మహత్య చేసుకొని చావడం. కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకోవడానికి బయటకు వెళితే క్షేమంగా వెనక్కి వస్తారో లేదో తెలీదు. చదువుకోవడానికి బడికి వెళితే ఏ ఉన్మాది ఏం చేస్తాడోనని హడలిపోవాలి. నైట్ క్లబ్బులో విందు వినోదాలైనా, రాత్రి పూట ఒంటరిగా బయటకు వెళ్లినా ఎటు వైపు నుంచి ఈ తూటా దిగుతుందో చెప్పలేము. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడుతున్న వాళ్లలో యువత ఎక్కువ మంది ఉన్నారని తేలడంతో గత ఏడాది జూన్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ వారి చేతుల్లోకి తుపాకులు వెళ్లకుండా విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ కొత్త చట్టాన్ని తెచ్చారు. అయినా కాల్పులు పెరిగాయే తప్ప తగ్గలేదు. 2023కి అగ్రరాజ్యం కాల్పులతో స్వాగతం పలికింది. ఒహియో, ఫ్లోరిడా, షికాగో, కరోలినా, పెన్సిల్వేనియాలలో తుపాకీల మోత మోగింది. అప్పట్నుంచి 38 సార్లు కాల్పులు జరిగితే 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 21న కాలిఫోర్నియాలో మాంటెరరీ పార్క్‌లో చైనీయుల కొత్త సంవత్సరం వేడుకల్లో జరిగిన కాల్పుల్లో 11 మంది మరణిస్తే 48 గంటలు తిరక్కుండానే కాలిఫోర్నియా హాఫ్ మూన్ బే వ్యవసాయక్షేత్రంలో ఏడు గురు తూటాలకు బలయ్యారు. షికాగోలో జరిగిన మరో కాల్పుల ఘటనలో ఇద్దరు మరణించారు.

ఎన్నాళ్లీ నెత్తుటి మోత ..!

అమెరికా రాజ్యాంగానికి రెండో సవరణ పౌరులు తుపాకులు కలిగి ఉండే హక్కుని కల్పించింది. రెండు ప్రధాన పార్టీల్లో రిపబ్లికన్లు తుపాకీలు కలిగి ఉండడానికి మద్దతుగా ఉండడం ఈ విషసంస్కృతిని కూకటి వేళ్లతో పెకిలించివేయడానికి వీల్లేకుండా చేస్తోంది. ప్రభుత్వం గన్ కల్చర్‌పై కఠిన ఆంక్షలు విధించాలని భావించిన సమయంలో సుప్రీం కోర్టు బహిరంగంగా తుపాకీ తీసుకువెళ్లే హక్కు అమెరికన్లకు ఉందంటూ గత ఏడాది సంచలన తీర్పు ఇచ్చింది. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ప్రజాప్రతినిధులతో బలమైన లాబీయింగ్ చేస్తూ తుపాకుల నిషేధానికి ఎప్పటికప్పుడు అడ్డం పడుతూ ఉంటుంది. టెక్సాస్ పాఠశాలలో ఒక టీనేజర్ జరిపిన కాల్పుల ఘటనలో 21 మంది విద్యార్థులు బలవడంతో ఒక్కసారిగా ప్రజల్లో కూడా తుపాకీ సంస్కృతిపై వ్యతిరేకత వచ్చి అదొక ప్రజా ఉద్యమంగా మారింది. అమెరికా ప్రజల్లో 60శాతం మంది తుపాకుల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీనేజర్లకి తుపాకులు విక్రయిస్తే వారి నేరచరితను విచారించాలంటూ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని రిపబ్లికన్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయడం లేదు. శక్తిమంతమైన రాష్ట్రాలు తలచుకుంటేనే ఈ తుపాకుల హింసకు అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయాలున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

100 మంది పౌరులకి 120 తుపాకులు

అమెరికాలో నివసించే పౌరుల కంటే వారి దగ్గర ఉండే తుపాకులే ఎక్కువ. అగ్రరాజ్యం జనాభా 30 కోట్లు ఉంటే అక్కడ ఉన్న తుపాకుల సంఖ్య 39 కోట్లు. అపరిమితమైన స్వేచ్ఛ, ఆత్మరక్షణ పేరుతో సాధారణ పౌరులు విచ్చలవిడిగా తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. కారణం లేకుండానే ట్రిగ్గర్ నొక్కేస్తున్నారు.



- అమెరికాలో తుపాకీ తూటాలకు రోజుకి సగటున 53 మంది ప్రాణాలు కోల్పోతున్నారు.
- కరోనా సమయంలో కాల్పుల ఘటనలు ఎక్కువగా జరిగాయి. ఆ సమయంలో తుపాకుల అమ్మకాలు ఏకంగా 63% పెరిగాయి.
- 2013 నుంచి ఏఆర్–15 రైఫిల్స్ అమ్మకాలు ఏడాదికి కోటికి పైగా జరగడం ఆందోళన కలిగిస్తోంది.
- 2020లో కాల్పులు దేశ చరిత్రలో మాయని మచ్చగా నిలిచాయి. ఆ ఏడాది 610 కాల్పులు జరగ్గా 45,222 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో హత్యలు, ఆత్మహత్యలు కూడా ఉన్నాయి.
- 2021లో రైఫిళ్లు, పిస్తోళ్లు వంటి చిన్న ఆయుధాల మార్కెట్ 370 కోట్ల డాలర్లుగా ఉంది.

అత్యధిక తుపాకులున్న దేశాలు
(ప్రతీ 100 మంది పౌరుల దగ్గరున్న తుపాకుల సంఖ్య)

అమెరికా	120.5
యెమెన్	52.8
సెర్బియా	39.1
మాంటెగ్రో	39.1
ఉరుగ్వే	34.7
కెనడా	34.7

కాల్పుల ఘటనలు ఇలా

2019	417
2020	610
2021	690
2022	647
2023	38

మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శిస్తాం

కేరళలో పార్టీల అనుబంధ విభాగాల ప్రకటన

తిరువనంతపురం/వాషింగ్టన్: ప్రధాని మోదీపై 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట బ్రిటిష్ వార్తా సంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శిస్తామని కేరళలోని వివిధ రాజకీయ పార్టీల అనుబంధ విభాగాలు మంగళవారం వెల్లడించాయి. దీనిపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం విజయన్ జోక్యం చేసుకోవాలని, వివాదాస్పద డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవాలని డిమాండ్ చేసింది. డాక్యుమెంటరీని ప్రదర్శించబోతున్నామంటూ సీపీఎం యువజన విభాగమైన డీవైఎఫ్‌ఐ ఫేసుబుక్‌లో పేర్కొంది. అనంతరం సీపీఎం విద్యార్థి విభాగం ఎస్ఎఫ్‌ఐ, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) అనుబంధ విభాగాలు ప్రకటించాయి. రాష్ట్రంలో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ కోరారు. మత కలహాలు సృష్టించడానికే ఈ డాక్యుమెంటరీని తెరపైకి తెచ్చారని మండిపడ్డారు.



తిరువనంతపురంలో డాక్యుమెంటరీ ప్రదర్శన

డాక్యుమెంటరీ గురించి తెలియదు: అమెరికా

బీబీసీ డాక్యుమెంటరీ గురించి తమకేమీ తెలియదని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది. అమెరికా, భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని పేర్కొంది. ఇరు దేశాల నడుమ బలమైన సంబంధ బాంధవ్యాలను తాము కోరుకుంటున్నామని వెల్లడించింది. ఇరు దేశాలు విలువలను కలిసి పంచుకోవాలన్నదే తమ ఆకాంక్ష అని ఉద్ఘాటించింది. బీబీసీ డాక్యుమెంటరీ విషయంలో బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్ గతవారం ప్రధాని మోదీకి అనుకూలంగా మాట్లాడారు. మోదీపై అసత్యాలు ప్రచారం చేయొద్దని హితవు పలికారు.

కొన్ని ప్రాంతాల్లో ప్రదర్శన

డాక్యుమెంటరీని ఎస్ఎఫ్‌ఐతోపాటు పలు సంఘాలు మంగళవారం కేరళలో కొన్ని ప్రాంతాల్లో ప్రదర్శించాయి. ఈ ప్రదర్శనలను వ్యతిరేకిస్తూ బీజేపీ యువమోర్చా కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి, నిరసన వ్యక్తం చేశారు. పాలక్కాడ్, ఎర్నాకుళం తదితర ప్రాంతాల్లో యువమోర్చా కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పోలీసులు రంగంలోకి దిగి, వారిని అడ్డుకున్నారు. కేవలం కేరళలోనే కాదు, దేశవ్యాప్తంగా డాక్యుమెంటరీని ప్రదర్శిస్తామని సీపీఎం యువజన విభాగం డీవైఎఫ్‌ఐ మంగళవారం తేల్చి చెప్పింది.

కాల్పులతో దద్దరిల్లిన అమెరికా

▶ మొదటి పేజీ తరువాయి

జరిగినట్లు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకోగా నలుగురు విగతజీవులుగాను, ఒకరు గాయపడి కనిపించారు. కొద్దిసేపటికే అక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రక్కింగ్ ఫాంలోనూ కాల్పులు జరిగాయి. పోలీసులు అక్కడ మరో మూడు మృతదేహాలను కనుగొన్నారు. దాదాపు రెండున్నర గంటల సమయం తర్వాత హాఫ్‌మూన్ బే పోలీస్‌స్టేషన్ పార్కింగ్ స్థలంలోని అనుమానాస్పద వాహనంలో ఉన్న చున్ లి కనిపించాడు. అతడితోపాటు వాహనంలో ఉన్న తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడొక్కడే కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. కారణాలను తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నామని పోలీసులు చెప్పారు. హాఫ్‌మూన్ బే ప్రాంతంలో వ్యవసాయ అనుబంధ క్షేత్రాలే ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి 12వేల జనాభాలో మెజారిటీ శ్వేతజాతీయులు కాగా, ఆసియన్లు 5% మంది. అమెరికాలో ఈ ఏడాదిలో జరిగిన 6వ మాస్ షూటింగ్ ఘటన ఇది. జనవరి 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు శాన్‌ఫ్రాన్సిస్కోలో మూడు మాస్ షూటింగ్స్ సంభవించాయని అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. శనివారం మాంటెరీ పార్క్‌లోని బాల్‌రూం డ్యాన్స్ హాల్‌లో జరిగిన కాల్పుల్లో 11 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

20 నిమిషాల వ్యవధిలోనే దొరికిపోయారు!

అయోవాలోని డెస్‌మోయిన్స్ స్కూల్‌లో లాభాపేక్షలేని సంస్థ ఒకటి చదువులో వెనకబడిన వారి కోసం ప్రత్యేకంగా 'స్టార్ట్స్ రైట్ హియర్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోగా టీచర్ ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగిన 20 నిమిషాల్లోనే పోలీసులు అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో అనుమానితులున్న కారును అడ్డగించి, అందులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

స్నేహితుడిని కలిసిందనే శ్రద్ధాను చంపాడు

మెహ్రౌలీ హత్య కేసులో పోలీసుల చార్జిషీట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మెహ్రౌలీ హత్య కేసులో ఢిల్లీ పోలీసులు మంగళవారం సాకేత్ కోర్టులో 6,629 పేజీల భారీ చార్జిషీట్ దాఖలు చేశారు. మరో స్నేహితుడిని కలిసిందనే కోపంతోనే సహజీవన భాగస్వామి శ్రద్ధా వాకర్‌ను అఫ్తాబ్ పూనావాలా చంపేసినట్లు తేలిందని అందులో పేర్కొన్నారు. గత ఏడాది మేలో శ్రద్ధ స్నేహితుడిని కలిసిందని, అది తనకు ఇష్టం లేదని అఫ్తాబ్ తెలిపాడు. ఆ కోపంతోనే అదే రోజు ఆమెను చంపినట్లు అంగీకరించాడు. ఇందుకోసం అతడు పలు ఆయుధాలను వాడాడని, కొన్నిమాత్రం తమకు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. విచారణ అనంతరం పోలీసులు గత ఏడాది నవంబర్ 12వ తేదీన అరెస్ట్ చేశారు. వివిధ బృందాలను ఏర్పాటు చేసి, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, గురుగ్రామ్, హరియాణాల్లో విచారణ జరిపినట్లు ఈ ఘటనకు సంబంధించి 150 మంది నుంచి వివరాలను సేకరించామన్నారు. లభించిన ఆధారాలను, నిర్వహించిన పరీక్షల ఫలితాలను పరిశీలించాకే నిందితుడిపై సెక్షన్లు 302, 201 కింద కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ మీను చౌదరి చెప్పారు. కాగా, కోర్టు మంగళవారం అఫ్తాబ్ జుడీషియల్ కస్టడీని ఫిబ్రవరి 7వ తేదీ వరకు పొడిగించింది. శ్రద్ధను చంపిన అనంతరం అఫ్తాబ్ ఆమె శరీర భాగాలను 35 ముక్కలుగా నరికి, ఫ్రిజ్‌లో దాచి తర్వాత రహస్యంగా పడేస్తూ వచ్చిన విషయం తెలిసిందే.



రసాభాసగా ఢిల్లీ మేయర్ ఎన్నిక తంతు

న్యూఢిల్లీ: మూడు కార్పొరేషన్లను విలీనం చేస్తూ కొత్తగా ఏర్పాటైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సమావేశం ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ కౌన్సిలర్ల వాగ్వాదంతో అర్ధంతరంగా ముగిసింది. మేయర్, డెప్యూటీ మేయర్‌ను ఎన్నుకునేందుకు మంగళవారం మొదలైన ఎంసీడీ సమావేశం జనవరి ఆరో తేదీ తరహాలోనే మళ్లీ పరస్పర ఆరోపణలతో వాయిదాపడింది. సభ మొదలైన కొద్దిసేపటికే బీజేపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోయి బయట నినాదాలు చేయడం మొదలుపెట్టారు. వెంటనే బీజేపీ అనుకూలురైన వారికి చట్టవిరుద్ధంగా మేయర్ ఓటింగ్ ప్రక్రియలో చాన్స్ ఇచ్చేందుకు కుట్ర పన్నారని ఆప్ నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో వీరితో బీజేపీ సభ్యులు కొందరు వాగ్వాదానికి దిగారు. పరస్పర ఆరోపణలు, నినాదాలతో సభ దద్దరిల్లింది. దీంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ సత్య శర్మ(బీజేపీ కౌన్సిలర్) సభను అర్ధంతరంగా వాయిదావేశారు. 'దమ్ముంటే బీజేపీ సభ్యులంతా సభలోకి వచ్చి ఓటింగ్‌ను పూర్తిచేయండి' అని ఆప్ నేత దుర్గేశ్ పాఠక్ సభలో డిమాండ్‌చేశారు.

కొలీజియం తీర్మానం తీవ్ర ఆందోళనకరం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా)కు చెందిన రహస్య పత్రాల్లో కొన్ని భాగాలను బహిర్గతం చేయాలని కొలీజియం తీర్మానించడం తీవ్ర ఆందోళనకర అంశమని అన్నారు. నిఘా విభాగాల సిబ్బంది దేశ హితం కోసం రహస్యంగా కార్యకలాపాలు సాగిస్తుంటారని, వారి రిపోర్టులను బయటపెడితే భవిష్యత్తులో కార్యాచరణపై ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సి వస్తుందని చెప్పారు. తద్వారా కొన్ని చిక్కులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మద్రాసు హైకోర్టు, ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి ఐబీ, 'రా' ఇచ్చిన నివేదికల్లోని కొన్ని భాగాలను ప్రజా సమూహంలోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవలే తీర్మానించింది. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తొలిసారిగా మంగళవారం మాట్లాడారు. కొలీజియం వ్యవహారంపై సరైన సమయంలో పూర్తిస్థాయిలో స్పందిస్తానని, ఇది తగిన సమయం కాదని అన్నారు.

బెంగళూరులో రూ.10 నోట్ల వాన

బెంగళూరు: అతడికి ప్రచారం పిచ్చి. కొద్ది సమయంలోనే పాపులారిటీ సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం వేసిన పథకంలో భాగంగానే కరెన్సీ నోట్లను వెదజల్లాడు. బెంగళూరులోని రద్దీగా ఉండే కేఆర్ మార్కెట్ ఏరియాలో కరెన్సీ నోట్ల వర్షం వెనుక అసలు కథ ఇది. మంగళవారం ఉదయం నల్లని బ్లేజర్‌ను ధరించి మెడలో గోడ గడియారం వేసుకుని ఓ వ్యక్తి(30) మార్కెట్ ఏరియాలోని ఫ్లై ఓవర్‌పైకి వచ్చాడు. వెంట తెచ్చుకున్న సంచీలోని రూ.10 నోట్లను విసిరేస్తుండటంతో ఆశ్చర్యపోవడం వాహనదారుల వంతైంది. ఫ్లై ఓవర్ కింద రోడ్డుపై వెళ్తున్న వారు నోట్ల కోసం ఎగబడటంతో గందరగోళం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని, పరిస్థితిని చక్కదిద్దారు. యాంకర్‌గా పనిచేస్తూ మార్కెటింగ్ రంగంలో ఉన్న అతడు వీడియోల ద్వారా పాపులారిటీ సంపాదించాలని ప్లాన్ వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నోట్ల వర్షం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

12 శాతం పెరిగిన ధాన్యం సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా ధాన్యం సేకరణలో గణనీయమైన వృద్ధి నమోదయ్యింది. గత ఏడాది సీజన్‌లో సేకరించిన ధాన్యంతో పోలిస్తే ఈసారి 12 శాతం అధికంగా సేకరించడం విశేషం. గత ఏడాది జనవరి మూడో వారానికి 5.50 కోట్ల మెట్రిక్ టన్నులు సేకరించగా, ఈ ఏడాది ఏకంగా 6.20 కోట్ల మెట్రిక్ టన్నులు సేకరించారు. మద్దతు ధరకు అనుగుణంగా రూ.1.28 లక్షల కోట్ల మేర చెల్లింపులు సైతం చేసినట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సీజన్ మొత్తం ముగిసే నాటికి 9 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉన్నట్లు తెలియజేసింది. నిజానికి గత ఏడాది ఖరీఫ్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.1.42 లక్షల కోట్ల విలువైన 7.25 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈసారి విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో భారీగా ధాన్యం సేకరణ జరుగుతోంది. పంజాబ్‌లో 1.81 కోట్ల మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌లో 92 లక్షలు, హరియాణాలో 58.97 లక్షలు, తెలంగాణలో 59 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరణ జరిగింది.

నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ: 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను'అనే ఇతివృత్తంతో నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుగనుంది. 2011లో ప్రారంభమైన జాతీయ ఓటర్ల దినోత్సవం ఏటా జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఢిల్లీలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2022 ఎన్నికల సమయంలో ఐటీ, భద్రత, ఓటరు జాబితా, ఓటర్లకు అవగాహన వంటి అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు రాష్ట్రపతి జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్నారు.



కేంద్ర గిరిజన శాఖ, రక్షణ శాఖలు సంయుక్తంగా తొలిసారిగా నిర్వహిస్తున్న ఆది శౌర్య కార్యక్రమంలో విన్యాసాలు చేస్తున్న ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ మోటార్‌సైకిల్ బృంద సభ్యుడు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని రెండ్రోజులపాటు ఢిల్లీలో ఈ వేడుకలు నిర్వహించారు.

నిషేధాలు, అణచివేతలు నిజాన్ని ఆపలేవు

మోదీపై బీబీసీ డాక్యుమెంటరీని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్య

జమ్మూ: గుజరాత్ అల్లర్లకు నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోదీనే బాధ్యుడని బ్రిటన్ వార్తాసంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పరోక్షంగా సమర్థించారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా మంగళవారం జమ్మూ పట్టణంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ' భగవద్గీత, ఉపనిషత్తులు మనకో విషయం చెప్తాయి. నిజాలను దాచడం అసాధ్యం. అవి ఏనాటికైనా ప్రజ్వలిస్తూ బహిర్గతమవుతాయి. మీరు(కేంద్ర ప్రభుత్వం) మీడియాను అణచివేయొచ్చు. కానీ, నిషేధాలు, అణచివేతలతో నిజాన్ని దాచలేము' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరిట రూపొందిన డాక్యుమెంటరీ తొలి భాగంలో గోద్రా అల్లర్లకు మోదీ బాధ్యుడని బీబీసీ పేర్కొనడం, దానిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీవ్రంగా ఖండించడం తెల్సిందే. యూట్యూబ్, ట్విటర్‌లలో సంబంధిత లింకులను బ్లాక్‌చేయాలని ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఆదేశాలు ఇవ్వడం విదితమే. కొత్తగా ఎవరైనా ట్వీట్లు చేస్తే వాటినీ తొలగించాలని కేంద్రం మంగళవారం ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ కష్టాలు పెరిగాయని, మళ్లీ రాష్ట్ర హోదాను పునరుద్ధరించి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని రాహుల్ అన్నారు.

కోట్లు కుమ్మరిస్తున్నారు

తన పరువు ప్రతిష్టలను దిగజార్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యవస్థీకృతంగా వేల కోట్లు ఖర్చుపెడుతున్నాయని, అయినా అంతిమంగా సత్యమే విజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం నగ్రోటా పట్టణంలో మొదలైన భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతోపాటు మాజీ కాంగ్రెస్ నాయకురాలు, ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్ ఊర్మిళా మతోండ్కర్ కొద్దిసేపు కలిసి నడిచారు. భారత సైన్యం సరిహద్దు దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ దాడులు చేసిందనడానికి మోదీ సర్కార్ రుజువులు చూపదెందుకని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హాస్యాస్పదంగా అభివర్ణించారు.

'ఆ రోజులోపు బాయ్‌ఫ్రెండ్ ఉండాల్సిందే'

పారాదీప్(ఒడిశా): 'కళాశాలలో చదివే ప్రతి ఒక్క అమ్మాయి ప్రేమికుల దినోత్సవం రోజుకల్లా బాయ్‌ఫ్రెండ్‌తో కనిపించాలి. లేదంటే కాలేజీలోకి అనుమతించబోము' అంటూ ఒడిశాలో ఒక కాలేజీ తరఫున అధికారికంగా వెలువడిందని చెబుతున్న నోటీసు ఒకటి సామాజిక మాధ్యమాల్లో షేర్ అవుతోంది. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదుచేసి తప్పుడు నోటీస్ తయారుచేసిన నిందితుల కోసం వెతికే పనిలో పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలోని ఎస్‌వీఎం అటానమస్ కాలేజీ ప్రిన్సిపల్ పేరిట ఒక నకిలీ నోటీసు వెలువడింది. కాలేజీపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో బిజయ్ కుమార్ వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశారు. సంతకాన్ని దుర్వినియోగం చేశారని, అది నకిలీ నోటీసు అని కాలేజీ పరువు తీసేందుకు కావాలనే ఎవరో కుట్ర పన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పరిష్కార సామర్థ్యం పెంచుకోండి

బాల పురస్కార్ గ్రహీతలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేలా సామర్థ్యాలు పెంచుకోవాలని బాలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' విజేతలతో సమావేశమయ్యారు. పిల్లల మానసిక ఆరోగ్యం, వారికి ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. జీవితంలో ముందుకు వెళ్లడానికి తొలుత చిన్న సమస్యలను పరిష్కరించుకోవడం ప్రారంభించాలని, ఆ పెద్ద సమస్యలను సైతం సులువుగా పరిష్కరించుకొనేలా సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని క్రమంగా పెంపొందించుకోవాలని సూచించారు. చదరంగం ఆడడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కళలు, సంస్కృతి, పరిశోధనలు, ఆవిష్కరణలు, ఆధ్యాత్మికతను కెరీర్‌గా మార్చుకోవాలని చెప్పారు. బాల పురస్కార్ గ్రహీతల అనుభవాలను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అవార్డు గ్రహీతలు పలు అంశాలపై మోదీ సలహాలు సూచనలు తీసుకున్నారు. బాల పురస్కారాలకు ఈసారి 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 11 మంది ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురు బాలలు, ఐదుగురు బాలికలు ఉన్నారు. బాల పురస్కార్ విజేతలు ఎం.గౌరవీరెడ్డి, కోలగట్ల అలనా మీనాక్షి తదితరుల ఘనతలను ప్రధాని మోదీ ట్విట్టర్‌లో ప్రశంసించారు.



బాలపురస్కార్ గ్రహీత మీనాక్షితో మోదీ

'పరీక్షా పే చర్చ'లో 38 లక్షల మంది!

ప్రధాని మోదీ ఏటా స్వయంగా పాల్గొని, విద్యార్థులతో సంభాషించే 'పరీక్షా పే చర్చ' కోసం ఈ ఏడాది ఏకంగా 38 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. గత ఏడాది కంటే ఈసారి అధికంగా 15 లక్షల మంది పాల్గొనబోతున్నారు. 155 దేశాల నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 27న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరుగనుంది. కొందరు స్టేడియంలో, మిగతావారు ఆన్‌లైన్‌లో పాల్గొంటారు. పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే విషయంలో మోదీ మార్గనిర్దేశం చేస్తారు.

ఆవు పేడతో కట్టిన ఇళ్లతో అణుధార్మికత నుంచి రక్షణ

వియారా(గుజరాత్): ఆవు పేడతో నిర్మించిన ఇళ్లు అణుధార్మికత నుంచి రక్షణ ఇస్తాయనే విషయం సైన్సు నిరూపించిందని గుజరాత్‌లోని తాపి జిల్లా సెషన్స్ జడ్జి సమీర్ వ్యాస్ పేర్కొన్నారు. గో మూత్ర ఎన్నో వ్యాధుల నుంచి కాపాడుతుందని తెలిపారు. అందుకే దేశంలోని గోవులను, వధించడం మానేసి రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోవుల అక్రమ రవాణాకు పాల్పడిన ఓ వ్యక్తికి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పులో ఈ విషయాలను ఆయన పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్‌లో ఇచ్చిన తీర్పు వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ప్రపంచంలోని అన్ని సమస్యలకు గోవధే కారణమని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన మహ్మద్ అమిన్ అంజుమ్(20) 2020లో గుజరాత్ నుంచి ఆవులను తరలిస్తూ పట్టుబడ్డాడు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 25 । జనవరి । 2023



ఆడపిల్లలు ఆలోచించాలి

ఆడపిల్లలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా జడ్జి ప్రతిమ అన్నారు. జాతీయ బాలిక, శిశు దినోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 8లో▸



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో తొలిరోజు పరీక్షకు 85 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

ఆటాడేస్తున్నారు..!



తప్పు చేసేదివారే.. నిర్లక్ష్యం వారిదే..

• భూ రికార్డుల నిర్వహణలో ఇష్టారాజ్యం • వేలమంది రైతుబంధుకు దూరం • అప్పులిచ్చేందుకు బ్యాంకుల నిరాకరణ

పాపం శ్రీనివాస్..



ఆకుల శ్రీనివాస్, సోదరుడు తిరుపతి కలిసి 6 సంవత్సరాల క్రితం వేములవాడ మండలం వెంకటాంపల్లిలోని 26, 36, 39, 41, 42, 43, 44 సర్వేనంబర్లలో గల సాగు భూమిని రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేశారు. ధరణి రాక ముందు జరగగా మ్యుటేషన్ చేయడంలో ఆలస్యం అయింది. అంతలోనే ధరణి వచ్చి చేరింది. దీంతో ధరణిలో మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌ను బంతాట ఆడుతున్నారు. ఒక్కోసారి ఒక్కో కొర్రీ పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ముందు కాలువ కింద భూమి పోకున్నా.. పోయిందని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. తరువాత రుణమాఫీ అయినప్పటికీ బ్యాంక్ లోన్ ఉందని నెలల తరబడి తిప్పుకున్నారు. సాక్షి కథనం క్రమంలో రెండు, మూడు సర్వే నంబర్లను పరిష్కరించగా మళ్లీ అదే పరిస్థితి. 36, 39, 41 ఇతర సర్వేనంబర్లలోని బై నంబర్లలో కొన్నింటికి డిజిటల్ సైన్ చేయగా మరికొన్ని నాలా అంటూ, ప్రొహిబిటేడ్ అంటూ పేర్కొనడం విడ్డూరం. తీరా కలెక్టర్ చేతిలో ఉందని చేతులెత్తేశారు. ఫలితంగా ఆరేళ్లుగా రైతుబంధు అందకపోగా ఇతర ప్రయోజనాలు పొందడం లేదు.

ఎవరి తప్పు..



ఈ రైతు పేరు కస్తూరి కీర్తికుమార్. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామం. గ్రామంలోని 924/ఆ/2/1లో వారసత్వంగా 12 గుంటలు నమోదు కావాల్సి ఉండగా కేవలం 2 గుంటలు మాత్రమే నమోదైంది. ఇదెక్కడి అన్యాయమని రెవెన్యూ అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప పరిష్కరించలేదు. మీసేవలో చేసిన దరఖాస్తులో తప్పుల వల్లే తప్పుగా నమోదైందని అధికారులు చెబుతుండటం విశేషం. ఇవి కేవలం వీరిద్దరి సమస్యనుకుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల మంది రైతుల గోస.

మార్పులకు అవకాశంలోనూ నిర్లక్ష్యం..!

రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో పలు ఆప్షన్లకు అవకాశమిచ్చింది. అయినా.. అధికారుల వల్లమాలిన నిర్లక్ష్యం రైతులకు శాపమవుతోంది. పట్టాదారు పాసుపుస్తకంలో అక్షర దోషాలు ఉన్నా పొరబాటున వేరే పేరు పడినా సరి చేసుకోవచ్చు. మహిళకు బదులు పురుషుడు, పురుషుడికి బదులు మహిళ అని అచ్చు తప్పు దొర్లినా, రిజర్వేషన్ కేటగిరీ తప్పుగా నమోదైనా, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైనా సరిచేసుకోవచ్చు.

- అలాగే పట్టా, సీలింగ్, భూదాన్, అసైన్డ్ వంటివి తప్పుగా నమోదైతే మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- భూమి ఏ విధంగా సంక్రమించిందనే వివరాల్లో తప్పులుంటే మార్చుకునే వీలుంది.
- వాస్తవ భూమి కంటే పాస్ పుస్తకంలో తక్కువగా నమోదైతే మార్చుకునే వీలుంది. దీంతో ఎక్కువ.. తక్కువ సమస్యలు తొలగుతాయి.
- భూమి వర్గీకరణ మాగాణి, తరి, మెట్ట వంటి వివరాల మార్పిడి చేసుకోవచ్చు.
- వారసత్వం, అన్న, తమ్ముడు, సొంతం, కుమారుడు వంటివి మార్చుకునే అవకాశముండగా ఏదైనా సర్వే నంబర్ లేదా సబ్ డివిజన్ నంబర్ కనిపించకపోవడం, ఆ మేరకు విస్తీర్ణం తక్కువగా నమోదైతే మార్చుకునే అవకాశముంది. దీనికి సంబంధించిన సర్వే నంబర్లను ఎంచుకోవచ్చు.
- ఏదైనా కారణంతో భూమి 1బీ ఖాతాలో చేరి తర్వాత పరిష్కారమైతే వాటి పట్టా నమోదుకు అవకాశమిచ్చారు. కానీ సదరు అర్జీల్లోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఎవరో జ్వాలను రగిలించారు.. వేరెవరో దానికి బలి అయ్యారు' అన్న పదాలకు ధరణి పోర్టల్ సమస్యలు సరిగ్గా సరిపోతాయి. భూముల విషయంలో పారదర్శకత తీసుకువస్తామని చెప్పి.. అమలులోకి తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో పాత సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తూ రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. చిన్న పొరపాట్లు, అక్షర దోషాలు, తప్పుల సవరణ చేసేందుకు సైతం అధికారులు బాధితులను నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో సామాన్యులు.. అందులోనూ రైతులు నానా ఇబ్బందుల పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు వీరికి అందని ద్రాక్షగా మారింది. సవరణలు చేయాలని కాళ్లరిగేలా తిరిగినా.. కనికరించే నాథుడు లేకుండా పోవడం అత్యంత బాధాకరం.

- ప్రభుత్వం భూ సమస్యల్లేకుండా దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా అధికార యంత్రాంగ నిర్లక్ష్యం గుదిబండలా మారింది. కాలువ కింద భూమి పోకున్నా పోయిందని, నాలా భూమని, బ్యాంకు లోన్ ఉందంటూ తిర'కాసులు' పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం వీరికే చెల్లు. నెలలు కాదు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటే విధుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సర్వే నంబర్ సమస్యలో ఉంటే సరే అందులోని బై నంబర్లు సరిగా ఉండటం, మరిన్ని సమస్యల్లో ఉంచడం దేనికి సంకేతం. పలువురు కలెక్టర్లు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కొరడా ఝుళిపిస్తుండగా పలువురు కలెక్టర్లు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరం. ప్రతీ కుటుంబంపై కలెక్టర్‌కు అవగాహన ఉండాలని, సమస్యల్లేకుండా పాలన ఉండాలనే జిల్లాల విభజన చేసినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధం.

ధరణి పేరిట కాలయాపన..
ప్రజావాణిలో అత్యధికం ఇవే

రెవెన్యూ అధికారులు మామూలుగా పరిష్కరించే సమస్యలను కూడా ధరణితో ముడిపెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో ఈ తరహా కేసులు ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. జగిత్యాల జిల్లాలో 8,174 దరఖాస్తులు రాగా ఇందులో తిరస్కరించినవి 2,685. అంగీకరించినవి 5,489. అంటే 426 రోజుల్లో రోజుకు 12 అర్జీలు వచ్చినట్లు అధికారికంగా ఇచ్చిన సమాచారంతో స్పష్టమవుతోంది. ఈ లెక్కన రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మరో 15 వేల వరకు ధరణి దరఖాస్తులుంటాయని స్పష్టమవుతోంది. ఇక ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో అత్యధికం ఇవే ఉండటం అధికారుల పనితీరుకు నిదర్శనం. ప్రతీ సోమవారం కలెక్టరేట్లలో ప్రజావాణి జరుగుతుండగా సుమారు 200 వరకు అర్జీలొస్తున్నాయి. ఇందులో 70–90వరకు ఇవే అర్జీలున్నాయంటే పరిస్థితి తీవ్రతను చాటుతోంది.

సమస్యలు ఎన్నెన్నో..!

ఎకరాన రూ.20 లక్షలు పలికినా భూముల ధరలు నేడు కోటికి చేరడంతో అత్యంత విలువైందిగా మారింది. దీంతో భూ వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యల్లేకుండా చొరవ తీసుకోవాల్సిన యంత్రాంగం నత్త నడకన వ్యవహరించడం దారుణ పరిణామం. ఒకరి భూమి ఒకరి పేరున నమోదవడంతో వీటిని తిరిగి పొందేందుకు ఆప్షన్లు సైతం లేకుండా పోయాయి. నాలుగైదు దశాబ్దాల కిందట భూములు అమ్ముకున్నవారు సైతం ధరణిలో రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా వారి పేర్లు రావడంతో భూములు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి సాగుచేసుకుంటుండగా వంశపారంపర్యంగా వచ్చిన భూములు ఇతరుల పేర్లపై ధరణిలో నమోదయ్యాయి. పక్కాగా ఉన్న పట్టా భూములు సైతం నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో రైతులు పంట రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడింది. చాలా సర్వే నంబర్లు మిస్ అయ్యాయి. ఏళ్లుగా రైతుబంధుకు దూరమవుతున్నారు.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల పరిశీలన షురూ



కరీంనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదలైన కారణంగా త్వరలో చేపట్టబోయే గెజిటెడ్ హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం విభాగాల్లో అర్హులైన ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను మంగళవారం పురాతన పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు అదనపు అర్హతల ధ్రువపత్రాలను పరిశీలించేందుకు విద్యాశాఖ అధికారులు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. అర్హత ఉన్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, సూపరింటెండెంట్ నర్సింహస్వామి, సెక్టోరల్ ఆఫీసర్లు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బాసరకు ప్రత్యేక బస్సులు

కరీంనగర్: వసంత పంచమి సందర్భంగా ఈ నెల 25, 26 తేదీల్లో కరీంనగర్, గోదావరిఖని బస్‌స్టేషన్‌ల నుంచి జ్ఞాన సరస్వతి క్షేత్రం బాసరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నుంచి రిజర్వేషన్ చార్జీలతో కలిపి రూ.280, గోదావరిఖని నుంచి రిజర్వేషన్ చార్జీలతో కలిపి రూ.370 ఉంటాయని పేర్కొన్నారు. www.tsrtconline.in వెబ్‌సైట్ ద్వారా సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

పీఏసీఎస్ సందర్శన



చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జోగులాంబ గద్వాల, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన సహకార సంఘాల అధ్యక్షులు మంగళవారం సందర్శించారు. చొప్పదండి సంఘం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందుతున్న సేవలు, కంప్యూటర్ బ్యాంకింగ్ విధానం, వ్యాపార లావాదేవీలు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ వివరించారు. జాతీయ ఉత్తమ పీఏసీఎస్ హ్యాట్రిక్ విజేత వెల్మ మల్లారెడ్డి సంఘం ఎదుగుతున్న తీరును వివరించారు. కార్యక్రమంలో సీఈవో తిరుపతిరెడ్డి, డీజీఎంటీ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



కరీంనగర్‌రూరల్: డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం డ్రైవర్స్ డే పురస్కరించుకుని జిల్లా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవర్ల– రహదారి భద్రత సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ తప్పిదాలతోనే ఏటా 80 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా దాదాపు రూ.1.80 లక్షల మంది చనిపోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని చిన్నముల్కనూర్, రామంచ, ముదిమానిక్యం, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి, సుందరగిరి గ్రామాల్లో మంగళవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ రఘురామిరెడ్డి, రాంగోపాల్‌వర్మ, కిరణ్‌కుమార్ వరిపొలాలను సందర్శించారు. తెగుళ్ల వల్ల దెబ్బతిన్న వరి పంటలను డీఏవో శ్రీధర్ నేతృత్వంలో పరిశీలించారు. కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలన్నారు. అలాగే కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉందని, దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి పది కిలోలు చల్లుకోవాలన్నారు. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, ఏఓ రంజిత్ కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి వైద్య కళాశాల తరగతులు

- పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాల ఓ వరం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్
- రూ.7 కోట్లతో తాత్కాలిక తరగతి గదుల మరమ్మతు పనులకు భూమిపూజ



వైద్య కళాశాల తరగతి గదుల మరమ్మతు పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి(కరీంనగర్): 2023–24 విద్యా సంవత్సరం నుంచి కరీంనగర్ వైద్య కళాశాలలో ప్రవేశాలు చేపట్టి 100 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర విత్తన గిడ్డంగుల సంస్థ విత్తన శుద్ధి కర్మాగారం గోదాంలను రూ.7 కోట్లతో వైద్య కళాశాల తాత్కాలిక తరగతి గదులుగా ఆధునికీకరించే మరమ్మతు పనులకు మంగళవారం మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం గంగుల విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు పేద విద్యార్థులకు గొప్ప వరమని, ఇప్పటికే కరీంనగర్‌లో రెండు ప్రైవేట్ వైద్య కళాశాలలున్నా మరో వైద్య కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. నాలుగు గోదాముల్లో తరగతి గదులు, లైబ్రరీ, అనాటమీ ల్యాబ్, బయో కెమిస్ట్రీ ల్యాబ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిసియోలజీ, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వంటి తాత్కాలిక భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లోపు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అదేవిధంగా 25 ఎకరాల్లో నిర్మించే వైద్య కళాశాల కొత్త భవన నిర్మాణ పనుల ప్రక్రియ టెండర్ దశలో ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కమిషనర్ కె.వేణుమాధవ్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పవన్ పూజలు

- కొండగట్టు అంజన్నను దర్శించుకున్న పవన్ కల్యాణ్
- వారాహి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు



అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: జన సేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది యువత, అభిమానులు తరలివచ్చారు. తొలుత కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. త తర్వాత పవన్ కల్యాణ్ శ్రీఆంజనేయస్వామికి శేష వస్త్రాలు, తమల పాకులు, పండ్లు సమర్పించారు. మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్రస్వామి, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, అఖిల్ కృష్ణ, రామ్, లక్ష్మణ్.. పవన్ కల్యాణ్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం జనసేన ప్రచార రథం వారాహి వాహనానికి పూజలు నిర్వహించారు. వారాహి పూజ అనంతరం ఆ వాహనంపైకి ఎక్కిన పవన్ కల్యాణ్ అభిమానులకు అభివాదం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి జన సేన పనిచేస్తుందని అన్నారు. 'జై తెలంగాణ' అంటూ ప్రచారం ముగించారు. నాచుపల్లిలోని బృందావన్ రిసార్ట్స్ వద్ద కార్యకర్తలతో సమావేశమైన పవన్ కల్యాణ్‌ను చూసేందుకు వందలాది మంది తరలివెళ్లారు.

ధర్మపురి నృసింహుని సన్నిధిలో..

సాయంత్రం 6.30గంటలకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధికి చేరుకున్న పవన్ కల్యాన్.. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పవన్ రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణాన్ని అష్ట దిగ్బంధం చేశారు.



హారతి తీసుకుంటున్న మేయర్ సునీల్‌రావు



ప్రబంధ పారాయణం చేస్తున్న అర్చకులు







పాట పాడుతున్న లలిత

వైభవంగా అధ్యయనోత్సవాలు

- అలరించిన పలు కార్యక్రమాలు

కరీంనగర్‌కల్చరల్: శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తజన నీరాజనాల మధ్య అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేద పండితులు నమిలకొండ రాజగోపాలచార్యులు, దెబ్బట శ్రీధరాచార్యులు, రాజారామ్మోహన్, చెన్నోజ్వల నాగరాజాచార్య ఆధ్వర్యంలో ప్రబంధ పారాయణం, తీర్థగోష్టి నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ ధర్మకర్తలు చకిలం గంగాధర్, చకిలం శ్రీనివాస్, ఉత్సవ కమిటీ బాధ్యులు తదితరులు ఉన్నారు.

నాదనీరాజనం వేదికపై..

ఉదయం శ్రీ వేంకటేశ్వర, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, గీతాసంచార్ సత్సంగ్ భజనమండలులతో భజన, సాయంత్రం భగత్‌నగర్ పావని బృందం భక్తి సంకీర్తనలు, శారదా సంగీత పాఠశాల విద్యార్థులతో భక్తి కీర్తనలు, వంగల సురేంద్రాచారి శిష్య బృందం భరతనాట్యం, బాలాత్రిపురసుందరి నాట్యాలయ బృందం అలరించాయి.

క్లుప్తంగా

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

కరీంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 27 నుంచి జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్‌బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాం రాజయ్య అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తర్వు 317 ద్వారా బదిలీపై వెళ్లి స్థానికత కోల్పోయి వేరే జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లకు జీరో సర్వీస్ ఇస్తూ వారి పాత స్టేషన్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుని బదిలీల్లో అవకాశం కల్పించాలన్నారు. బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయుల అప్పీళ్లను త్వరగా పరిష్కరించాలన్నారు. బకాయి పడ్డ రెండు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (ఎల్ఎఫ్ఎల్) పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల సదరం సర్టిఫికెట్లు పూర్తి స్థాయిలో పరిశీలన జరపాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సాంబయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమేష్, బూర శ్రీనివాస్, గోదారి ప్రశాంత్, ఎ.సరోత్తంరెడ్డి, ఎస్.రాంప్రసాద్, స్వరూప, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన పత్తి ధర

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. సోమవారం క్వింటాల్‌కు రూ.8,000 పలుకగా మంగళవారం రూ.7,950కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగుడు దిగుడు ధరల వల్ల పత్తి ధరలు తగ్గుతున్నాయని ఖరీదు వ్యాపారులు పేర్కొంటున్నారు. మంగళవారం మార్కెట్‌కు 131 వాహనాల్లో 1,674 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,950, మోడల్ ధర రూ.7,900, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో 18 మంది రైతులు 27 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,650, మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.6,500 పలికింది. కొనుగోళ్లను మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

యాదగిరి గుట్టకు బస్సు సౌకర్యం కల్పించండి

కరీంనగర్: తెలంగాణలో పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరి గుట్టలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి కరీంనగర్ నుంచి బస్సుసౌకర్యం కల్పించాలని మంగళవారం నగర మేయర్ వై.సునీల్‌రావు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్‌తో పాటు పరిసర ప్రాంత ప్రజలు యాదగిరి గుట్టకు వెళ్లేందుకు కరీంనగర్ నుంచి వయా హుస్నాబాద్, నర్మెట, జనగాం మీదుగా రోజుకు మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమయపాలన ఉండేలా బస్సులు నడుపాలని కోరినట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికొప్పుల సంపత్‌కు విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.స్వామి తెలిపారు. ఎలాంటి అనుమతుల్లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డ సంపత్‌పై కేసు నమోదు చేయడంతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించి మొదటి నేరంగా వదిలిపెట్టడం జరిగిందన్నారు. అయినా పద్ధతి మార్చుకోని సంపత్ విద్యుత్ చౌర్యానికి పాల్ప డుతూ రెండవ సారి దొరకడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. కోర్టు చేపట్టే విచారణకు విధిగా హాజరుకావాలని ఆదేశిస్తూ అతడికి బెయిల్ మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి సంపత్ తప్పించుకు తిరుగుతుండగా మంగళవారం ఎస్సై నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్, రాజయ్య శ్రీనివాసనగర్‌లో అతన్ని పట్టుకొని కోర్టులో హాజరపర్చినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి, నిందితున్ని జైలుకు తరలిస్తూ ఆదేశాలిచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏసీడీ చార్జీలపై కదంతొక్కిన కాంగ్రెస్

- నుస్తులాపూర్‌లో రాజీవ్ రహదారిపై ఆందోళన
- మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న నాయకులు
- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లితో పాటు పలువురిపై కేసు


రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్(మానకొండూర్): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారుల నుంచి దొడ్డిదారిన వసూలు చేస్తున్న కరెంటు బిల్లులను తగ్గించాలని మండలంలో కాంగ్రెస్ శ్రేణులు కదంతొక్కాయి. నుస్తులాపూర్‌లో రాజీవ్ రహదారిపై ధర్నా చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు (ఏసీడీ)చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆ భారాన్ని ప్రజలపై మోపడం సరికాదన్నారు. వెంటనే ఏసీడీ చార్జీలు తగ్గించాలని, తగ్గించే వరకూ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు.

మంత్రి గంగుల కాన్వాయ్ అడ్డగింత

రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ధర్నా చేస్తున్న సమయంలో అటుగా వచ్చిన మంత్రి గంగుల కమలాకర్ కాన్వాయ్‌ని ఆందోళనకారులు అడ్డుకున్నారు. మొదట ధర్నా సమయంలో మంత్రి సహాయకుడు రోడ్డు క్లియర్ చేయాలని, మంత్రి ఉన్నాడని చెప్పడంతో సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వాహనం వద్ద చేరుకొని నిరసన తెలిపారు. తిమ్మాపూర్ సీఐ శశిధర్‌రెడ్డి అక్కడికి చేరుకుని కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి తరలించారు. అనంతరం అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా రహదారిపై ధర్నా నిర్వహించిన జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లితో పాటు పలువురి నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు. అనంతరం సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

రెండు నెలల వ్యవధిలో ఇద్దరికి నిరసన సెగ

మానకొండూర్ నియోజకవర్గంలో రెండు నెలల వ్యవధిలో ఇద్దరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ నిరసన సెగ తగిలింది. డిసెంబర్ 2న గుండ్లపల్లి వద్ద రోడ్డు కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేస్తుండగా అటుగా వెళ్లిన రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్‌ను అడ్డుకున్నారు. తాజాగా నుస్తులాపూర్‌లో మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుని నిరసన తెలిపారు.

ఆడపిల్లలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి

- జిల్లా జడ్జి ప్రతిమ


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రతిమ

కరీంనగర్: ఆడపిల్లలందరూ భయంతో కాకుండా పరిణితి చెందిన మనసుతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా జడ్జి ప్రతిమ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ బాలిక, శిశు దినోత్సవం-2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ మధ్యతరగతికి చెందిన నలుగురు ఆడపిల్లలున్న తమ కుటుంబంలో ఆ కాలంలోనే కట్నం అనే ప్రస్తావన లేదని, పెళ్లై ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత లా పూర్తిచేసి ఈ స్థానానికి చేరుకున్నట్లు తెలిపారు. అమ్మాయిలు అనగానే తల్లిదండ్రులు వారి చదువు, పెళ్లిళ్లకు ఎంతఖర్చు అవుతుందని బేరీజు వేసుకోకుండా, వారి భవిష్యత్తును వారే తీర్చిదిద్దుకునే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. ఆడపిల్లలు చిన్నతనంలో ప్రేమ పేరుతో భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా పరిణితితో మెదలాలని సూచించారు. ప్రస్తుత సభ్యసమాజం కడుపులో ఉన్నది ఆడ లేక మగ అని తెలుసుకునే స్థాయి నుంచి పుట్టాల్సింది ఆడపిల్ల లేక మగపిల్లాడా అని నిర్ణయించుకునే స్థాయికి దిగజారుతుందని, అలాంటివి నిరోధించడానికి పీసీ పీఎన్‌డీటీ చట్టం-1971ని అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం మగవాళ్లతో సమానంగా అన్ని రంగాల్లో అమ్మాయిలు ఘన విజయాలు సొంతం చేసుకుంటున్నారని, వారి స్ఫూర్తితో భవిష్యత్‌లో అద్భుత విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, ఆడపిల్లల హక్కులను గౌరవించి వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. గతంలో ఆపరేషన్ ద్వారా పురుడు పోసే (సి- సెక్షన్) విధానం ఎక్కువగా ఉండేదని అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌వో సహకారంతో కట్టుదిట్టంగా వ్యవహరించి జిల్లాలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగే స్థాయికి తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పీసీ- పీఎన్‌డీటీ యాక్ట్-1971 పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సుజయ్, సీపీ వి.సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యురాలు శోభారాణి, జిల్లా చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీఎంహెచ్‌వో జువేరియా, జిల్లా సంక్షేమాధికారి సబిత తదితరులు పాల్గొన్నారు.

చేతిలో తల్వార్.. రోడ్డుపై హల్‌చల్


తల్వార్‌తో జెడ్పీటీసీ


ఎస్సైని మందలిస్తున్న సీపీ సత్యనారాయణ


భారీగా ట్రాఫిక్ జామ్

- కేశవపట్నంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు
- తాడికల్ నుంచి మండలకేంద్రానికి భారీ ర్యాలీ
- రోడ్డుపై భారీ ట్రాఫిక్‌జామ్.. నిలిచిన వాహనాలు
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న సీపీ.. జెడ్పీటీసీ, ఎస్సైకి మందలింపు
- స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ క్లియర్ చేయించిన సీపీ

శంకరపట్నం(మానకొండూర్): చేతిలో తల్వార్.. దారిపొడవునా వాహనాలు.. రోడ్లపైనే బాణాసంచా పేలుళ్లు.. డీజే మోతలతో వాహదారులు, ప్రజలకు ఇబ్బందులు. శంకరపట్నం మండలం కేశవపట్నంలో మంగళవారం నాటి సంఘటన ఇదీ. స్థానిక జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా హల్‌చల్ చేశారు. మండలంలో తాడికల్ నుంచి కేశవపట్నం వరకు 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులతో ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీ తీశారు. చేతిలో తల్వార్, డీజే మోతలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. మండల కేంద్రంలో నడిరోడ్డుపై వాహనాలు నిలిపి అభిమానులు భారీ గజమాలతో సత్కరిస్తున్న సమయంలో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామైంది. అదే సమయంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న సీపీ సత్యనారాయణ కారు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. రెండుమూడు నిమిషాలు చూసిన సీపీ ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో కారులోంచి దిగివచ్చారు. ఇదేం న్యూసెన్స్ అంటూ ఎస్సై చంద్రశేఖర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిని మందలించాడు. సంబరాలు ఉంటే మైదానంలో చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయొద్దని, రోడ్డుపై ఇలాంటి చర్యలు సరికాదని హెచ్చరించాడు. అనంతరం సీపీ స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. అయితే తల్వార్‌తో శ్రీనివాస్‌రెడ్డి హల్‌చల్ చేయడం, ప్రజారవాణాకు ఇబ్బంది కలిగించడం, ఏకంగా సీపీ వాహనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడానికి కారణమైనవారిపై స్థానిక పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధిస్తాం

- నగర మేయర్ సునీల్‌రావు


పోటీలను పరిశీలిస్తున్న మేయర్ తదితరులు

కరీంనగర్‌సిటీ: స్వచ్ఛ సర్వేక్షన్- 2023 పోటీల్లో కరీంనగర్ నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంకు వచ్చేలా ప్రజలంతా సహకరించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు పిలుపునిచ్చారు. నగరపాలక ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్వచ్ఛతా కాంపిటీషన్ పోటీలను కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి ప్రారంభించారు. 34 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు నగర పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వల్ల దుష్ప్రభావాలు, నివారణ చర్యలు, పచ్చదనం, హోం వర్మి కంపోస్ట్ తయారీ, తడి పొడి చెత్త సేకరణ, రీసైక్లింగ్ విధానం తదితర అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, డ్రాయింగ్, నాటక ప్రదర్శన పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విద్యార్థులు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన పెంచుకొని వారి తల్లిదండ్రులు, ఇతరులకు తెలిపేలా పోటీలు నిర్వహించామని వివరించారు. విద్యార్థులు మంచి వ్యాసరచనలు, డ్రాయింగ్‌లు వేయడంతో పాటు స్వచ్ఛతపై చక్కటి నాటక ప్రదర్శనలు ఇచ్చారని, వారిని ప్రోత్సహించేలా ప్రతీ విద్యార్థికి పాటిసిపేషన్ పత్రంతో పాటు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తామన్నారు. కరీంనగర్‌ను స్వచ్ఛ నగరంగా మార్చేందుకు ప్రజలంతా కృషి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షన్- 2023 పోటీల్లో మెరుగైన ర్యాంకు సాధించేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ లెనిన్, డిప్యూటీ కమిషనర్ త్రియంభకేశ్వర్, శానిటేషన్ సూపర్ వైజర్ రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

కల్యాణ వైభోగమే..

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం శ్రీలక్ష్మీ, మహాలక్ష్మీ సమేత శ్రీచెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణం చేసి శ్రీశ్రీశ్రీస్వామి బ్రహ్మానంద సరస్వతి శ్రీమఠం వారి చేతుల మీదుగా స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వేద పండితులు దుద్దిళ్ల మనోహరశర్మ అవధాని, అర్చకులు ఎలబాక రాజేశ్వరశర్మ, డింగరి ప్రవీణచార్యులు ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగుతో దృష్టిలోపాలు దూరం చేసుకోండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


శిబిరాన్ని ప్రారంభించి కళ్లద్దాలు అందజేస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌టౌన్: జిల్లాలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాల ద్వారా ప్రజలు వారి దృష్టి లోపాలను దూరం చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కంటి వెలుగు రెండో దశ కార్యక్రమంలో భాగంగా శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కలెక్టరేట్లోని అందరు ఉద్యోగస్తులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, దృష్టి లోపం ఉన్నట్లుగా గుర్తించిన వారికి వెంటనే శిబిరంలోనే రీడింగ్ కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. దృష్టిలోపం అధికంగా ఉన్నవారి కోసం ప్రిస్క్రైబ్డ్ కళ్లద్దాలను శిబిరం నుంచే ఆర్డర్ చేసి అందజేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


గన్నేరువరంలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని జంగపల్లి, గన్నేరువరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సందర్శించారు. ఈ సందర్భంగా మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే గన్నేరువరంలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి, రోజూ ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తగిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సబిత, ఎంపీడీవో స్వాతి, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న, ఎంపీవో నర్సింహారెడ్డి, సర్పంచ్ పుల్లెల లక్ష్మి, ఏపీఎం లావణ్య, ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్లు, డీటీ మహేష్, సూపర్‌వైజర్ ఇష్రాత్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న నరసింహ

కరీంనగర్: గత 20 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలందరినీ పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్ ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 36 రకాల సేవలను ఏఎన్‌ఎంల ద్వారా ఆన్‌లైన్ విధానంలో చేయించుకుంటుందని కానీ వారికి జీతాలు పెంచడం, సర్వీసుల క్రమబద్ధీకరణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కంటి వెలుగు ప్రోగ్రాంలో డీఈఓలను నియమించకుండా వారి స్థానంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పనులను ఏఎన్‌ఎంలతో చేయించడం అన్యాయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల సమ్మయ్య, అఫ్తాబ్ అహ్మద్‌ఖాన్, మధురిమ, పడాల మమత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ విజయవంతం చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, సీపీ

జమ్మికుంట(హుజూరాబాద్): హుజూరాబాద్ నియోజకవర్గానికి మంత్రి కేటీఆర్ రానున్న సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డీగ్రీ కళాశాల మైదానంలో సభ వేదిక ఏర్పాట్లను ఎమ్మెల్సీ, సీపీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 31న జమ్మికుంటలో జరిగే సభకు స్థానిక మున్సిపాలిటీ, 5 మండలాల నుంచి దాదాపు 50వేల మంది హాజరు కానున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ హనుమకొండ జిల్లా కమాలపూర్ నుంచి బైక్ ర్యాలీ ద్వారా జమ్మికుంటకు చేరుకొని సభలో మాట్లాడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని కోటి స్వప్న, జమ్మికుంట రూరల్ సీఐ సురేష్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని వైఎస్సార్‌టీపీ ధర్నా



ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): గృహ విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ (అడ్వాన్స్ కన్జమ్షన్ డిపాజిట్) చార్జీల పేరిట వసూలు చేస్తున్న అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఏసీడీ చార్జీలు ఎత్తేయాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ మాట్లాడారు. ఏసీడీ పేరిట ప్రభుత్వం బలవంతపు వసూళ్లు మానుకోవాలన్నారు. ప్రజలను దోచుకోవడమే పాలసీగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుండడం దురదృష్టకరమని విమర్శించారు. వెంటనే ఏసీడీ చార్జీలను రద్దు చేయకుంటే ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శివరాం, అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరాల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెన్నం రజితరెడ్డి, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు, ఎండీ సలీం, జావిద్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సంపత్, శ్రీనివాస్, దీనాదే శాయి, ఆంజనేయులు, శ్రీనివాస్, సుజాత, రోజారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి


కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ సంక్షేమ, యువజన, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.3 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. దీంతో విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల క్వార్టర్లు కట్టడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయి కానీ పేద వర్గాలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించడానికి నిధులు లేవా అని ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు పెంచిన సీఎం కేసీఆర్ విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మహేష్, అనిల్, శ్రీనివాస్, జీవన్, ప్రశాంత్, ప్రణిత్, అక్షయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రసన్నాంజనేయ ఆలయంలో శ్రీరామ హోమం



శ్రీరామ హోమంలో పాల్గొన్న మేయర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని హెలీప్యాడ్ గ్రౌండ్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామ హోమం నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మేయర్‌కు తీర్థ ప్రసాదాలు, వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్‌కు చెందిన మహిళలు పాల్గొన్నారు.

వారాల ఆనంద్‌కు సన్మానం



వారాల ఆనంద్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

కరీంనగర్‌కల్చరల్: కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారానికి ఎంపికైన రచయిత, సినీ విమర్శకుడు వారాల ఆనంద్‌ను మంగళవారం ఆల్ ఇండియా మున్నూరుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఇవి శ్రీనివాస్ సన్మానించారు. ఆనంద్ సాహిత్య, సినీరంగాలకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్, జర్నలిస్ట్ కె.సత్యనారాయణ, బద్దిపెల్లి వేంకటేశ్వర ఆలయం చైర్మన్ ఉప్పు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కండేయుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం ప్రతినిధులు దుబ్బ దామోదర్, మెరుగు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

సప్తగిరికాలనీ: బీసీ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెంట అజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీ గురుకులాలు, హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని, గురుకులాల్లో వృత్తి విద్య కోర్సులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగమూర్తి, సంపత్‌కుమార్, వేణు, అశ్విన్, రాజు, శ్రీనివాస్, చంద్రమౌళి, కోటేశ్వర్, ఓదెలు, మధు, కిషన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం నాగులమల్యాల, చింతకుంటకు చెందిన పలువురు నిరుపేదలు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులో చికిత్స పొందగా వారికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అందజేశారు.

'దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి'

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లో దోమల నియంత్రణకు మేయర్, మున్సిపల్ అధికారులు రెండు రోజుల్లో చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకుడు జోజిరెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెంటనే దోమల మందు కొట్టకపోతే పార్టీ పక్షాన అన్ని డివిజన్‌లలో ఫాగింగ్ మెషిన్లు ఏర్పాటు చేసి మందు కొట్టిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కరీంనగర్: బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడిగా ఎన్నికైన చల్ల హరిశంకర్‌ను మంగళవారం జిల్లా ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మద్దెల రాజేందర్, బండారి సంపత్, రాంగోపాల్, నరసింహ, నాగభూషణం, చంద్రశేఖర్, తిరుపతి, సాగర్, కాజా, కుమార్, సంపత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం.. డిజైన్ లోపం..!

- బయటపడుతున్న చెక్‌డ్యామ్‌ల లొసుగులు
- భారీ వర్షాలకు చేరిన ఇసుక మేటలు
- నీరు లేక నిరుపయోగంగా మారిన వైనం
- ఆందోళనలో అన్నదాతలు



మొగ్ధుంపూర్ చెక్‌డ్యామ్‌లో ఇసుకమేటలు



ఇరుకుల్ల చెక్‌డ్యామ్ వద్ద ఇసుక గతేడాది భారీ వర్షాలతో..

కరీంనగర్‌రూరల్: భారీ వర్షాలకు ఇరుకుల్ల వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ల లొసుగులు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. డిజైన్‌లో లోపాలు, నాణ్యతలేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పదికాలాల పాటు నిలవాల్సిన కాంక్రీట్ నిర్మాణాలు ఏడాదికే కొట్టుకుపోయాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యామ్‌ల్లో ఇసుకమేటలేర్పడ్డాయి. నీరు నిల్వ లేక నిరుపయోగంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.12.95 కోట్లతో చెక్‌డ్యామ్‌లు

ఇరుకుల్ల వాగు ప్రవాహాన్ని ఆపి నీటిని నిల్వ చేయాలనే ఉద్దేశంతో మూడేళ్ల క్రితం రూ.12.95 కోట్లతో గోపాల్‌పూర్, ఇరుకుల్ల, మొగ్ధుంపూర్ శివారుల్లో మూడు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. రెండేళ్ల క్రితం కాంట్రాక్టరు పనులను పూర్తి చేయక ముందే వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మొగ్ధుంపూర్, గోపాల్‌పూర్ చెక్‌డ్యామ్‌ల కట్టలకు గండి పడింది. మొగ్ధుంపూర్‌లో వరద ఉధృతికి అబార్ట్‌మెంట్‌వాల్ రెండు ముక్కలైంది. గోపాల్‌పూర్‌లో ఎడమవైపు గోడ కొట్టుకుపోగా వరద ప్రవాహంలో కట్టకు రెండుచోట్ల గండిపడింది. అయితే గతేడాది వేసవికాలంలో రెండు చెక్‌డ్యామ్‌లకు అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. మొగ్ధుంపూర్ చెక్‌డ్యామ్ డిజైన్‌ను పూర్తిగా మార్చివేసి నిర్మించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా తక్కువ ఎత్తులో గోడ నిర్మించారు. ఇరువైపులా కరకట్టల పరిమాణాన్ని సైతం తగ్గించారు.

గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహంతో మొగ్ధుంపూర్, ఇరుకుల్ల, గోపాల్‌పూర్ చెక్‌డ్యామ్ వద్ద నీళ్లు మత్తడి దూకాయి. వరద ఉధృతికి చెక్‌డ్యామ్‌ల్లో పెద్ద ఎత్తున ఇసుక వచ్చి చేరింది. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో చెక్‌డ్యామ్‌ల్లో ఇసుక నిల్వలు పేరుకుపోయాయి. ఇసుక మేటలతో చెక్‌డ్యామ్‌ల్లో నీరు నిలిచే అవకాశం లేక నిరుపయోగంగా మారడంతో సమీప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో చెక్‌డ్యామ్‌ల్లోని ఇసుక మేటలను తొలగించాలని మొగ్ధుంపూర్ సర్పంచ్ జక్కం నర్సయ్య అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు డిజైన్‌లోపం, కాంట్రాక్టర్ నాసిరకం పనులు, అధికారుల ఉదాసీన వైఖరితో నిరుపయోగంగా మారినట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లను మరమ్మతు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.


ఇసుకమేటల తొలగింపునకు చర్యలు

భారీ వర్షాలతో మొగ్ధుంపూర్, ఇరుకుల్ల చెక్‌డ్యామ్‌ల్లో ఇసుక మేటలేర్పడ్డాయి. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇసుక ఎంత లోతు నిల్వ ఉందో పరీక్షించి నివేదిక రూపొందిస్తాం. ఇసుక వేలం వేసేందుకు మైనింగ్ శాఖకు రిపోర్టు పంపిస్తాం. అనుమతి రాగానే ఇసుక నిల్వలను తొలగించే కార్యక్రమాన్ని చేపడుతాం.

– నవీన్‌కుమార్, ఏఈ, ఇరిగేషన్ శాఖ

చెట్లకొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాల భవనంపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగెలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. మంగళవారం 'సాక్షి'లో 'బడి భవనంపై ప్రమాదకరంగా విద్యుత్ తీగెలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి బొమ్మకల్ ట్రాన్స్‌కో ఏఈ తిరుపతి స్పందించారు. ఏఈ ఆదేశాల మేరకు లైన్‌మెన్ మారుతి, జేఎల్‌ఎంలు అమర్, శ్రీకాంత్‌లు విద్యుత్‌తీగెలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంపై ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. - కరీంనగర్‌రూరల్

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న వాణినికేతన్ విద్యార్థులు



ఐఎంఏ వైద్యుల కొవ్వొత్తుల ప్రదర్శన

కరీంనగర్: జాతీయ బాలికా దినోత్సవాన్ని కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాణీనికేతన్ బాలవిహార్ పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి తెలంగాణచౌక్ వరకు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణచౌక్‌లో నృత్యప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రేణుక మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో నినాదంతో ప్రభుత్వం ఆడపిల్లలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తోందని అన్నారు. పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ నీలకంఠం, ప్రిన్సిపాల్ ప్రశాంత్, హన్మంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో సంఘీభావం

కరీంనగర్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లో ఉమెన్ డాక్టర్ వింగ్ కరీంనగర్ బాధ్యులు కొవ్వొత్తులు వెలిగించి బాలికల దినోత్సవానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రాంకిరణ్, మహిళా వింగ్ బాధ్యురాలు డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ బాలికల రక్షణ సమాజం యొక్క బాధ్యత అన్నారు. ఐఎంఏ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉమెన్ వింగ్ ప్రతినిధులు శేష శైలజ, నీలిమ, హిమబిందు, ఎజిలారసి, జ్యోతి, హారిక, తాత్విక, రత్నమాల, మైత్రి, విద్య, గ్రీష్మ, పద్మప్రియ, నవీన, రాధిక, అలీమ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధన్గర్‌వాడి పాఠశాలలో..

కరీంనగర్‌క్రైం: మంకమ్మతోట ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కరాటే కోచ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, కరాటే అంతర్జాతీయ క్రీడాకారిణి జి.దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మ

బాలికలకు పౌష్టికాహారం పంపిణీ

విద్యానగర్(కరీంనగర్): చెల్డ్ అండ్ ఉమెన్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మురికివాడలో బాలికలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ సానాది వెంకటేశ్, వైస్ చైర్మన్ పోతుల రమేశ్, బాధ్యులు తుంగ బాబూరావు, మునిరాజ్, రాజేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన బండ్లపై లభ్యమయ్యే ఆహార పదార్థాలను తినడంతో కలిగే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ రఘురామన్ ఆర్థికసాయంతో బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్, సభ్యులు శ్రీధర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

రేకుర్తిలో..

కొత్తపల్లి: రేకుర్తిలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీ కోఆప్షన్ శుక్రుద్దీన్, విజిలెన్స్ అధికారులు శౌకత్, అక్రమం పాషాలు హాజరై విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ మోనిక సోనీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు స్పందన



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్‌సిటీ: కంటి సమస్యను దూరం చేసి అంధత్వాన్ని నివారించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగుకు విశేష స్పందన వస్తోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం 47వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కమిషనర్ సేవా ఇస్లావత్, ట్రెయినీ ఐఏఎస్ లెనిన్‌తో కలిసి సందర్శించారు. వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలు చేసుకున్న పలువురికి కళ్లజోడ్లు అందించారు. శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. మేయర్ వెంట కార్పొరేటర్ షరీఫొద్దీన్, నగరపాలక సంస్థ అధికారులున్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ట్రెసా లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సంక్షేమమే ట్రెసా లక్ష్యమని, తదనుగుణంగా చర్యలు చేపడుతోందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రెవెన్యూ గార్డెన్‌లో ట్రెసా జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అంతకుముందు సంఘం నేతృత్వంలో రెవెన్యూ శాఖలో పనిచేసే ఆఫీస్ సబార్డినేట్స్‌కు ఏకరూప దుస్తులను అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌లు పంపిణీ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్, గౌరవ అధ్యక్షుడు పడిగెల రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది విజయ్‌కుమార్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పంచముఖ హనుమాన్ బ్రహ్మోత్సవాలు



ప్రవచనం చేస్తున్న స్వామిజీ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని బొమ్మకల్ రోడ్‌లో గల పంచముఖ హనుమాన్‌లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పదో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఉదయం లక్ష తమలపాకులతో నాగవల్లి దళార్చన చేశారు. సద్గురు గీతా మందిరం విష్ణు సేవానందగిరి స్వామిజీ, దయానంద గిరి స్వామిజీ జగదీశ్వర్ ఆనందస్వామి ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బుస శ్రీనివాస్, సభ్యులు తోట రాజేందర్, జీఎస్ ఆనంద్, పిట్ల స్వామి, ఆదిముల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

1.4 కిలోల గంజాయి పట్టివేత



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం పక్కా సమాచారంతో దాడులు జరిపి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.4కిలోల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు హౌసింగ్ బోర్డు కాలనీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించగా ల్యాదవ్ నవకాంత్, అన్నాడి శివారెడ్డిలు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1.4 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్లు సృజన్‌రెడ్డి, రవికుమార్, ఎస్సైలు సాంబమూర్తి, నర్సింహారావు, రఘుపతిలతో పాటుగా సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సరఫరాదారులపై పీడీయాక్టు

కరీంనగర్‌క్రైం: గంజాయి సరఫరా చేస్తూ యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న ముగ్గురు గంజాయి సరఫరాదారులపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు పీడీ యాక్టు అమలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ గాంధీ రోడ్డుకు చెందిన అబ్దుల్ షహబాద్, మహ్మద్ ఫైసల్ షరీఫ్, మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన ధరావత్ వినయ్‌కుమార్‌లు మహారాష్ట్ర చంద్రాపూర్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కరీంనగర్‌లోని విద్యార్థులు, యువకులకు ఎక్కువ ధరలకు అమ్మి గంజాయి అలవాటు చేశారు. ఆగస్టు 9న కరీంనగర్‌లోని సిరిసిల్ల బైపాస్ రోడ్డులో కరీంనగర్ టూటౌన్ సీఐ లక్ష్మీబాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా అబ్దుల్ శహబాద్, షరీఫ్, వినయ్‌లు గంజాయితో పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపించారు. మంగళవారం కరీంనగర్ టూటౌన్ పోలీసులు వీరిపై పీడీయాక్టు అమలు చేసి వారికి ఉత్తర్వులు అందజేశారు.

పోషక పదార్థాలు తినిపించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రమణారెడ్డి

కరీంనగర్‌రూరల్: వయస్సుకు తగినట్లుగా బరువు, ఎత్తు లేని చిన్నారులకు పోషక విలువలతో కూడిన పదార్థాలు తినిపించాలని ఐసీడీఎస్ కరీంనగర్‌అర్బన్ సీడీపీవో బి.ఉమారాణి అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. అతితక్కువ పోషణ స్థాయిలుంటే తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలన్నారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషక పదార్థాల స్టాల్‌ను ఏర్పాటు చేసి గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వాహెద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని అరెపల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకొని వారిని కరీంనగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో సీఐలు సృజన్‌రెడ్డి, రవికుమార్, ఎస్‌ఐలు సాంబమూర్తి, నర్సింహారావు, రఘుపతిలు పాల్గొన్నారు.

రేపు 'భారత రాజ్యాంగ రచన'పై అవగాహన సదస్సు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో గురువారం సాయంత్రం 'భారతదేశ రాజ్యాంగ రచన -బీఆర్ అంబేడ్కర్ కృషి' అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి అంజయ్య, సీవీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు డాక్టర్ కరణం మురళీ, వక్తలుగా గాజోజు నాగభూషణం, వెంకటేశ్వర్‌రావు, కొడిముంజ శంకర్, కె.రామచంద్రం, రఘుశంకర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ ఉజ్వలపార్కు ఫీడర్ పరిధిలోని ఉజ్వల పార్కు, డీర్ పార్కు, ఎన్‌టీఆర్ విగ్రహం వెనుక ప్రాంతం, బైపాస్ రోడ్, ఆటోనగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా 33 కేవీ డబుల్ సర్క్యూట్ లైన్ పనులు జరుగుతున్నందున ఉ.10 నుంచి మ.3 గంటల వరకు 11 కేవీ.ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, ముద్దసాని గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నగునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ నగునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, చెలిమెడ ఆసుపత్రి పరిధిలోని కొంత ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కె.రాజు తెలిపారు.

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మల్కాపూర్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ రంజిత్

కొత్తపల్లి: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రంజిత్‌కుమార్ అన్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లోని వరి పొలాలను మంగళవారం పరిశీలించారు. ఇప్పటివరకు 80 శాతం వరినాట్లు పూర్తికాగా పలు రకాల తెగులతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో సల్ఫేడ్ గాయం, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించామన్నారు. సల్ఫైడ్ గాయానికి ప్రధానమైన కారణం వాతావరణం చల్లగా ఉండటం వల్లనే పొలంలోని వరి కొయ్యలు కుళ్లిపోకుండా ఉన్నాయన్నారు. అదేవిధంగా వేర్లు నల్లగా మారడం, చనిపోవడం, ఆకులు పసుపు రంగులోకి మారడం, పైరు ఎండిపోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి పైరును మొదలు గమనిస్తే కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుందని, అంతేకాకుండా రాత్రిపూట చలి ఎక్కువగా ఉండటంతో పైరు ఎదుగుదల నిలిచిపోతుందని తెలిపారు. ఈ సల్ఫైడ్ గాయం నియంత్రణకు పొలాన్ని చీమ పగుళ్లు వచ్చేవరకు వారం, పది రోజులు ఆరబెట్టడం ద్వారా ఆ పగుళ్ల నుంచి గ్యాస్ వెళ్లిపోతుందని, అనంతరం కొత్త నీటిని పెట్టుకొని పోషకాలను పిచికారీ చేయాలని సూచించారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



రాజేశ్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: బైక్ కొనివ్వలేదనే బాధతో ఓ యువకుడు క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకోవడం గ్రామంలో తీరని విషాదం నింపింది. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. రూరల్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన లింగంపల్లి రాజేశ(19) కొన్నిరోజుల నుంచి బైక్ కొనివ్వాలంటూ తల్లి లలితను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4గంటలకు అమ్మమ్మ దేవమ్మకు ఫోన్ చేసి వెంటనే తనకు బైక్ కొనివ్వాలని అమ్మను అడిగితే ఇవ్వడం లేదని బాధపడుతూ చెప్పాడు. నేను ఏదైనా చేసుకుంటానని రాజేశ్ చెప్పడంతో రెండు, మూడు నెలల తర్వాత నేనే కొనిస్తానని బుజ్జగించి చెప్పింది. అయితే తల్లితోపాటు అమ్మమ్మ తనకు బైక్ కొనడం లేదనే క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి చీరతో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేశ్ కోసం సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లిన స్నేహితులకు ఉరి పెట్టుకున్న రాజేశ్‌ను చూసి తల్లికి సమాచారం అందించారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుడి తల్లి లలిత చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తుండగా సోదరి సౌమ్య హైదరాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది.

విరాళాలతో అంత్యక్రియలు

నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు స్పందించి రాజేశ్ అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు. మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి మిత్రమండలి సభ్యులు రూ.10వేలు, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ రోహిత్‌రావు రూ.5వేలను మృతుడి తల్లి లలితకు అందించారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి రూ.3వేలు, ఎంపీటీసీ తిరుపతి రూ.6వేలు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి రూ.5వేల చొప్పున పలువురు యువకులు ప్రకటించిన విరాళాలు దాదాపు రూ. లక్ష వరకు జమయ్యాయి.

బాలకృష్ణకు కాపు నేతల అల్టిమేటం

- ఎస్వీఆర్, ఏఎన్ఆర్‌పై వ్యాఖ్యలు అభ్యంతరకరం
- బహిరంగ క్షమాపణకు డిమాండ్

సాక్షి, అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలపై కాపు నేతలు భగ్గుమన్నారు. సినీ దిగ్గజాలైన ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావులను ఉద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాలకృష్ణ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు కాపుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, ఈ నెల 25లోపు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని కాపునాడు డిమాండ్ చేసింది. క్షమాపణ చెప్పకుంటే బాలకృష్ణను టీడీపీ నుంచి బహిష్కరించాలని, లేకుంటే లోకేశ్ పాదయాత్రను అడ్డుకుంటామని అల్టిమేటం జారీ చేసింది.

జైలుకెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి అరెస్ట్ అయి చర్లపల్లి జైలులో ఉన్న బైరి నరేశ్‌కు అధికారులు ఇస్తున్న సౌకర్యాలు.. అతడిని వేరే సెల్‌లోకి మార్చడంపై సాధ్యాసాధ్యాలు.. ప్రస్తుతం అతడిని ఏకాంత గదిలో ఉంచారా.. వంటి వాటి వివరాలపై నివేదిక అందజేయాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నరేశ్‌ను గత నెలలో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.ఏకాంత గదిలో నిర్బంధించడంతో తన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం ఇప్పించాలని నరేశ్, అతని సతీమణి సుజాత హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. నరేశ్ విషయంలో చర్లపల్లి జైలు అధికారులు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. నరేశ్‌కు ప్రాణహాని ఉందని ఇంటెలిజెన్స్ నివేదిక ఇచ్చిందని, జైలులో అతడి రక్షణ కోసం అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు. ఇప్పటికే ఆరు ములాఖత్‌లకు అనుమతి ఇచ్చారని, ఇతరులను కలవనీయడం లేదనడంలో వాస్తవం లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జైలును సందర్శించి అక్కడ పిటిషనర్‌కు ఇస్తున్న వసతులపై నివేదిక ఇచ్చేందుకు జ్యుడీషియల్ అధికారిని నియమిస్తూ విచారణను వాయిదా వేశారు.

ఎందుకీ గగ్గోలు?

- ఇప్పుడు ఎవరి ఇల్లు తగలబడుతోంది?
- వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో మాకంతా తెలుసు
- ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ మిశ్రా ధర్మాసనం వ్యాఖ్యలు
- జీవో 1పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: సంక్రాంతి సెలవుల సందర్భంగా అత్యవసర కేసుల విచారణకు ఏర్పాటైన వెకేషన్ కోర్టులో తాను నిర్దేశించిన రోస్టర్‌కు భిన్నంగా జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని బెంచ్ వ్యవహరించడాన్ని తప్పుబట్టిన ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తమకు స్పష్టంగా తెలుసని, అయితే న్యాయ వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఆ విషయాలను బహిర్గతం చేయడం లేదని తెలిపింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్న సీజే ధర్మాసనం, ఇంత జరిగిన తరువాత కూడా తాము స్పందించకుంటే భవిష్యత్తులో వచ్చే ప్రధాన న్యాయమూర్తులు ఇలాగే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి నిర్దేశించిన రోస్టర్‌లో రెండు పేరాలు మార్చారని, తద్వారా ఒరిజినల్ రోస్టర్ మారిందని ధర్మాసనం తెలిపింది. అసలు జీవో 1 విషయంలో ఏదో జరిగిపోతోందని రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది. అంతగా స్పందించేందుకు ఎవరి ఇల్లు తగలబడుతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ విధానంపై ఎందుకింత గగ్గోలు పెడుతున్నారని నిలదీసింది. అది ఓ సాధారణ నిర్ణయమని వ్యాఖ్యానించింది. జీవో 1 విషయంలో ఇరుపక్షాల వాదనలు పూర్తైనందున తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. తుది విచారణ జరిపిన నేపథ్యంలో వారంలో తీర్పు వెలువరిస్తామని తెలిపింది.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా..?

అంతకుముందు సీపీఐ రామకృష్ణ తరఫు న్యాయవాది ఎన్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. జీవో 1పై విచారణ జరిపే అధికారం వెకేషన్ బెంచ్‌కు ఉందన్నారు. హైకోర్టు నోటిఫికేషన్ ప్రకారం అత్యవసర కేసులను విచారించే విచక్షణాధికారం సీనియర్ వెకేషన్ జడ్జికి ఉందని తెలిపారు. అందులో భాగంగానే వెకేషన్ బెంచ్ జీవో 1పై తమ వ్యాజ్యాన్ని విచారించిందన్నారు. ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఇలాంటి జీవో ఒక్కరోజు కూడా మనుగడలో ఉండటానికి వీల్లేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ.. జీవో ఎమ్మెస్ అయినా, జీవో ఆర్టీ అయినా ప్రభుత్వం తీసుకున్నది సాధారణ నిర్ణయమేనని, దీనిపై రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది.

పరిస్థితులను బట్టే నిర్ణయం..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ ర్యాలీలు, రోడ్‌షోలపై నిషేధించే ఉద్దేశం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదన్నారు. జీవో 1లో కూడా ఎక్కడా నిషేధం అన్న పదమే లేదన్నారు. సభలు, సమావేశాల కోసం సమర్పించే ప్రతి దరఖాస్తును అప్పటి పరిస్థితుల ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వాటిని నియంత్రించే అధికారం పోలీసులకు ఉందన్నారు. ప్రజల భద్రత ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజలు తిరిగే పరిస్థితి లేకుండా చేయడం వల్లే కందుకూరు ఘటన జరిగిందన్నారు. జీవో 1 వల్ల వ్యక్తులకు, రాజకీయ పార్టీలు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం పోలీసులకు మార్గనిర్దేశం చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. లోకేశ్ పాదయాత్రకు అనుమతినిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఓ రాజకీయ పార్టీ ప్రైవేట్ గ్రౌండ్‌లో సభ నిర్వహణకు అనుమతి కోరితే మంజూరు చేశామన్నారు. ప్రతీదీ పరిస్థితులను బట్టి ఉంటుందని తెలిపారు. వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ దశలో సిద్ధార్థ లూత్రా మధ్యంతర ఉత్తర్వుల సంగతి ప్రస్తావించగా.. తుది విచారణ చేపట్టామని, వారంలోపు తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఎవరితోనైనా పొత్తులకు సిద్ధం


వాహనం ముందు పూజలు చేస్తున్న పవన్

- జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: ప్రజాస్వామ్యంలో ఓట్లు చీలవద్దన్నదే తమ అభిమతమని ఇందుకోసం ఎవరితోనైనా పొత్తులకు సిద్ధమని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఎన్ని పార్టీలు ఉన్నా కొత్త నాయకత్వాన్ని స్వాగతిస్తామన్నారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. తన ప్రచార రథం వారాహి వాహనానికి అర్చకులతో పూజలు చేయించారు. 32 నృసింహ దివ్యక్షేత్రాల్లో ఒకటైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అనుష్టుప్ నృసింహ యాత్ర ప్రారంభించారు. అంతకుముందు కొడిమ్యాలలోని ఓ రిసార్ట్‌లో విలేకరుల సమావేశంలోనూ.. ఆ తర్వాత ముఖ్య కార్యకర్తల సమావేశంలో పవన్ మాట్లాడారు. తెలంగాణలో 7నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని వెల్లడించారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు.

పవన్ వాహనానికి పంక్చర్..

కార్యకర్తల సమావేశం అనంతరం ధర్మపురి బయలుదేరి వెళ్తున్న పవన్ కల్యాణ్ వాహనం టైర్ దొంగలమర్రి సమీపంలో పంక్చరైంది. అప్పటికే ట్రాఫిక్ నిలిచిపోవడం, అందులోనే అంబులెన్స్ ఆగిపోవడంతో పవన్ తన వాహనంలోంచి బయటకు వచ్చి అంబులెన్స్ సిబ్బందికి క్షమాపణ చెప్పారు. కాగా, గతంలో కొండగట్టు అంజన్న దర్శనం కోసం వచ్చిన పవన్ ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళం అందిస్తానని ఇచ్చిన హామీపై పెదవి విప్పలేదు.

పర్యటనలో అపశ్రుతి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్(ధర్మపురి): పవన్ కల్యాణ్ పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేటకు చెందిన కూస రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు జక్కుల అంజీతో కలిసి ద్విచక్రవాహనంపై పవన్ కల్యాణ్ కాన్వాయ్‌ను అనుసరిస్తూ ముందుకు సాగారు. కాన్వాయ్‌ను ఓవర్ టేక్ చేయాలని ముందుకు వెళ్తుండగా.. కిషన్‌రావుపేట స్టేజీ వద్ద ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై ఎదురుగా వస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్, నీలం సాగర్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టారు. దీంతో అదుపు తప్పిన బైక్ కరీంనగర్ వైపు నుంచి జన్నారం వెళ్తున్న కారును ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కూస రాజ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జక్కుల అంజితో పాటు , మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బొలిశెట్టి, సాగర్ కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు.


సభకు హాజరైన ప్రజలు

కార్పొరేట్ల కోసమే మోదీ పాలన


సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం సభలో కేటీఆర్ మాట్లాడుతూ దేశాన్ని ఏలిన 14 మంది ప్రధాన మంత్రుల పాలనలో రూ.56 లక్షల కోట్ల అప్పులు ఉంటే.. నరేంద్రమోదీ ఎనిమిదేళ్ల పాలనలో దేశం రూ.వంద లక్షల కోట్లు అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. దేశంలో పుట్టిన ప్రతి బిడ్డపై రూ.1.25 లక్షల అప్పు మోపుతున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. దమ్ముంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రాష్ట్ర బీజేపీ నేతలు జాతీయ హోదాను ఇప్పించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు కావస్తున్నా.. కృష్ణాజలాలపై ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ తెంపని అసమర్థత ప్రభుత్వం కేంద్రానిదేనని నిందించారు. ''మహబూబ్‌నగర్‌లో ఈ రోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందంట కదా... తెలంగాణకు 500 టీఎంసీల నీటిని ఇవ్వాలనీ, ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తూ పాలమూరు-రంగారెడ్డికి జాతీయహోదాను ఇప్పించాలని అక్కడి నుంచి కేంద్రానికి తీర్మానం చేసి పంపండి'' అని సలహా ఇచ్చారు. రాష్ట్ర బీజేపీ నేతలకు వెన్నెముక ఉంటే ఈ పనులు చేయాలని సవాల్ విసిరారు.

ఆదాయం కాదు.. కష్టాలు డబుల్ అయ్యాయి

'మోదీ పాలనలో రైతుల ఆదాయం డబుల్ అయిందని నిన్న ఓ పత్రికలో ప్రధాని ఆర్థిక సలహాదారు ఓ కథనం రాశారు. ఇది ఎంత దుర్మార్గం. ఎవరి ఆదాయాలూ డబుల్ కాలేదు. కష్టాలు, పెట్టుబడులు డబుల్ అయ్యాయి...'' అని కేటీఆర్ అన్నారు. ఒక్క తెలంగాణలో మన పాలనలో రైతులకు ఆరేళ్లలో రూ.65వేల కోట్లు రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని. రైతు బీమా దేశంలో ఎక్కడా లేదు..అని చెప్పారు. బేకార్‌గాళ్లతో మనకు పంచాయితీ ఎందుకనీ కులాల మతాల మధ్య చిచ్చులు పెడుతున్న చిల్లరగాళ్లు ఉన్నారని బీజేపీ నేతలపై మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని గెలిపించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అబ్రహం, కార్పొరేషన్ చైర్మన్లు సాయిచంద్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా సీనియర్ సిటిజన్లకో పార్కు

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సీనియర్ సిటిజన్ల కోసం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఓ పార్కు ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని 8వ వార్డు సత్యసాయికాలనీలో రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ పార్కును మంత్రి ప్రారంభించి అద్భుతమంటూ కితాబునిచ్చారు. ఈ పార్కును ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని అభినందించారు. పార్కులో ఉన్న ఓ చెట్టుకు విరగ కాసిన చింతకాయలను చూస్తూ భలే కాశాయని కేటీఆర్ ముచ్చట పడ్డారు. అంతలోనే చెట్టు చింతకాయను ఓ ప్రజాప్రతినిధి తీసుకువచ్చి ఇవ్వగా వాటిని తింటూ భలేగా ఉన్నాయంటూ అందరినీ ఊరించారు.



'వసంత' ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, యాగపూజలుచేస్తున్న దృశ్యం


గోమాతకు పూజలు చేస్తున్న ఆలయ ఈఓ

- అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా/ముధోల్: చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన నిర్మల్ జిల్లా బాసరలో వసంతపంచమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవస్థాన ప్రధానాచార్యులు, ముఖ్య అర్చకులు వైదిక బృందం ఆధ్వర్యంలో ఆలయ ఈవో విజయ రామారావు గోమాతకు పూజలు చేశారు. అనంతరం యాగశాలకు వెళ్లారు. హోమ పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సరస్వతీ అమ్మవారిని, మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు చేశారు. మహాంకాళి అమ్మవారి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. బుధ, గురువారాల్లో వేడుకలకు కొనసాగనున్నాయి. మొదటి రోజే భక్తుల రాక ప్రారంభమైంది. గురువారం అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు...

వసంతపంచమి సందర్భంగా బాసరలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాసర వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయానికి చేరుకున్నారు. పిల్లలతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. తర్వాత సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో పోలీసు బందోబస్తు పెంచారు. అన్ని ప్రాంతాల్లోనూ పోలీసు సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తున్నారు. బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, గోదావరి ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధ, గురువారాల్లో భక్తులు అధిక సంఖ్యలో బాసరకు వస్తారని ఈవో విజయరామారావు తెలిపారు.

తపాలా శాఖ బంపర్ ఆఫర్

- పలు పథకాలపై వడ్డీ రేట్లు భారీగా పెంపు
- జనవరి నుంచి మార్చి 31 వరకు వర్తింపు
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ నెల 28న స్పెషల్ క్యాంపెయిన్



కరీంనగర్ డివిజన్ తపాలా కార్యాలయం

బోయినపల్లి(చొప్పదండి): కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుడుతూ ప్రజలను ఆకర్శిస్తున్న తపాలా శాఖ వారికి మరింత చేరువయ్యేందుకు మరో బంపర్ ఆఫర్ ప్రకటించింది. పలు పథకాలకు సంబంధించిన వడ్డీ రేట్లను భారీగా పెంచింది. ఇవి జనవరి నుంచి మార్చి 31 వరకు వర్తిస్తాయని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు, వాణిజ్య సంస్థలకు దీటుగా పోస్టల్ శాఖ తన వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తోంది. నూతన సంవత్సరంలో పలు పథకాలపై వడ్డీ రేట్లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పోస్టల్ ఎస్పీ పేర్కొన్నారు.

మెచూరిటీ 120 నెలలకు కుదింపు..

గతంలో 6.70 వడ్డీ శాతం ఉన్న పోస్టల్ మంత్లీ ఇన్‌కం స్కీమ్‌ను 7.1 శాతానికి, 5.50 శాతం ఉన్న 1 సంవత్సరం పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ వడ్డీని 6.6 శాతం వరకు, 5.70 శాతం ఉన్న 2 సంవత్సరాల పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ వడ్డీని 6.8 శాతం , 5.80 శాతం ఉన్న 3 సంవత్సరాల పోస్టాఫీస్ టైం డిపాజిట్ వడ్డీని 6.9 శాతం, 6.70 శాతం వడ్డీ ఉన్న 5 సంవత్సరాల పోస్ట్ టైం డిపాజిట్ వడ్డీని 7.0 శాతం వరకు పెంచింది. పోస్టల్ కిసాన్ వికాస పత్ర మెచూరిటీ గతంలో 123 నెలలు ఉండగా 120 నెలలకు కుదించింది. 6.80 శాతం ఉన్న నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వడ్డీని 7.0 శాతానికి, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం వడ్డీ గతంలో 7.60 శాతం ఉండగా ప్రస్తుతం 8.0 శాతానికి పెంచింది.

గ్రామాల్లో పోస్టల్ మేళాలు..

తపాలా శాఖ పథకాలపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోస్టాఫీసుల్లో ఈ నెల 28న స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తున్నారు. పెంచిన వడ్డీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. గ్రామీణులు పోస్టల్ పథకాలను ఉపయోగించుకునేందుకు వీలుగా కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ గ్రామాల్లో పోస్టల్ మేళాలు నిర్వహిస్తూ తానే స్వయంగా వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తపాలా సేవలను విస్తరించేందుకు సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం పలు పోస్టల్ పథకాలపై వడ్డీ రేట్లను భారీగా పెంచింది. వీటిపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోస్టాఫీసుల్లో ఈ నెల 28న ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రజలు పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు దగ్గరలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలి. – వై.వెంకటేశ్వర్లు, పోస్టల్ సూపరింటెండెంట్, కరీంనగర్ డివిజన్

సాంకేతిక అభివృద్ధిలో గణితానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాంరెడ్డి

భైంసా: సాంకేతిక అభివృద్ధిలో గణితశాస్త్రం ప్రాధాన్యత ఎనలేనిదని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.రాంరెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎన్ఐటీ ప్రొఫెసర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గణిత నమూనాలు, క్రమబద్ధమైన విధానం స్థితిగతులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

- తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్ర చైర్మన్ శోభ
- కౌటాలలో మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ


చెక్కు అందజేస్తున్న టీజీబీ చైర్మన్ శోభ, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

కౌటాల(సిర్పూర్): రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ వై.శోభ అన్నారు. కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మంగళవారం కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రుణ వితరణ మహోత్సవం నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శోభ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంలో రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు లింకేజీ ద్వారా రూ.25 వేల కోట్ల రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు గొప్ప వ్యాపారులుగా ఎదగాలని సూచించారు. ప్రతిఒక్కరు బీమా పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సినిమా థియేటర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రుణాల పంపిణీలో కుమురంభీం జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో ఉందని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.25 కోట్ల రుణాల చెక్కు, రూ.20 లక్షల బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీబీ ఆర్ఎం మురళీ మనోహర్‌రావు, డీఆర్డీవో సురేందర్, ఎల్‌డీఎం హనుమంతరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కమల, టీజీబీ మేనేజర్ నరసింహస్వామి, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయండి

- 28లోగా పునరుద్ధరణ పనులు పూర్తవ్వాలి
- కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, హాజరైన అధికారులు

కరీంనగర్: 'మన ఊరు-మన బడి', 'మన ఊరు -మన బస్తీ' కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పునరుద్ధరణ పనులను ఈ నెల 28 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. ఆయా విద్యాలయాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ, మన ఊరు-మన బడి, మన ఊరు-మన బస్తీ పనులపై పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమ శాఖ, మున్సిపల్, విద్యా శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 30 సర్కారు బడులను అన్ని వసతులతో తీర్చిదిద్దాలని సూచించారు. ప్రారంభోత్సవాలకు ప్రభుత్వం నిర్ణయించే తేదీల కంటే ముందుగానే పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా వెనకబడిన తరగతుల అధికారి రాజమనోహర్‌రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నేతానియల్, పంచాయతీరాజ్ ఈఈలు, ఎంఈవోలు, ఏఈలు తదితరులున్నారు.

పండుగకు బొమ్మలను కొలువుదీర్చడం లేదామె.
బొమ్మల తయారీ 'కొలువు'ను పండగ చేస్తున్నారు.
బొమ్మలతో 'చక్కటి కొలువు'కు మార్గం వేస్తున్నారు.
మన బొమ్మల నుంచి మన చేనేతల వరకు...
సంప్రదాయ కళల పురోగతికి బాట వేస్తున్నారామె.

బొమ్మల కొలువు

చిత్రాసూద్









''కళకు రాజ పోషణ అవసరమే. కానీ కళ జీవించాల్సింది కేవలం దాతల దయాదాక్షిణ్యాల మీద మాత్రమే కాదు. కళ స్వయంసమృద్ధి సాధించాలి. అప్పుడే ఆ కళకు గుర్తింపు, కళాకారులకు గౌరవం లభిస్తాయి'' అన్నారు చిత్రా సూద్. ఆమె హైదరాబాద్‌లో కార్పొరేట్ రంగంలో ఉన్నతస్థాయిలో ఉద్యోగం చేస్తున్నారు. సమాజానికి చేయాలనుకున్న పనులను ఒక సుమహారంగా మలుచుకున్నారు. తన ప్రవృత్తిలో భాగంగా గొల్లభామ చీరలు, బొబ్బిలి నేత, ఇకత్ లక్షవత్తుల చీర వంటి తెలుగు వారి సిగ్నేచర్ వీవింగ్‌కు సహజ రంగులను మేళవిస్తున్నారు. కొండపల్లి బొమ్మల కళాకారులు వృత్తిని వదిలి ఇతర ఉపాధి మార్గాల వైపు మరలుతున్న పరిస్థితిని గమనించి ఆ కళను పరిరక్షించే పనిలో పడ్డారామె. ఆ వివరాలతోపాటు తాను ఈ మార్గాన్ని ఎంచుకోవడానికి ప్రభావితం చేసిన పరిస్థితులను సాక్షితో పంచుకున్నారు చిత్రాసూద్.

తమిళనాడు నుంచి తెలంగాణకు

''మా పూర్వికులది పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి. అమ్మవైపు విశాఖపట్నం. ఇరువైపుల కుటుంబాలూ తమిళనాడులో స్థిరపడ్డాయి. నాన్న కుటుంబం చెన్నైలో, అమ్మ వాళ్లు మధురైలో. అలా నేను పుట్టిన ప్రదేశం మధురై, పెరిగింది చెన్నై. నా చిన్నప్పుడే నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కి వచ్చేశాం. ఆ తర్వాత స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో స్థిరపడ్డారు. అలా నా చదువు సింగరేణిలో, పాల్వంచలో సాగింది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే... నేను నా బాల్యంలోనే నాగరక భారతాన్ని, గ్రామీణ భారతాన్ని దగ్గరగా చూడగలిగాను. అప్పట్లో తలెత్తిన అనేక సందేహాలే ఇప్పుడు నేను చేస్తున్న పనుల కారకాలు. గ్రామీణ మహిళలు, పిల్లల్లో చైతన్యం లేకపోవడం, చదువు లేకపోవడం, అవకాశాలు లేకపోవడం అప్పట్లో నాలో ఆలోచనను రేకెత్తించేవి, కానీ వాటిని ఎలా పరిష్కరించాలో తెలియదు. అలాగే నా తొలి ఉద్యోగంలో నేను చూసిన పరిస్థితులు కూడా ఆందోళనకరమైనవే. అది హైదరాబాద్ శివారులో ఉన్న కెమికల్ ఇండస్ట్రీ. ఆ జిలెటిన్ తయారీ పరిశ్రమలో ఏడెనిమిదేళ్ల పిల్లలు పని చేసేవాళ్లు. పొడులను జల్లెడ పట్టడం వంటి పనిని ఆటలా ఎంజాయ్ చేస్తూ ఉండేవాళ్లు. తామెంత విపత్కరమైన పని చేస్తున్నారనేది తెలియని అమాయకత్వం వారిది. నా చదువు నా ఉన్నతికి మాత్రమే పరిమితం కాకూడదు, ఇంకా ఏదైనా చేయాలని గట్టిగా అనిపించిన సందర్భం కూడా అదే. నాలో అస్పష్టంగా ఉన్న ఆలోచనలకు ఒక రూపాన్ని ఇవ్వడం పదేళ్ల కిందట మొదలైంది. చదువులో రాణిస్తూ ఉన్నత చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడంతో సమాజానికి మా వంతు చారిటీ మొదలు పెట్టాం. ఆ టాస్క్‌లో మా హస్బెండ్ అనిల్ సూద్ సహకరిస్తున్నారు. చేనేతల్లో నాచురల్ కలర్స్ వాడకం, కొండపల్లి బొమ్మల కళ పరిరక్షణలో 'అభిహార' సంస్థ నిర్వాహకురాలు చిత్ర అనుభవాన్ని కలుపుకుని ముందుకుపోతున్నాను.

ఈ సైన్స్ ఏ పుస్తకంలోనూ లేదు!

కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రానికి అనుబంధంగా సహజ రంగుల తయారీ పరిశ్రమను కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. సొరకాయ ఆకులతో చెక్కకు రంగు అద్దవచ్చని ఇంతవరకు ఏ పుస్తకమూ చెప్పలేదు. కొండపల్లి బొమ్మల కళాకారులకు మాత్రమే తెలిసిన సైన్స్ అది. ఇక చేనేతల్లో గొల్లభామ, బొబ్బిలి, ఇకత్ చీరల్లలోనూ నేచురల్ కలర్స్ ప్రయోగం మొదలైంది. ఈ రంగాల్లో ఉన్న జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడం కూడా మా తదుపరి ప్రాజెక్టుల్లో ఒకటి. భూమండలాన్ని ప్రమాదం అంచుల్లోకి నెట్టివేస్తున్న కారకాల్లో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కాలుష్యం ప్రధానమైనది. అందుకే మనవంతుగా కొన్ని అడుగులు వేయగలిగితే, మరికొందరి చేత వేయించగలిగితే... ఆ తర్వాత ఈ నేచర్ మూవ్‌మెంట్ దానంతట అదే ముందుకు సాగుతుంది.

- చిత్రాసూద్, యాక్టివిస్ట్,
రివైవల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్
కో - ఫౌండర్, అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ కాంప్లెక్స్ చాయిసెస్

కళలో సామాజిక మార్పు!

ఏ కళలనైనా దాతల సహకారంతో ఎంతకాలమని పరిరక్షించగలం? కళ తనకు తానుగా స్వయంసమృద్ధి సాధించాలి. అప్పుడే కళకు, కళాకారులకు గౌరవం. అందుకే మహిళలకు శిక్షణ ఇవ్వడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసి ఇవ్వడంతోపాటు మార్కెట్ సౌలభ్యత కోసం పని చేస్తున్నాను. కొండపల్లిలో ఉండే మహిళలను తీసుకువచ్చి హైదరాబాద్‌లోని సప్తపర్ణిలో ఎగ్జిబిషన్ పెట్టించడంలో నా ఉద్దేశాలు రెండు నెరవేరాయి. ఒకటి గ్రామీణ మహిళలకు తమ బొమ్మలకు ప్రపంచంలో ఉన్న ఆదరణ ఎలాంటిదో తెలియాలి, అలాగే కొనేవాళ్లు ఏం కోరుకుంటున్నారో అర్థం కావాలి. అలాగే ఒక అద్భుతమైన కళను సంపన్నుల లోగిళ్లను చేరగలిగితే ఆ కళకు రాజపోషణకు దారి వేసినట్లే. ఈ రెండూ సాధ్యమయ్యాయి. ఎప్పుడూ చేసే దశావతారాలు, ఎడ్లబండ్ల నుంచి కళాకారుల నైపుణ్యాన్ని టేబుల్ టాప్స్, మొబైల్ ఫోన్ స్టాండ్ వంటి రోజువారీ వాడుక వస్తువుల తయారీకి విస్తరించగలిగాం. అలాగే ఒక కళ ఆవిర్భవించినప్పుడు అప్పటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఒక రూపం సంతరించుకుని ఉంటుంది. ఆ రూపాలను కాలానుగుణంగా మార్చుకోవాలి. అందుకే కళను ధార్మికత పరిధి నుంచి సామాజిక పరిధికి విస్తరించాల్సిన అవసరాన్ని నేర్పిస్తున్నాం. ఈ బొమ్మలను లాంకో కంపెనీ, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ హస్తకళాకృతుల సంస్థలు లేపాక్షి, గోల్కొండలు పెద్ద ఆర్డర్లతో ప్రోత్సహిస్తున్నాయి. ఇక్కడ నేను నమ్మే సిద్ధాంతం ఏమిటంటే... కళను పరిరక్షించడం అనేది పెద్దమాట. కళ ద్వారా ఉపాధి పొందడం ప్రధానం. అప్పుడే కళ కలకాలం నిలుస్తుంది, కళాకారులు తమ ఉనికిని గర్వంగా చాటుకోగలుగుతారు. నా సర్వీస్‌తో ఎన్ని కుటుంబాలు, ఎన్ని కళారూపాలు స్వయంసమృద్ధి సాధించాయనేది నాకు మిగిలే సంతృప్తి'' అన్నారు చిత్రాసూద్.

వృత్తులకు, కళలకు ఇల్లే యూనివర్సిటీగా ఉండేది. పుస్తకం-కలం లేకుండానే విస్తృతమైన జ్ఞానం ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యేది. కాలం మారింది, ప్రపంచీకరణ మన సంప్రదాయ వృత్తులను కాలగర్భంలో కలిపేస్తున్న తరుణంలో మన కళల జ్ఞానాన్ని గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఉంది. దానికి శాస్త్రబద్ధత కల్పించాల్సిన అవసరం వచ్చింది.

- వాకా మంజులారెడ్డి

'మహిళ' శ్రమ చర్చకే రాదు!



మహిళ స్థితిగతులు మారాలంటే ఆర్థిక స్వావలంబన సాధించాలనేది జగమెరిగిన సత్యం. మన వ్యవస్థలన్నింటిలోనూ మహిళలను సహాయక పనులకే పరిమితం చేయడంతో వారి శ్రమ గుర్తింపునకు నోచుకోవడం లేదు. మహిళలకు కూడా ఆర్టిజన్ కార్డ్ ఇప్పించడానికి పని చేస్తున్నాను. అలాగే వేతనపెంపు విషయంలో మహిళల పని గురించి చర్చ కూడా ఉండడం లేదు. ఎంతగా శ్రమించినప్పటికీ మహిళకు గుర్తింపు ఉండదు, ఆదాయం తక్కువ. ఈ పరిస్థితిని మార్చడానికి 'అభిహార' అనే వేదిక ద్వారా పని చేస్తున్నాను. కొండపల్లి బొమ్మలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంచి సహకారం అందిస్తోంది. ఏపీ ప్రాథమిక పాఠశాలల్లో బోధన పరికరాలు కొండపల్లి కళాకృతులే. నేను హార్టికల్చర్ విద్యార్థిని కావడంతో నాకు తెలిసిన సైన్స్‌ని హస్తకళల రంగానికి మేళవిస్తున్నాను. హస్తకళల రంగంలో విశేషమైన కృషి చేస్తున్న ఉత్రమ్మ, సురయ్యా హసన్‌బోస్, జగదరాజప్పలు నాకు గురువులు. నా ఆకాంక్షలు, చిత్ర ఆలోచనలు ఒకే తీరుగా సాగడంతో మా ప్రయాణం విజయవంతంగా సాగుతోంది.

– సుధారాణి ముళ్లపూడి,
సీఈవో, అభిహార సోషల్ ఎంటర్‌ప్రైజ్

మహిళా శక్తి

ఒకేసారి ఇద్దరు డీజీపీలు





గురుప్రీత్ కౌర్ డియో, శశిప్రభ ద్వివేది

ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహిళా శక్తి గురించి తెలిసినప్పుడు ఒక కొత్త ఊపిరి వచ్చినట్టు అనిపిస్తుంది. ఇప్పుడా ఊపిరిని, ఉత్సాహాన్నీ రెట్టింపు చేస్తూ పంజాబ్‌లో ఒకేసారి ఇద్దరు మహిళలు డీజీపీలుగా పదోన్నతులు పొందారు. మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచారు.

పంజాబ్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) స్థాయికి పదోన్నతి పొందిన ఏడుగురు పోలీసు అధికారుల పేర్లను హోం వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఆ ఏడుగురు అధికారుల్లో ఇద్దరు మహిళా ఐపీఎస్‌లు గౌరవప్రదమైన పాత్రను కైవసం చేసుకున్నారు. శశిప్రభ ద్వివేది, గురుప్రీత్ కౌర్ ఇద్దరు మహిళలు ఇలా ఒకేసారి డీజీపీలుగా పదోన్నతులు పొందడం ఇదే మొదటిసారి. ఈ పదోన్నతులు ఇప్పుడు పంజాబ్ పోలీసు ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న అధికారుల సంఖ్యకు సంబంధించి అత్యంత శక్తిమంతమైన శక్తులలో ఒకటిగా మారడానికి మార్గం సుగమం చేశాయి.

గురుప్రీత్ కౌర్ డియో

1993 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అదే సంవత్సరం అధికారిగా నియమితులయ్యారు. గురుప్రీత్ ఇటీవల పదోన్నతి పొందిన బ్యాచ్‌లో అత్యంత సీనియర్ అధికారి. పంజాబ్ పోలీస్‌లో భాగమైన మొదటి మహిళా ఐపీఎస్ అధికారి. గతంలో మహిళా వ్యవహారాలను కవర్ చేసే బాధ్యతలు, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాను కలిగి ఉన్న కమ్యూనిటీ వ్యవహారాల విభాగానికి బాధ్యత వహించారు. చీఫ్ ఆఫ్ డ్రగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (క్రైమ్)గా, బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అడిషనల్ డీజీపీగా పనిచేశారు. తన పదోన్నతిపై ఆమె స్పందిస్తూ 'డీజీపీగా పనిచేసే అవకాశం లభించినందుకు ఆనందం'గా ఉందన్నారు.

శశిప్రభ ద్వివేది

అడిషనల్ ఛార్జ్ ఆఫ్ మోడర్నైజేషన్ (రైల్వేస్) అడిషనల్ డిజిపిగా పదోన్నతి పొందిన ద్వివేది 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. 1994లో ఆమె విధుల్లో చేరారు. 2021లో పంజాబ్ లోక్‌పాల్ ఏడీజీపీగా నియమితులయ్యారు. ఆగస్టు 2022లో ద్వివేది గౌరవ వందనం స్వీకరించి, పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్‌ను పరిశీలించారు. ఏడీజీపీగా ఆమె ఇండియన్ రిజర్వ్ బెటాలియన్‌కు అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా జవాన్లందరిపై ప్రశంసల వర్షం కురిపిస్తూ, 'నిజాయితీగా, నిర్భయంగా విధులు నిర్వర్తించాలని, చట్టాన్ని గౌరవించాల'ని ఆమె సూచించారు. పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని ఎత్తిచూపుతూ, దశాబ్దాలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న డ్రగ్స్ రాకెట్‌ను అంతమొందించేందుకు తగిన కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా చెప్పారు.

యూత్ పల్స్

బుల్లెట్ జర్నల్‌కు నువ్వొస్తవా నువ్వొస్తవా!



మొన్నటి 'హ్యాండ్ రైటింగ్ డే' సందర్భంగా చేతిరాత గత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ చాలామంది వాపోయారు. 'మా రోజుల్లో' అంటూ గతంలోకి కూడా వెళ్లిపోయారు. 'ఈ తరానికి కీబోర్డ్‌ల టిక్‌టక్‌లు తప్ప, అందమైన చేతిరాతతో అట్టే సంబంధం లేదా?' అని అడిగితే 'లేదు' అని చెప్పడానికి సోషల్ మీడియా ట్రెండ్ 'బుల్లెట్ జర్నల్' అడ్డొస్తుంది. బిజో కల్చర్‌లో భాగంగా యూత్ పెన్, కాగితానికి దగ్గరైంది. ఆర్ట్ థెరపీగా పేరున్న 'బుల్లెట్ జర్నల్'లోని మజాను రుచి చూస్తోంది...

బుల్లెట్ జర్నల్ లేదా బుజో అనేది షెడ్యూలింగ్, రిమైండర్స్, టు-డూ లిస్ట్... మొదలైన వాటికి ఉపకరించే పర్సనల్ ఆర్గనైజేషన్ మెథడ్. రోజు, వారం, నెల, సంవత్సరం... ఇలా షెడ్యూల్ చేసుకోవచ్చు. ఒకప్పుడు పెన్ లేదా పెన్సిల్ మాత్రమే ఉపయోగించి రాసేవారు. ఆ తరువాత క్రియేటివిటీలో భాగంగా రూలర్, కలర్ పెన్స్, స్టిక్కర్స్, స్టెన్సిల్స్, వాషి టేప్... మొదలైన వాటిని ఉపయోగిస్తున్నారు.

ఇండెక్స్ (విషయసూచిక), ర్యాపిడ్ ల్యాగింగ్ (సింబల్స్ ఉపయోగించడం), లాగ్స్ (టు-డూ లిస్ట్), కలెక్షన్స్ (కంటెంట్ ఇన్‌ఫర్మేషన్), మైగ్రేషన్ (న్యూ లిస్ట్) అనే కీలకమైన టూల్స్ దీనిలో ఉంటాయి.

షెడ్యూలింగ్, టు-డూ లిస్ట్‌కు మాత్రమే పరిమితమై ఉంటే బుల్లెట్ జర్నల్‌కు అంతగా ప్రాధాన్యత ఉండేది కాదు.

ఒకవిధంగా చెప్పాలంటే మన మనసులోని భావాలు, బాధలు, సంతోషాలు, సంక్షోభాలను అక్షరాల రూపం లో కాగితంపై పెట్టడం. అలా అని ఇదేమీ డైరీ కాదు. పొడవాటి వాక్యాలేవీ ఉండవు. ఉదాహరణకు మై గోల్స్. డైరీలో అయితే పెద్ద పెద్ద వాక్యాలు రాసుకుంటారు. అయితే బుల్లెట్ జర్నల్ పేజీలో మాత్రం 'మై గోల్స్' అని పెద్ద అక్షరాలతో కలర్ పెన్సిల్స్ లేదా స్కెచ్‌లతో రాస్తారు. 'మార్నింగ్ రొటీన్ ఫర్ ఎవ్రీ డే' అని పెద్ద అక్షరాలతో డిజైన్ చేసి బాక్స్‌లు, వృత్తాలలో దీనికి సంబంధించిన పాయింట్స్ రాస్తారు. కొందరు బొమ్మలు గీస్తారు. ఉదయాన్నే లేవాలి అనేదానికి సింబల్‌గా అలారమ్ బొమ్మ గీస్తారు. బొమ్మలు గీయలేని వారు స్టిక్కర్స్ అంటిస్తారు.

'ఇలా మాత్రమే' అనే రూల్ లేదు. ఒక్కొక్కరి సృజనాత్మకత ప్రకారం అది కొత్త రూపాల్లో కనిపిస్తుంది.

'మీడియం ఫర్ మెడిటేషన్'గా కూడా పేరు తెచ్చుకుంది బుల్లెట్ జర్నల్.

మనసు బాగోలేకపోతే, మానసిక ప్రశాంతత కోసం దీన్ని ఆశ్రయిస్తుంటారు.

కొందరి విషయంలో ఇది ట్రబుల్ షూటర్. ఒక సమస్యకు సంబంధించిన పరిష్కార మార్గాలు ఆలోచించే క్రమంలో బుల్లెట్ జర్నల్‌ను వాడుకొని వృత్తాలు, బాక్స్‌లు, బొమ్మల రూపంలో ఐడియాలు రాసుకోవడం. న్యూయార్క్‌కు చెందిన రైడర్ కరోల్ డెవలప్ చేసిన మెథడ్ ఇది. కరోల్‌కు ఏకాగ్రత లోపానికి సంబంధించిన సమస్యలు ఉండేవి. దీంతో చదువు దెబ్బతినేది. ఈ నేపథ్యంలో 'బుల్లెట్ జర్నల్' మెథడ్‌కు రూపకల్పన చేసి మంచి ఫలితాలు సాధించాడు కరోల్. తన అనుభవాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే అనూహ్యమైన స్పందన లభించింది. ఆ తరువాత క్లిక్‌స్టార్టర్ (గ్లోబల్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్) ఫండింగ్‌తో 'బుల్లెట్ జర్నల్'కు సంబంధించిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టాడు కరోల్.

గతాన్ని ట్రాక్ చేసి, వర్తమానాన్ని ఆర్గనైజ్ చేసి, భవిష్యత్‌ను ప్లాన్ చేసే మెథడ్‌గా పేరున్న 'బుల్లెట్ జర్నలింగ్' కోసం రకరకాల డిజిటల్ యాప్స్ కూడా వచ్చాయి.

'ది బుల్లెట్ మెథడ్' పేరుతో పుస్తకం రాస్తే మంచి ఆదరణ పొందింది.

'మొదట్లో గందరగోళంగా అనిపించేది. ఆ తరువాత మాత్రం దీనికి బాగా అలవాటు పడిపోయాను. బుజో కల్చర్ ప్రపంచవ్యాప్తంగా ఎందుకు ఆదరణ పొందిందో తెలిసి వచ్చింది' అంటుంది దిల్లీకి చెందిన అంజలి.

లాక్‌డౌన్ టైమ్‌లో మన యూత్‌కు బాగా దగ్గరైన యాక్టివిటీ ఇది.

'చదువు, హాబీ, వ్యాయామం, భవిషత్ లక్ష్యం... ఇలా స్టూడెంట్ జీవితంలో రకరకాల విభాగాలు ఉంటాయి. అయితే రోజువారీ హడావిడిలో కొన్ని నిర్లక్ష్యానికి గురవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణాత్మకమైన సమన్వయానికి బుజో కల్చర్ ఉపయోగపడుతుంది' అంటుంది పుణెకు చెందిన 22 సంవత్సరాల ప్రియరాగ.

'ఆర్గనైజేషన్, టైమ్ మేనేజ్‌మెంట్‌కు మాత్రమే కాదు మూడ్, ఫీలింగ్స్, ఎనర్జీ లెవెల్స్ మానిటర్‌లా కూడా ఉపయోగపడుతుంది' అంటుంది ప్రియరాగ స్నేహితురాలు హనీ.

గతాన్ని ట్రాక్ చేసి, వర్తమానాన్ని ఆర్గనైజ్ చేసి, భవిష్యత్‌ను ప్లాన్ చేసే మెథడ్‌గా పేరున్న 'బుల్లెట్ జర్నలింగ్' కోసం రకరకాల డిజిటల్ యాప్స్ కూడా వచ్చాయి. బుజో కల్చర్‌కు ఆన్‌లైన్ కమ్యూనిటీ డిఫరెంట్ స్టైల్స్‌ను జత చేసినప్పటికీ 'పెన్ను, పేపర్ వాడితే ఆ మజాయే వేరబ్బా' అనే వాళ్లే ఎక్కువ!

ఇది 'వేగన్'న్యువరీ!



సమాజంలో చాలామందిలో మాంసాహారపు అలవాట్లు ఉన్నప్పటికీ... శాకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్న భావన ఎప్పట్నుంచో ఉన్నదే. శాకాహార అలవాటు తాలూకు విప్లవంగా రూపొందిందే ఈ 'వేగన్యువరీ'. జనవరి (జాన్యువరీ) లాగే 'వేగన్'న్యువరీ అనే ఓ దీక్ష తీసుకుని నెల్లాళ్ల పాటు శాకాహారపు అలవాటు పెంపొందించుకుని, అది మంచి ఫలితాలనే ఇస్తే దాన్నే కొనసాగించాలని కోరుతూ నడుస్తున్న ఉద్యమమే ఈ 'వేగన్'న్యువరీ. దీని గురించి కొన్ని వివరాలు....

దాదాపు 2014 నుంచి ఈ వేగన్ ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో మాత్రం ఇది అధికారికంగా 2021 డిసెంబరు 9న ప్రారంభమైంది. 'వేగన్'న్యువరీ అనే పేరుతో తొలుత భూతదయా, అటు తర్వాత మొక్కలనుంచే శాకాహారం తీసుకుంటూ మంచి ఆరోగ్యం పెంపొందించుకోవడం, జీవావరణాన్నీ, జీవవైవిధ్యాన్నీ కాపాడుకోవడం కోసం కృషి చేయడం వంటి కార్యకలాపాలతో ప్రపంచవ్యాప్తంగా ఈ 'వేగన్'న్యువరీ ఉద్యమానికి మంచి ఆదరణే వస్తోంది. జనవరి మాసమంతా శాకాహారానికి మళ్లుతామంటూ ప్రతినబూనడమే ఈ 'వేగన్'న్యువరీ మాసపు ప్రత్యేకత అన్నమాట.

పెద్ద సంఖ్యలో చేరువవుతున్న ప్రజలు

గతేడాది అంటే 2022లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6,20,000 మందికి పైగా ప్రజలు ఈ ఉద్యమానికి మద్దతిచ్చారు. కేవలం మాంసాహారంలోనే మంచి రుచులు అందుతాయనే వాదనను తోసిరాజంటూ... ఈ ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకెళ్లడం కోసం శాకాహారాల్లో కొత్త కొత్త రుచులు అన్వేషిస్తున్నారు. దీనికి తార్కాణమే గతేడాది కొత్తగా అందుబాటులోకి వచ్చిన శాకాహార ఉత్పాదనలు! ఒక అంచనా ప్రకారం 2022లో దాదాపు 1,540 కొత్త శాకాహార ఉత్పాదనలు (వేగన్ ప్రాడక్ట్స్) అందుబాటులోకి వచ్చాయి. 'వేగన్'న్యువరీ ఉద్యమానికి అత్యద్భుతంగా ప్రచారాలను కల్పించే ఆ శాకాహార ప్రాధాన్యానికి గతేడాది ప్రపంచవ్యాప్తంగా 4,351 మీడియా కథనాలు వెలువడ్డాయనేది మరో అంచనా. దీనికితోడు ఎన్నో కార్పొరేట్ సంస్థలు సైతం అనేక ప్రచార కార్యకలాపాల ద్వారా ఈ ఉద్యమానికి తోడు నిలుస్తున్నాయి.

మన దేశానిది మూడోస్థానం...

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6.3 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం తీసుకుంటే అందులో 65,000 మంది మన భారతీయులే. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడీ ప్రచార కార్యకలాపాల్లో 228 దేశాలు పాలుపంచుకుంటుండగా... వీటన్నింటిలో మన దేశం మూడో స్థానంలో ఉండటం కూడా ఓ విశేషం. మనకంటే ముందు స్థానంలో ఉన్న దేశాల్లో మొదటిది యునైటెడ్ కింగ్‌డమ్ (ఇంగ్లాండ్) కాగా... రెండోది యూఎస్‌ఏ.

వీళ్లే మన దేశపు బ్రాండ్ అంబాసడర్లు...

ఈ ఉద్యమపు పదో వార్షికోత్సవం సందర్భంగా మనదేశం నుంచి దాదాపు పదిమంది ప్రముఖులు ఈ క్యాంపైన్‌లో విస్తృతంగా పాలుపంచుకుంటున్నారు. వీరిలో ప్రముఖ నటి, బిగ్ బాస్ ఫేమ్ సౌందర్యశర్మ, మరో ప్రముఖ నటుడు, ప్రో-బాస్కెట్‌బాల్ ఆటగాడు అరవింద్‌కృష్ణ, మ్యూజీషియన్, నటి మోనికా డోగ్రా, ప్రముఖ మౌంటెనీరింగ్ నిపుణురాలు ప్రకృతి వర్షిణీ, మరో మౌంటనీరింగ్ నిపుణుడు కుంతల్ జోయిషర్, ప్రో-టెన్నిస్ ఆటగాడు విశ్వజిత్ సాంగ్లే, గాయని అనుష్కా మన్‌చందా, మరో ప్రముఖ నటీమణులు స్నేహా ఉల్లాల్, సదా సయీద్ మన దేశం నుంచి ఈ ఉద్యమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రచారకులుగా వ్యవహరిస్తున్నారు. మరో వారంలో జనవరి అయిపోతోంది. కనీసం ఆఖరి వారంలో నైనా వేగన్యువరీని అనుసరిద్దాం.



'వేగనిజం' అనేది ఓ సంస్కృతి. ఈ సంస్కృతితో మనం తోటి జీవులకు ఎలాంటి హానీ కలగకుండా చూడవచ్చు. అందుకే నేను శాకాహార ఉద్యమాన్ని సమర్థిస్తుంటాను. అంతేకాదు... శాకాహారం తీసుకోవడం వల్ల మన చర్మానికి మంచి నిగారింపు రావడంతో పాటు మన ఆరోగ్యమూ బాగుంటుంది. ఏ జీవికీ హాని లేకుండా మనమూ బతికి, ఇతరులనూ బతకనివ్వడం అనే భావనే ఎంతో ఉన్నతమైనదని నా ఉద్దేశం.

- స్నేహా ఉల్లాల్,
సినీ నటి

- సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





సాయిప్రణీత్‌కు నిరాశ

ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ పురుషుల సింగిల్స్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. ప్రపంచ 53వ ర్యాంకర్ సాయిప్రణీత్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో 18-21, 19-21తో టీమ్ జూన్ వె (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-రోహన్ (భారత్), పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు (భారత్) మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు.



మెరిసిన స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్

ముక్కోణపు మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భారత్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ఈస్ట్ లండన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 56 పరుగులతో నెగ్గింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 167 పరుగులు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (51 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 56 నాటౌట్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసి ఓడిపోయింది.



అదరగొట్టి అగ్రస్థానానికి

న్యూజిలాండ్‌పై భారత్ క్లీన్‌స్వీప్

- 3-0తో సిరీస్ కైవసం
- 'టాప్' ర్యాంక్‌లోకి టీమిండియా
- 'శత'క్కొట్టిన గిల్, రోహిత్ శర్మ
- చివరి వన్డేలో 90 పరుగులతో గెలుపు

ఇండోర్: మళ్లీ భారత బ్యాట్లు గర్జించాయి. న్యూజిలాండ్ బంతులు డీలా పడ్డాయి. దీంతో పరుగుల తుఫాన్‌లో కివీస్ క్లీన్‌స్వీప్ అయ్యింది. ఫలితంగా మంగళవారం న్యూజిలాండ్‌తో జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ 90 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 3-0తో దక్కించుకుంది. అంతేకాకుండా వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న ఇంగ్లండ్‌ను వెనక్కి నెట్టి రోహిత్ శర్మ బృందం మూడో స్థానం నుంచి మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకింది. మొదట భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 385 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (85 బంతుల్లో 101; 9 ఫోర్లు, 6 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (78 బంతుల్లో 112; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. తర్వాత న్యూజిలాండ్ 41.2 ఓవర్లలో 295 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ కాన్వే (100 బంతుల్లో 138; 12 ఫోర్లు, 8 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు శార్దుల్‌కు దక్కగా... శుబ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం అందుకున్నాడు.


కాన్వే

ఓపెనర్ల ధనాధన్

ఫామ్‌లో ఉన్న భారత ఓపెనర్లు రోహిత్, గిల్ కష్టమైన బంతిని, ఓవర్‌ను గౌరవిస్తూ... అదుపు తప్పిన బంతులకు బౌండరీనే శిక్షగా విధించారు. డఫీ ఐదో ఓవర్లో గిల్, రోహిత్ చెరో సిక్సర్ బాదారు. ఫెర్గూసన్ 8వ ఓవర్‌ను గిల్ 4, 0, 4, 4, 6, 4లతో చితగ్గొట్టాడు. ఏకంగా 22 పరుగుల్ని పిండుకున్నాడు. డఫీ పదో ఓవర్లో రోహిత్ ఒక బౌండరీ రెండు సిక్స్‌లు బాదాడు. ఓపెనర్ల ధాటికి భారత్ స్కోరు 12.4 ఓవర్లలో వంద దాటింది. గిల్ 33 బంతుల్లో (8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోహిత్ 41 బంతుల్లో (4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. కానీ కివీస్ బౌలర్లే జోడీని విడగొట్టలేకపోయారు. ఓవర్‌కు 8 పైచిలుకు పరుగుల రన్‌రేట్‌తో భారత్ 24.1 ఓవర్లోనే 200 పరుగుల మైలురాయి చేరుకుంది. ఆ వెంటనే రోహిత్ 83 బంతుల్లో, గిల్ 72 బంతుల్లో శతకాలు పూర్తిచేసుకున్నారు. రోహిత్‌ను బౌల్డ్ చేసి బ్రేస్‌వెల్ 212 పరుగుల ఓపెనింగ్ వికెట్‌కు తెరదించాడు. కాసేపటికే గిల్ జోరుకు టిక్నర్ చెక్ పెట్టాడు. తర్వాత కోహ్లి (36; 3 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ (17; 1 ఫోర్, 1 సిక్స్), సూర్య (14; 2 సిక్సర్లు) విఫలమయ్యారు. పాండ్యా (38 బంతుల్లో 54; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), శార్దుల్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) అండతో చెలరేగాడు.

కాన్వే సెంచరీ వృథా

న్యూజిలాండ్ ఖాతా తెరువక ముందే అలెన్ (0)ను పాండ్యా డకౌట్ చేశాడు. మరో ఓపెనర్ కాన్వే ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. నికోల్స్ (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండతో సిక్సర్లతో మెరిపించాడు. నికోల్స్ ఆటను కుల్దీప్ ముగించగా.. ఆ తర్వాత మిచెల్ (24; 2 ఫోర్లు), లాథమ్ (0), ఫిలిప్స్ (5)లు శార్దుల్ పేస్‌కు తలవంచారు. కాన్వే 71 బంతుల్లో సెంచరీ సాధించాడు. అతన్ని ఉమ్రాన్ అవుట్ చేశాడు. బ్రేస్‌వెల్ (26; 3 ఫోర్లు, 1 సిక్స్), సాన్‌ట్నర్ (34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు క్రీజులో నిలిచారు.

30 వన్డేల్లో రోహిత్ శర్మ సెంచరీలు. అత్యధిక శతకాలు చేసిన క్రికెటర్ల జాబితాలో పాంటింగ్‌తో కలిసి రోహిత్ సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు. సచిన్ (49), కోహ్లి (46) టాప్-2లో ఉన్నారు.

360 న్యూజిలాండ్‌తో సిరీస్‌లో గిల్ చేసిన రన్స్. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా బాబర్ ఆజమ్ (పాక్; 2016లో విండీస్‌పై) పేరిట ఉన్న రికార్డును గిల్ సమం చేశాడు.

19 న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో భారత బ్యాటర్ల సిక్స్‌ల సంఖ్య. 2013లో ఆస్ట్రేలియాపై కూడా భారత్ 19 సిక్స్‌లు కొట్టింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) బ్రేస్‌వెల్ 101; గిల్ (సి) కాన్వే (బి) టిక్నర్ 112; కోహ్లి (సి) అలెన్ (బి) డఫీ 36; ఇషాన్ (రనౌట్) 17; సూర్యకుమార్ (సి) కాన్వే (బి) డఫీ 14; పాండ్యా (సి) కాన్వే (బి) డఫీ 54; సుందర్ (సి) మిచెల్ (బి) టిక్నర్ 9; శార్దుల్ (సి) లాథమ్ (బి) టిక్నర్ 25; కుల్దీప్ (రనౌట్) 3; ఉమ్రాన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 385. **వికెట్ల పతనం:** 1-212, 2-230, 3-268, 4-284, 5-293, 6-313, 7-367, 8-379, 9-385. **బౌలింగ్:** డఫీ 10-0-100-3, ఫెర్గూసన్ 10-1-53-0, టిక్నర్ 10-0-76-3, సాన్‌ట్నర్ 10-0-58-0, మిచెల్ 4-0-41-0, బ్రేస్‌వెల్ 6-0-51-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (బి) పాండ్యా 0; కాన్వే (సి) రోహిత్ (బి) ఉమ్రాన్ 138; నికోల్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 42; మిచెల్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 24; లాథమ్ (సి) పాండ్యా (బి) శార్దుల్ 0; ఫిలిప్స్ (సి) కోహ్లి (బి) శార్దుల్ 5; బ్రేస్‌వెల్ (స్టంప్డ్) ఇషాన్ (బి) కుల్దీప్ 26; సాన్‌ట్నర్ (సి) కోహ్లి (బి) చహల్ 34; ఫెర్గూసన్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 7; డఫీ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 0; టిక్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం** (41.2 ఓవర్లలో ఆలౌట్) 295. **వికెట్ల పతనం:** 1-0, 2-106, 3-184, 4-184, 5-200, 6-230, 7-269, 8-279, 9-280, 10-295. **బౌలింగ్:** పాండ్యా 6-0-37-1, సుందర్ 6-0-49-0, శార్దుల్ 6-0-45-3, ఉమ్రాన్ 7-0-52-1, కుల్దీప్ 9-0-62-3, చహల్ 7.2-0-43-2.

పదేళ్ల తర్వాత మళ్లీ సెమీస్‌లోకి

ఆకట్టుకున్న అజరెంకా • మూడో సీడ్ పెగూలాపై వరుస సెట్‌లలో విజయం

మెల్‌బోర్న్: తన పూర్వ వైభవాన్ని గుర్తుకు తెచ్చేలా ఆడిన బెలారస్ టెన్నిస్ స్టార్ విక్టోరియా అజరెంకా పదేళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ దశకు అర్హత సాధించింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ అజరెంకా మూడోసారి సెమీఫైనల్‌కు చేరింది. 2012, 2013లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన అజరెంకా 2013లో ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరాక మరే గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అజరెంకా 6-4, 6-1తో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)పై అలవోకగా గెలిచింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అజరెంకా 17 విన్నర్స్ కొట్టి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో క్వార్టర్ ఫైనల్లో 22వ సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-2, 6-4తో 17వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా)ను ఓడించి సెమీస్‌లో అజరెంకాతో పోరుకు సిద్ధమైంది.

పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా) సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో సిట్సిపాస్ 6-3, 7-6 (7/2), 6-4తో లెహచ్కా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గగా... ఖచనోవ్ 7-6 (7/5), 6-3, 3-0తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి సెబాస్టియన్ కోర్డా (అమెరికా) గాయంతో వైదొలిగాడు.



'మిక్స్‌డ్' సెమీస్‌లో సానియా-బోపన్న జోడీ

సానియా మీర్జా-రోహన్ బోపన్న (భారత్) ద్వయం కోర్టులోకి అడుగు పెట్టకుండానే మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. సానియా-బోపన్నలతో ఆడాల్సిన ఒస్టాపెంకో (లాత్వియా)-వెగా హెర్నాండెజ్ (స్పెయిన్) జోడీ గాయం కారణంగా బరిలోకి దిగకపోవడంతో భారత జంటను విజేతగా ప్రకటించారు.

హైదరాబాద్ 247/4


రోహిత్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ జట్టుతో మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 247 పరుగులు సాధించింది. రోహిత్ రాయుడు (90 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ దిశగా సాగుతుండగా... చందన్ సహాని (67; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రోహిత్, చందన్ నాలుగో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. ఓపెనర్లు తన్మయ్ (23; 3 ఫోర్లు), రాహుల్ (41; 4 ఫోర్లు) తొలి వికెట్‌కు 55 పరుగులు జత చేశారు. రోహిత్‌తో కలిసి సంతోష్ గౌడ్ (10 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నాడు.

వరుసగా 12వసారి సెమీస్‌లోకి ఆస్ట్రేలియా



భువనేశ్వర్: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో ఆస్ట్రేలియా జట్టు వరుసగా 12వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. స్పెయిన్ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియా 4-3 తో గెలిచింది. ఆసీస్ తరఫున హేవార్డ్ (33వ, 37వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జెలెవ్‌స్కీ (32వ ని.లో), ఫ్లిన్ ఒగిల్వీ (30వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఒక దశలో ఆస్ట్రేలియా 0-2తో వెనుకబడినా ఏడు నిమిషాల వ్యవధిలో నాలుగు గోల్స్ సాధించింది. మరో క్వార్టర్ ఫైనల్లో బెల్జియం 2-0తో న్యూజిలాండ్‌ను ఓడించి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

సినిమా

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

• అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్


• బాలకృష్ణ

''మా ఆర్టిస్టులు అంతా నాకు మంచి టైమ్‌పాస్. వేదాలు.. శాస్త్రాలు.. నాన్నగారు. ఆ డైలాగులు... ఆ రంగారావుగారు, ఈ అక్కినేని తొక్కినేని... ఇవన్నీ కూర్చొని మాట్లాడుకునేవాళ్లం'' అంటూ 'వీరసింహారెడ్డి విజయోత్సవం'లో నందమూరి బాలకృష్ణ మాట్లాడిన మాటలు హాట్ టాపిక్ అయిన విషయం తెలిసిందే. పాత సినిమాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నామని చెప్పే క్రమంలో బాలకృష్ణ ఇలా 'అక్కినేని తొక్కినేని' అంటూ మాట్లాడారు. ఏయన్నార్ స్థాయిని దిగజార్చేలా 'అక్కినేని తొక్కినేని' అని బాలకృష్ణ మాట్లాడటం ఏంటి? అని ఏయన్నార్ ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. కాగా ఈ విషయంపై అక్కినేని వారసులు అక్కినేని నాగచైతన్య, అక్కినేని అఖిల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

''నందమూరి తారక రామారావుగారు, అక్కినేని నాగేశ్వర రావుగారు, ఎస్వీ రంగారావుగారు తెలుగు కళామతల్లి ముద్దు బిడ్డలు. వారిని అగౌరవపరచడం మనల్ని మనమే కించపరుచుకోవడం'' అంటూ నాగచైతన్య, అక్కినేని అఖిల్ ట్వీట్ చేశారు.

ఎన్టీఆర్ లివ్స్ ఆన్ - నాగార్జున

ఏయన్నార్ గురించి బాలకృష్ణ మాట్లాడిన మాటలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఎన్టీఆర్‌ని ప్రశంసిస్తూ నాగార్జున మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. నాగార్జున, నాగచైతన్య హీరోలుగా నటించిన 'బంగార్రాజు' సినిమా గత ఏడాది జనవరి 14న విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. దీంతో 'బంగార్రాజు' సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. ఈ వేదికపై ఎన్టీఆర్ వర్ధంతిని గుర్తు చేసుకుని నాగార్జున మాట్లాడుతూ – ''జనవరి 18.. నందమూరి తారక రామారావుగారి వర్ధంతి. తెలుగు సినిమా ఉన్నంతవరకు మనం ఆయన్ను గుర్తు చేసుకోవాలి. గుర్తు చేసుకుంటాం. ఎన్టీఆర్ లివ్స్ ఆన్.. అలాగే ఏయన్నార్ లివ్స్ ఆన్'' అన్నారు.

'ఎన్టీఆర్ వర్ధంతి నాడు నాగార్జున అంత బాగా మాట్లాడితే, జనవరి 22న అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి నాడు అక్కినేని తొక్కినేని అంటూ బాలకృష్ణ మాట్లాడటం సబబేనా? ఇదేనా బాలకృష్ణ సంస్కారం అంటూ అప్పటి నాగార్జున వీడియోను, ఇప్పటి బాలకృష్ణ వీడియోను అక్కినేని ఫ్యాన్స్ షేర్ చేశారు.

పవన్ స్పందించాలి

ఎప్పుడూ ఇండస్ట్రీకి ఏదో మేలు చేసే వ్యక్తిలా మాట్లాడే పవన్ కల్యాణ్ ఇప్పుడు 'అక్కినేని నాగేశ్వరరావుగారిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని ఓ అక్కినేని ఫ్యాన్ ట్వీట్ చేశారు. ఇక పవన్ కల్యాణ్ ఎవరో తనకు తెలియదని బాలకృష్ణ ఓ సందర్భంలో పేర్కొన్నారు. కానీ బాలకృష్ణ వ్యాఖ్యాతగా 'ఆహా' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'అన్‌స్టాపబుల్' టాక్ షో సెకండ్ సీజన్‌లోని ఓ ఎపిసోడ్‌కు పవన్ గెస్ట్‌గా వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ఎపిసోడ్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది.

మెంటల్ హ్యాష్‌ట్యాగ్

''అక్కినేని నాగేశ్వరరావుపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు'' అంటూ సోషల్ మీడియా వేదికగా వివిధ ప్రాంతాల నుంచి అక్కినేని ఫ్యాన్స్ స్పందించారు. దీంతో 'మెంటల్ బాలకృష్ణ, ముద్దుల మామయ్య కాదు.. మెంటల్ మామయ్య' అనే హ్యాష్‌ట్యాగ్స్ ట్విటర్ వేదికగా ట్రెండింగ్‌లోకి వచ్చాయి. అలాగే వివిధ సందర్భాల్లో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు, అభ్యంతరకర ప్రవర్తనలకు సంబంధించిన వీడియోలను అక్కినేని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. 'ఈ మెంటల్‌కి సర్టిఫికెట్ రెన్యూవల్ చేయలేదా? మళ్ళీ పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు.. ఎస్వీ రంగారావుగారు, అక్కినేని నాగేశ్వర రావుగారి గురించి మాట్లాడే స్థాయి నీకు ఉందా అసలు?' అంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. ''బహిరంగ సభల్లో మాట్లాడకుండా బాలకృష్ణపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వివిధ కారణాల వల్ల ఆయన నాలుకకు అడ్డూ అదుపు ఉండటం లేదు' అంటూ ఓ ఫ్యాన్ ట్వీట్ చేశారు. ఇటు ఎస్వీ రంగారావు అభిమానులు కూడా బాలకృష్ణ వైఖరిని తప్పుపడుతూ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు.


''బాలకృష్ణ గారు వాళ్ల నాన్నగారి ముందు వీళ్లంతా ఎవరూ అక్కినేని, తొక్కినేని అంటూ అసభ్యకర పదజాలంతో మాట్లాడటం అహంకారపూరిత అవలక్షణంగా భావించాల్సి వస్తోంది'' అంటూ అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సర్వేశ్వరరావు ఓ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ''తెలుగు సినిమా ఇండస్ట్రీ కళాకారులను మదరాసులోనే అంతం అవకుండా మొట్టమొదట హైదరాబాద్‌కు తీసుకువచ్చి మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో సేవలు చేసేలా చేసి, తన నటనతో, సేవాభావంతో ఎంతోమందికి, ఆర్టిస్టులకు అవకాశాలు కల్పిస్తూ ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్న స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు గారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన నందమూరి బాలకృష్ణగారి అహంకారపు మాటలను ఖండిస్తున్నాం. మీ (బాలకృష్ణని ఉద్దేశించి) నాన్నకు అన్యాయం చేసి అధికారం లాక్కుంటే, మీ నాన్న మాటల్లో ఆ నీచుడిని చంపి నా దగ్గరికి రా బాలయ్య అంటూ ఆ రోజు మీ నాన్న నీకు చెప్తే ఈ రోజుకీ ఒక కొడుకుగా నెరవేర్చలేని నీ హీరోయిజం ఏ మాత్రానికి అని మేం ప్రశ్నించవచ్చు. కానీ మా అక్కినేని ఫ్యాన్స్‌కు ఆ సంస్కారం ఉంది. ఇక మీదట మీ అహంకార కుల మత్తు మాటలు కట్టిపెట్టి అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ వారు చేసే విభిన్న కార్యక్రమాలకు మీరు చాలా బాధపడాల్సి వస్తుందని అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ హెచ్చరిస్తూ ఉంది'' అని ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

• • •

రామారావుగారి చివరి రోజుల్లో ఆయనకు పట్టెడన్నం కూడా నందమూరి వారసులు పెట్టలేదన్న విషయం నందమూరి బాలకృష్ణగారు గ్రహించాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారు ఉన్న సమయంలో బాలకృష్ణగారి ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు ఏ విధంగా ఆ కేసు నుంచి బాలకృష్ణగారు బయటపడ్డారనే నిజం ఆయనకే (బాలకృష్ణ) తెలియాలి. ఈ కేసు విషయాలను బాలకృష్ణగారు బయటపెడితే మేం కూడా స్వాగతిస్తాం. ఇకనైనా బాలకృష్ణగారు సీనియర్ నటులను గౌరవించడాన్ని నేర్చుకోవాలి. అక్కినేని నాగేశ్వరరావుగారిపై ఇకపై ఏ నటుడైనా విమర్శలు చేస్తే అభిమానులు కూడా ప్రతి విమర్శలు చేస్తారు'' అంటూ కడప జిల్లా నాగార్జున యువశక్తి అధ్యక్షుడు ఓ వీడియో షేర్ చేశారు. ఇంకా ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారికి ఎన్నో అవార్డులు రాకుండా చేసింది ఎవరో అందరికీ తెలుసు. సినీ ఇండస్ట్రీ హైదరాబాద్‌కు రావడానికి ముఖ్య కారకులు నాగేశ్వరరావుగారు. అలాంటి నటుడిపై బాలకృష్ణ విమర్శలు చేయడం దారుణం. సొంతంగా సంపాదించిన డబ్బుతో అక్కినేని నాగేశ్వరరావుగారు అన్నపూర్ణ స్టూడియోను నిర్మించాలనుకుంటే ఆ స్థలాన్ని కూడా నందమూరి రామారావుగారు కబ్జా చేయాలని చూస్తే, కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. అయినప్పటికీ తన చివరి రోజుల్లో కూడా రామారావుగారు అక్కినేని నాగేశ్వరరావుగారిని బ్రదర్ అంటూ పిలిచారు. తన తండ్రి వయసుగల అక్కినేని నాగేశ్వరరావు గారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇకనైనా మానుకోవాలి'' అన్నారు.

ఇటీవలే క్షమాపణలు చెప్పిన బాలకృష్ణ

దేవబ్రాహ్మణులకు నాయకుడు రావణబ్రహ్మ అంటూ ఇటీవల బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీంతో తన పొరపాటును మన్నించాల్సిందిగా కోరుతూ బాలకృష్ణ ఓ లేఖను విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది.



అందుకే డూప్స్.. రోప్స్ వాడలేదు - సుధీర్‌బాబు

''హంట్' మూవీ ఎంగేజింగ్ థ్రిల్లర్‌గా ఉంటుంది. స్నేహం నేపథ్యంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు కూడా ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులు నా పాత్రతో ప్రయాణిస్తూ కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఈ సినిమా ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని పంచుతుంది'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. మహేశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'హంట్'. శ్రీకాంత్, భరత్ కీలక పాత్రలు చేశారు. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు పంచుకున్న విశేషాలు.

• ఓ సినిమా కోసం 50, 60 కథలు వింటుంటే ఒక మంచి పాయింట్ నచ్చుతుంది. దాన్ని ఎందుకు వదులుకోవడం? కొత్త దర్శకుడైనా మనం ఎందుకు సపోర్ట్ చేయకూడదు? అని ఆలోచిస్తాను. నాకు డౌట్స్ ఉంటే ముందు ప్రశ్నలు అడుగుతా.. ఆ తర్వాత టెస్ట్ షూట్ చేయమని చెబుతా. 'హంట్' సరికొత్త కథ. పైగా, భవ్య క్రియేషన్స్‌లాంటి అనుభవం ఉన్న నిర్మాతలున్నారు. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశాను. • ఈ మూవీలో పోలీస్ ఆఫీసర్ అర్జున్ పాత్ర చేశాను. గతం మర్చిపోవడానికి ముందు, గతం మర్చిపోయిన తర్వాత.. ఇలా రెండు వేరియేషన్స్ ఉంటాయి. ఇందులో యాక్షన్ రియల్‌గా ఉండాలనుకున్నాం. అందుకే డూప్స్, రోప్స్ వాడలేదు. 'జాన్ విక్ 4'కు వర్క్ చేసిన యాక్షన్ కొరియోగ్రాఫర్లు మా మూవీకి పని చేశారు. ఫారిన్‌లో ఫైట్లు షూట్ చేశాం. నాలుగు రోజుల్లో యాక్షన్ సీక్వెన్సులు తీశాం. • 'హంట్'లో హీరోయిన్ లేదు. మేం అక్కడే రూల్ బ్రేక్ చేశాం. రెండు నిమిషాల్లో కథలో లీనమవుతారు. నాకు, నా కుటుంబ సభ్యులకు, ప్రీమియర్ చూసిన వందల మందికి సినిమా నచ్చింది. అయితే ప్రతి హీరో అటెంప్ట్ చేసే స్టోరీ కాదు ఇది. • మా మామయ్య కృష్ణగారు చాలా ప్రయోగాలు చేశారు. నేను కొత్తగా చేసిన 'హంట్' చూసి అభినందిస్తారనే నమ్మకం ఉండేది. కానీ, ఆయన మన మధ్య లేకపోవడంతో వెలితిగా ఉంది. ప్రస్తుతం హర్షవర్ధన్ దర్శకత్వంలో 'మామా మశ్చీంద్ర' సినిమా, యూవీ క్రియేషన్స్‌లో అభిలాష్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాను'' అన్నారు.

ఓ రచయిత ప్రయాణం - షణ్ముఖ ప్రశాంత్



''రైటర్ పద్మభూషణ్' హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. విజయవాడలోని ఓ మధ్య తరగతి యువకుడి కథ ఇది'' అని దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ అన్నారు. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ– ''నా దృష్టిలో కథని అమ్మలానే చూస్తాను. ఎంత బడ్జెట్ పెట్టినా మొదట కంటెంట్ రాయాల్సింది రచయితనే. అలాంటి ఒక రచయిత ప్రయాణం ఈ చిత్రంలో ఉంటుంది. ఇందులో హీరో పాత్ర పేరు పద్మభూషణ్. తను రైటర్ కావాలనుకుంటాడు. మరి అయ్యాడా? లేదా అనేదే కథ. దర్శకులు జంధ్యాల, ఈవీవీ, శ్రీను వైట్లగార్ల సినిమాలంటే ఇష్టం. నా బలం కూడా కామెడీనే. మా సినిమాలో మంచి వినోదం ఉంటుంది'' అన్నారు.

ఆరు జంటల కథ


• లావణ్య, చైతన్యా రావు

సునీల్, చైతన్య రావు మదాడి ప్రధాన పాత్రల్లో అనిల్ గోపి రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాలెంటైన్స్ నైట్'. స్వాన్ మూవీస్ సమర్పణలో ఫన్ సాగ బ్యానర్‌పై తృప్తి పాటిల్, సుధీర్ యాళంగి మహీంధర్ నారల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అనిల్ గోపిరెడ్డి మాట్లాడుతూ–''ఆరు జంటల కథ ఇది. ఒకరి కథలోకి ఒకరు ప్రవేశించిన తర్వాత వాలెంటైన్స్ నైట్ నాడు ఏం జరిగింది? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అనిల్ గోపిరెడ్డి. ''ఈ సినిమాలో దాదాపు పది కథలు చూడొచ్చు'' అన్నారు చైతన్యా రావు. ఈ చిత్రానికి సహనిర్మాత: సాయిబాబు వాసిరెడ్డి, కెమెరా: జయపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: స్వాతి రాపేటి.

నక్సలిజం నేపథ్యంలో...


• శివ బాలాజీ, బ్రిగిడ, ధర్మ మహేశ్

శివ బాలాజీ, ధర్మ మహేశ్, బ్రిగిడ సాగ ప్రధాన పాత్రల్లో శ్యామ్ తుమ్మలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సిందూరం'. శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్‌పై ప్రవీణ్ రెడ్డి జంగా నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శ్యామ్ తుమ్మలపల్లి మాట్లాడుతూ–''నక్సల్స్ ఉద్యమం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. కొన్ని వాస్తవ సన్నివేశాలను మా సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది'' అన్నారు ప్రవీణ్ రెడ్డి జంగా. ''ఈ కథ విన్నప్పుడు ఇంటెన్స్ జానర్ అనిపించింది. ఫస్ట్ టైమ్ నక్సలైట్‌గా చేశాను'' అన్నారు శివ బాలాజీ. ఈ చిత్రానికి సహనిర్మాతలు: చైతన్య కందుల, సుబ్బారెడ్డి .ఎం, కెమెరా: కేశవ్, సంగీతం: హరి గౌర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ బాలాజీ .డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 37	60,979	
నిఫ్టీ 0	18,118	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,336	▽	28
డోజోన్స్	33,631	▲	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,757	▽	10
డాక్స్	15,093	▽	28
షాంఘై(శుక్రవారం ముగింపు)	3,265	▲	25
నికాయ్	27,299	▲	393

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,322 ▲ 278
బంగారం (99.5 స్వచ్ఛత)	57,092 ▲ 278
వెండి (కిలో)	68,137 ▽ 136

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాముసముకి	80.80	82.47
£	బ్రిటన్ పౌండ్	ధాముసముకి	87.21	90.32
€	యూరో	ధాముసముకి	99.37	102.73
¥	జపాన్ ఎన్ (100)	ధాముసముకి	61.62	63.64
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధాముసముకి	56.27	58.64
S$	సింగపూర్ డాలర్	ధాముసముకి	60.88	62.89
SAR	సౌదీ రియాల్	ధాముసముకి	20.80	22.47
UAE D	యూఏఈ దిర్హామ్	ధాముసముకి	21.35	23.15
¥	చైనా యువాన్	ధాముసముకి	10.92	13.00

మారుతీ లాభం హైజంప్

క్యూ3లో రూ. 2,351 కోట్లు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా జంప్ చేసి రూ. 2,351 కోట్లను తాకింది. గతేడాది (2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,011 కోట్లు ఆర్జించింది. కొత్త ప్రొడక్టుల విడుదల నేపథ్యంలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గ్రాండ్ విటారా, బ్రెజ్జా కొత్త వెర్షన్ తదితర మోడళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఇక నికర అమ్మకాలు సైతం రూ. 22,188 కోట్ల నుంచి రూ. 27,849 కోట్లకు ఎగశాయి.

విక్రయాలు అప్: తాజా సమీక్షా కాలంలో మారుతీ 4,65,911 వాహనాలను విక్రయించింది. వీటిలో 61,982 యూనిట్లను ఎగుమతి చేసింది. గతేడాది క్యూ3లో 4,30,668 వాహనాలు మాత్రమే విక్రయంకాగా.. 64,995 వాహనాలను ఎగుమతి చేసింది. అంటే దేశీ అమ్మకాలు 3,65,673 యూనిట్ల నుంచి 4,03,668కు ఎగశాయి. కాగా.. ఈ కాలంలో ఎలక్ట్రానిక్ విడిభాగాల కొరత కారణంగా 46,000 యూనిట్ల ఉత్పత్తిపై ప్రభావం పడినట్లు మారుతీ పేర్కొంది. 2022 డిసెంబర్ 31 కల్లా 3,63,000 ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. వీటిలో 1,19,000 ఆర్డర్లు కొత్తగా ప్రవేశపెట్టిన మోడళ్లకు సంబంధించినవని తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో మారుతీ సుజుకీ షేరు 3.3 శాతం జంప్‌చేసి రూ. 8,696 వద్ద ముగిసింది.

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- సెన్సెక్స్ లాభం 37 పాయింట్లు
- నిఫ్టీ యథాతథ ముగింపు
- బ్యాంక్స్, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఊగిసలాటకు లోనైన దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇంట్రాడేలో 431 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 37 పాయింట్ల లాభంతో 60,979 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభ, నష్టాలకు లోనవకుండా సోమవారం ముగింపు 18,118 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 18,201 వద్ద గరిష్టాన్ని, 18,079 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సంకేతాలను అందిపుచ్చుకున్న దేశీయ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆటో షేర్ల అండతో తొలి దశలో దూసుకెళ్లాయి. అయితే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(1.50%)తో పాటు బ్యాంకింగ్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో ఆరంభ లాభాలు హరించుకుపోయాయి. మెటల్, ఫార్మా, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. వాహన రంగానికి చెందిన కీలక కంపెనీలు ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్న తరుణంలో ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అర శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 81.70 స్థాయి వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.761 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.1,145 కోట్ల కొన్నారు. ద్రవ్యోల్బణ కట్టడికి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

హైదరాబాద్ నుంచి ఆకాశ ఎయిర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానయాన రంగ సంస్థ ఆకాశ ఎయిర్ హైదరాబాద్ నుంచి సర్వీసులను నేటి (బుధవారం) నుండి ప్రారంభిస్తోంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–గోవా మధ్య ఇవి నడవనున్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మరో రెండు సర్వీసులను ఫిబ్రవరి 15 నుంచి జోడించనున్నారు. విశాఖపట్నం సహా ప్రస్తుతం ఆకాశ ఎయిర్ దేశంలోని 13 నగరాలకు సేవలను అందిస్తోంది. ఈ ఏడాది మరో నాలుగైదు నగరాలు తోడవనున్నాయని కంపెనీ కో–ఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. సంస్థ వద్ద 14 విమానాలు ఉన్నాయని చెప్పారు. మార్చి నాటికి మరో నాలుగు వచ్చి చేరుతున్నాయని వెల్లడించారు. 2023 రెండవ అర్ధ భాగంలో అంతర్జాతీయ సర్వీసులు నడుపుతామని తెలిపారు. నాలుగేళ్లలో ఆకాశ ఎయిర్ ఖాతాలో 72 ఎయిర్‌క్రాఫ్ట్లు ఉంటాయని కో–ఫౌండర్ బెల్సన్ కొటినో పేర్కొన్నారు.



బెల్సన్ కొటినో, ప్రవీణ్ అయ్యర్ (కుడి)

టీవీఎస్ మోటార్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 304 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 28 శాతం ఎగసి రూ. 304 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 237 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,606 కోట్ల నుంచి రూ. 8,075 కోట్లకు జంప్ చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ కాలంలో మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 8.35 లక్షల నుంచి స్వల్పంగా పెరిగి 8.36 లక్షలకు చేరాయి. ఎగుమతులు 2.53 లక్షల నుంచి 2.07 లక్షలకు క్షీణించాయి. మొత్తం త్రిచక్ర వాహన అమ్మకాలు 44,000 యూనిట్ల నుంచి 43,000 యూనిట్లకు నీరసించాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు యథాతథంగా రూ. 982 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్ లాభం జూమ్



క్యూ3లో రూ. 509 కోట్లు

న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డ్ దిగ్గజం ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 509 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 386 కోట్లతో పోలిస్తే ఇది 32 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ. 3,140 కోట్ల నుంచి రూ. 3,656 కోట్లకు ఎగసింది. అయితే నిర్వహణ వ్యయాలు 15 శాతం పెరిగి రూ. 1,974 కోట్లను తాకాయి. ఈ కాలంలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.4 శాతం నుంచి 2.22 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.83 % నుంచి 0.80 శాతానికి తగ్గాయి.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ కార్డ్స్ షేరు 2.4 శాతం క్షీణించి రూ. 749 వద్ద ముగిసింది.

క్రోమా రిపబ్లిక్ డే సేల్స్ ఆఫర్లు

హైదరాబాద్: టాటా గ్రూప్ రిటైలర్ క్రోమా 'రిపబ్లిక్ డే సేల్స్' ఆఫర్లు ప్రకటించింది. కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ జాయ్ ప్రచారంతో ఇప్పటికే మొదలైన మెగా ఆఫర్ల సందడి ఈ జనవరి 29న వరకు కొనసాగనుంది. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, టీవీలు, సౌండ్ బార్స్, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, ట్యాబ్లెట్లు తదితర ఎలక్ట్రానిక్స్ గృహోపకరణలపై 50 శాతం వరకూ రాయితీ పొందొచ్చు. స్టోర్ల వద్ద కన్జూమర్ ఫైనాన్స్‌పై రూ.5వేల వరకూ క్యాష్‌బ్యాక్, ఎంపిక చేసిన బ్యాంక్‌కార్డుల ద్వారా కొనుగోలు చేస్తే పదిశాతం వరకు తక్షణ డిస్కౌంట్‌ను అందిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-1-2023	
విశాఖ	530–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	78.00
24-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు చేయండి

- దీనివల్ల చమురు–గ్యాస్ అన్వేషణకు విఘాతం
- ప్రీ–బడ్జెట్ నివేదికలో కేంద్రానికి ఫిక్కీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశీయంగా ఉత్పత్తి అయిన ముడి చమురుపై విండ్‌ఫాల్ ప్రాఫిట్ టాక్స్‌ను 2023–24 వార్షిక బడ్జెట్‌లో రద్దు చేయాలని కేంద్రానికి పరిశ్రమల వేదిక- ఫిక్కీ తన ప్రీ–బడ్జెట్ కోర్కెల మెమోరాండంలో విజ్ఞప్తి చేసింది. ఈ పన్ను విధింపు చమురు, గ్యాస్ అన్వేషణకు సంబంధించిన పెట్టుబడులకు ప్రతికూలమని తన సిఫారసుల్లో పేర్కొంది. భారతదేశం 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా అంతర్జాతీయంగా ధరల పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది. తొలుత దేశీయ ముడిచమురు ఉత్పత్తిపై టన్నుకు రూ.23,250 (బ్యారెల్‌కు 40 డాలర్లు) విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధింపు జరిగింది. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై కూడా కొత్త పన్ను అమలు జరుగుతోంది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతి పదిహేను రోజులకు ఈ పన్ను మదింపు, నిర్ణయం జరుగుతోంది. అటువంటి లెవీ ప్రస్తుతం ఉన్న అన్ని ఇతర పన్నులకు అదనం. ఇంధన రంగానికి సంబంధించి ఫిక్కీ తాజా నివేదికలో ముఖ్యాంశాలు..



- పెట్రోలియం క్రూడ్‌పై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్ఏఈడీ)ని కూడా రద్దు చేయాలి. లేదా అసాధారణ చర్యగా కొంత కాలం లెవీని కొనసాగించాల్సిన అవసరం ఉన్నట్లయితే, ఆ రేటును యాడ్–వాల్రెమ్ లెవీగా మార్చాలి. ఇది 100 డాలర్ల పైన పెరిగే క్రూడ్ ధరలో 20 శాతంగా ఉండాలి.
- రాయల్టీ (ఆన్‌షోర్ ఫీల్డ్‌లకు చమురు ధరలో 20%, ఆఫ్‌షోర్ ప్రాంతాలకు 10%) అలాగే చమురు పరిశ్రమ అభివృద్ధి (ఓఐడీ) సెస్ (చమురు ధరలో 20%) ఇప్పటికే భారం అనుకుంటే, విండ్‌ఫాల్ పన్ను ఈ భారాన్ని మరింత పెంచుతోంది.
- విండ్‌ఫాల్ టాక్స్ వాస్తవ ధర్‌పై కాకుండా, టన్ను ఉత్పత్తిపై మదింపు జరుగుతోంది. దీనివల్ల ధరలు తగ్గినప్పుడు ఉత్పత్తిదారులను దెబ్బతీస్తోంది.

ప్రపంచ ప్రమాణాలు పాటించాలి..



"ప్రస్తుతం దేశీయ ముడి చమురు ఉత్పత్తిదారులపై దాదాపు 70% పన్ను విధిస్తున్నారు. ప్రపంచ ప్రమాణాల ప్రకారం, 35–40% పన్ను మాత్రమే విధించాలి. ఈ రంగంలో కీలక పెట్టుబడులకు ఇది పన్ను దోహదపడుతుంది. ఇంధన రంగానికి మద్దతు ఇవ్వడానికి, అస్థిర ప్రపంచ ముడి మార్కెట్ల నుండి దేశాన్ని రక్షించడానికి కీలకమైన విధాన సంస్కరణలు తెచ్చేందుకు ఈ బడ్జెట్ మంచి అవకాశం."

– సునీల్ దుగ్గల్, వేదాంత గ్రూప్ సీఈఓ

ఎయిర్‌టెల్ కనీస రీచార్జ్ రూ.155

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ అన్‌లిమిటెడ్ ప్యాక్స్‌లో కనీస రీచార్జ్ ధరను రూ.155కు చేర్చింది. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సహా ఎనమిది సర్కిళ్లలో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్యాక్ కాలపరిమితి 24 రోజులు. 1 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్, అపరిమి త కాల్స్ చేసుకోవచ్చు. హెలోట్యూన్స్, వింక్ మ్యూజిక్ ఉచితం. రూ.99 రీచార్జ్ ప్లాన్‌ను ఎయిర్‌టెల్ నిలిపివేసింది.



భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో 37 ఉద్యోగాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ కార్యాలయంలో.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–13, డేటాఎంట్రీ ఆపరేటర్లు–10, ఆఫీస్ సబార్డినేట్–14.
- **జూనియర్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్లు:** **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్/పీజీడీసీఏ/డీసీఏ/ఇంజనీరింగ్ సర్టిఫికేట్/కంప్యూటర్‌తో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఆఫీస్ సబార్డినేట్: అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు, ఇంగ్లిష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- **వయసు:** 30.11.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.23,500, డేటాఎంట్రీ ఆపరేటర్‌కు రూ.23,500, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు రూ.15,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** జేఏ, డీఈవో ఖాళీలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులు, స్కిల్ టెస్ట్ ఆధారంగా, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **స్కిల్‌టెస్ట్‌కు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాల వెల్లడి తేది:** 03.02.2023.
- **ధ్రువపత్రాల పరిశీలన తేది:** 06.02.2023, 07.02.2023.
- **స్కిల్ టెస్ట్ తేది:** 11.02.2023, 12.02.2023.
- **ఎంపిక జాబితా వెల్లడి తేది:** 13.02.2023.
- **వెబ్‌సైట్:** apssa.aptonline.in

నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా, హైదరాబాద్‌లో 12 రీసెర్చ్ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా రీసెర్చ్ కేంద్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–06, రీసెర్చ్ అసిస్టెంట్–06.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ, బీఎల్, ఎంఏ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.40,000, రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ.35,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.01.2023.
- **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

యూపీఎస్సీలో 111 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు/విభాగాల్లో శాశ్వత ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 111
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ కమిషనర్(హార్టికల్చర్)–01, అసిస్టెంట్ డైరెక్టర్(టాక్సికాలజీ)–01, రబ్బర్ ప్రొడక్షన్ కమిషనర్(రబ్బరు బోర్డు)–01, సైంటిస్ట్ బి(నాన్ డిస్ట్రక్టివ్)–01, సైంటిఫిక్ ఆఫీసర్(ఎలక్ట్రికల్)–01, ఫిషరీస్ రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్–01, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్(టెక్నికల్)–06, అసిస్టెంట్ డైరెక్టర్(ఐటీ)–04, సైంటిస్ట్ బి(టాక్సికాలజీ)–01, సైంటిస్ట్ బి(సివిల్ ఇంజనీరింగ్)–09, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్)–76, డిప్యూటీ లెజిస్లేటివ్ కౌన్సిల్(హిందీ బ్రాంచ్)–03, అసిస్టెంట్ ఇంజనీర్ గ్రేడ్1–04, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్–02.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.02.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటింగ్‌కు చివరితేది:** 03.02.2023.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఎన్ఐఆర్‌డీపీ, హైదరాబాద్‌లో 135 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 135
- » **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- » **వెబ్‌సైట్:** nirdpr.org.in

గ్రూప్ 4.. గెలుపు ఇలా!

నిరుద్యోగుల ఎదురుచూపులకు తెరదించుతూ తెలంగాణ ప్రభుత్వం 8039 గ్రూప్-4 ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఈ కొలువులకు పోటీ తీవ్రంగా ఉండే అవకాశముంది. దాదాపు పది లక్షల మంది దరఖాస్తు చేసుకుంటారని అంచనా. ఇంతటి పోటీలోనూ మెలకువలు పాటిస్తే విజయం సాధించవచ్చు అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో.. గ్రూప్ 4 పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ గైడెన్స్..



టీఎస్‌పీఎస్సీ జాబ్స్

» మొత్తం 8039 పోస్టులకు గ్రూప్ 4 నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» దరఖాస్తులకు చివరి తేది 30.01.2023

టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 నోటిఫికేషన్ ప్రకారం- మొత్తం 8039 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో వివిధ విభాగాల్లో జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఆడిటర్, వార్డ్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని రకాల పోస్టులకు మాత్రం బీకామ్ అర్హతగా పేర్కొన్నారు.
- **వయసు:** 01.07.2022 నాటికి 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది.

గ్రూప్–4 పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఇందులో పేపర్ 1లో జనరల్ నాలెడ్జ్–150, పేపర్–2లో సెక్రటేరియల్ ఎబిలిటీస్ 150 మార్కులకు ఉంటుంది. పీవో, క్లరికల్ వంటి బ్యాంకింగ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతోపాటు, మ్యాథ్స్ నేపథ్యం ఉన్న వారు కొద్దిగా కష్టపడితే పేపర్–2లో మంచి స్కోర్ చేయొచ్చు. అలాగే ఉన్న తక్కువ సమయాన్ని సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకోగలిగితే.. పేపర్–1లో కూడా మంచి మార్కులు సాధించొచ్చు.

పేపర్-1 జనరల్ స్టడీస్

ఈ పేపర్‌లో మొత్తం 11 విభాగాల్లో తెలంగాణకు సంబంధించి.. తెలంగాణ భౌగోళిక అంశాలు, తెలంగాణ ఉద్యమం, సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం, పాలన విధానాలు, ఆర్థిక వ్యవస్థ తదితరాలపై ప్రశ్నలు అడుగుతారు.

భారత రాజ్యాంగం

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఎక్కువ మార్కులు సాధించే అవకాశమున్న విభాగం ఇది. కరెంట్ అఫైర్స్‌ను అనుసంధానించుకుంటూ, చాప్టర్ల వారీగా చదవాలి. అలాగే గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. కొన్ని సందర్భాల్లో అవి రిపీట్ అయ్యే అవకాశం కూడా ఉంది. వీటితోపాటు మాక్ టెస్ట్‌లు రాయాలి.

జాగ్రఫీ

భారతదేశ భౌగోళిక అంశాలపై ప్రశ్నలుంటాయి. బేసిక్ స్థాయిలోనే వీటిని అడిగే అవకాశం ఉంటుంది. ప్రిపరేషన్‌లో స్కూల్, డిగ్రీ స్థాయి పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది.

భారత ఆర్థిక వ్యవస్థ

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. పాఠశాల స్థాయి బేసిక్ అంశాలతో ప్రారంభించి, భారత ఆర్థిక సర్వే, బడ్జెట్లపైన స్థూలంగా అవగాహన పెంచుకోవాలి. స్థూల గణంకాలపై అవగాహన ఉండాలి. ప్రణాళిక వ్యవస్థ, నీతి ఆయోగ్, సాంఘిక ఆర్థిక సమస్యలైన నిరుద్యోగం ,పేదరికం, మౌలిక భావనలు తెలుసుకోవాలి. వాటిని నిర్మూలనకు ప్రభుత్వం తీసుకునే చర్యలు, ప్రస్తుతం అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విత్త, ద్రవ్య వ్యవస్థలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఆధునిక భారతదేశ చరిత్ర-జాతీయోద్యమం

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఇందులో ఎక్కువ శాతం ప్రశ్నలు భారత జాతీయోద్యమం నుంచి ఉంటాయి. సంవత్సరాల వారీగా ఉద్యమంలోని వివిధ దశలు, వాటి ఫలితాలు, ఉద్యమాన్ని నడిపిన వ్యక్తుల జీవిత చరిత్ర, జాతీయోద్యమం నాటి గవర్నర్ జనరల్స్, ఆ కాలంలో విడుదలైన బ్రిటిష్ చట్టాలు, వాటిపై భారతీయుల స్పందన, జాతీయోద్యమ కాలంలో తెలంగాణలో జరిగిన సంఘటనలు వంటి వాటిపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశముంది. జాతీయోద్యమ చరిత్రకు సంబంధించి తెలుగు అకాడమీ పుస్తకాలు ఉపయోగపడతాయి.

జనరల్ సైన్స్

- ఈ విభాగంలో సైన్స్ అనువర్తనాలపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం పాఠశాల స్థాయి భౌతిక, జీవ, రసాయన శాస్త్ర అనువర్తనాలను చదువుకుంటే సరిపోతుంది. పాఠ్యపుస్తకాల్లోని సైద్ధాంతిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా.. మౌలిక అంశాలను చదువుకుని అనువర్తనాలపై దృష్టి పెట్టాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** ఈ విభాగాన్ని సిలబస్‌లో పేర్కొనపోయినప్పటికీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. కరెంట్ ఆఫైర్స్‌లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్నలు వస్తాయి. నిత్య జీవితంలో అంతర్భాగంగా సైన్స్ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురవుతాయి.

పర్యావరణం-విపత్తుల నిర్వహణ

ఈ రెండు అంశాలపై 10 వరకు ప్రశ్నలు అడిగే వీలుంది. కొంతవరకు పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాలతోపాటు 12వ తరగతి స్థాయి విపత్తు నిర్వహణ, పర్యావరణ అంశాలు చదివితే మంచి ఫలితం సాధించవచ్చు.

అంతర్జాతీయ సంబంధాలు, సంఘటనలు

మన దేశానికి ఇతర దేశాలతో ఉన్న సంబంధాలపై ప్రధానంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో ముఖ్యంగా సరిహద్దు దేశాలతో భారతదేశానికి ఉన్న సత్సంబంధాలపై ప్రశ్నలు వచ్చే వీలుంది. అంతర్జాతీయ సంఘటనలు, ప్రపంచ వేదికల్లో భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్ అనుసంధానించుకొని చదివితే మేలు. వివిధ అంతర్జాతీయ వేదికలు, వాటి ప్రారంభం, పలు అంతర్జాతీయ వేదికలపై భారతదేశ పాత్ర, ఆయా వేదికల సభ్య దేశాలు, వాటి పూర్వ, ప్రస్తుత అధ్యక్షులు, తాజా సమావేశాలు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

కరెంట్ అఫైర్స్

ఈ విభాగంలో పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 9 నెలల కాలానికి సంబంధించిన కరెంట్ అఫైర్స్‌ను చదవాలి. ప్రశ్నలు ఏ విధంగా అడిగినా.. సమాధానాలు గుర్తించేలా ప్రిపరేషన్ సాగించాలి.

పేపర్-2(సెక్రటేరియల్ ఎబిలిటీస్)

శ్రద్ధగా ప్రాక్టీస్ చేస్తే పేపర్–2లోఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశముంది. ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారు మంచి స్కోర్ చేయొచ్చు. అలాగే ప్రతి రోజు రెండు, మూడు గంటల ప్రాక్టీస్ ద్వారా తాజా అభ్యర్థులు కూడా అధిక మార్కులు సాధించవచ్చు. పేపర్–2లో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

మెంటల్ ఎబిలిటీ

కోడింగ్, డీకోడింగ్, రక్త సంబంధాలు, పజిల్స్, వర్గీకరణ, అనాలజీ, అసర్షన్–రీజన్, వెర్బల్–నాన్ వెర్బల్, రీజనింగ్ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. ఈ ప్రశ్నల్లో ఉన్న లాజిక్, సమస్య పరిష్కార పద్ధతిని తెలుసుకుంటే.. మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. సైద్ధాంతిక భావనలను అర్థం చేసుకొని, విస్తృత స్థాయిలో సాధన చేస్తే ఈ విభాగంలో రాణించవచ్చు.

న్యూమరికల్, అర్థమెటికల్ ఎబిలిటీస్

వడ్డీ లెక్కలు, కాలం–పని, కాలం–వేగం, నిష్పత్తులు, వాటాల లెక్కింపు మొదలైన పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ప్రశ్నలు అర్థం చేసుకుంటే.. సమాధానాలు సులువే. ఇందుకోసం వీలైనన్నీ ఎక్కువ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సాంఖ్యక శాస్త్ర పాఠ్యాంశాల సగటు, మధ్యమం, బహుళకం తదితర అంశాలను సాధన చేయడం ద్వారా.. వాటిపై వచ్చే ప్రశ్నలకు సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. బోడ్ మాస్, అంకెల మధ్య ఉండే సహసంబంధాలు, అంకెల వరుసక్రమాలు మొదలైన సూత్రాల మీద ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

కాంప్రహెన్షన్

సమాచారాన్ని ఒక పేరాగ్రాఫ్‌లో ఇస్తారు. దాన్ని చదివి వివిధ రకాలైన ప్రశ్నలకు సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు ప్రాక్టీస్ బిట్స్ కలిగిన పేరాగ్రాఫ్‌లు చదివి సాధన చేయాలి. పేరాను వేగంగా ఏకాగ్రతతో చదవడం, అర్థం చేసుకోవడం, సంక్షిప్తీకరించుకోవడం అనే అంశాలపై ఆధారపడి ఈ విభాగంలో మంచి మార్కులు పొందవచ్చు.


సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్

ఈ విభాగం కోసం ప్రత్యేకంగా సన్నద్ధం కావాల్సిన అవసరం లేదు. వరస మార్చిన వివిధ వాక్యాలను అర్థవంతమైన రూపంలో తిరిగి అమర్చాలి. ఎక్కువ ప్రాక్టీస్ ద్వారా ఇందులో సులభంగా మార్కులు సాధించొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 30.01.2023
- **పరీక్ష తేదీలు:** ఏప్రిల్/మే 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

ఇంటి అవసరాలకు.. ఆపై గ్రిడ్‌కు..



స్వయం సహాయక సంఘాల మహిళల గృహాలకు సౌర విద్యుత్ యూనిట్

- వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే వెసులుబాటు
- యూనిట్ల ఏర్పాటుకు స్త్రీనిధి నుంచి రుణం.. టీఎస్ రెడ్‌కో ద్వారా సబ్సిడీ
- ఒక్కో మండలానికి 35 మంది లబ్ధిదారుల ఎంపిక.. గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల గృహాలకు సౌరవిద్యుత్ యూనిట్లు మంజూరు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో తమ గృహావసరాలకు పోగా, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌లకు విక్రయించుకునే వెసులుబాటు కల్పించనుంది. తద్వారా వీరు విద్యుత్ చార్జీల భారం నుంచి ఉపశమనం పొందేలా చూడొచ్చని, అలాగే, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందించవచ్చని భావిస్తోంది. ఈ సౌర విద్యుత్ ఫలకలను బిగించుకునేందుకు డాబా ఇళ్లు ఉన్న ఎస్‌హెచ్‌జీ మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తోంది. ఈ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు వ్యయంతో కూడుకున్నది కావడంతో ఆయా మహిళలకు స్త్రీ నిధి ద్వారా రుణాలను ఇవ్వనుంది. అవసరాన్ని బట్టి రెండు లేదా మూడు కిలోవాట్ల యూనిట్లను మంజూరు చేయనుంది. దీనికి రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి (టీఎస్‌రెడ్‌కో) నుంచి సబ్సిడీ వస్తుంది.

మండలానికి 35 యూనిట్లు

మొదట ఒక్కో మండలానికి 35 సోలార్ విద్యుత్ యూనిట్లను మంజూరు చేయాలని భావిస్తున్నారు. స్వయం సహాయక కార్యకలాపాలు సరిగ్గా నిర్వహించే వారిని, తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన సభ్యులను వీటికి ఎంపిక చేస్తున్నారు. నెలకు 200–300 యూనిట్ల విద్యుత్ వాడుకునే వారు ఈ సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ విద్యుత్ యూనిట్లకు నెట్ మీటర్లు బిగించి పవర్ గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. సొంత అవసరాలకు పోగా, మిగిలిన విద్యుత్‌కు నిర్ణీత ధర చొప్పున గ్రిడ్‌లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటారు. విద్యుత్‌ను విక్రయించగా వచ్చే ఆదాయంతో సభ్యులు ఐదేళ్లలో రుణాన్ని పూర్తిస్థాయిలో చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. 25 ఏళ్ల వరకు సోలార్ ప్యానెల్స్ పని చేస్తాయని, ఐదేళ్ల వరకు గ్యారెంటీ ఉంటుందని అంటున్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం



స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ విద్యుత్ యూనిట్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించాం. వీటిని ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన రుణాన్ని స్త్రీనిధి ద్వారా అందించనున్నాం. సభ్యులు ఈ యూనిట్ల ఏర్పాటుతో విద్యుత్ చార్జీలను తగ్గించుకోవచ్చు. అలాగే, వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా నెలవారీ ఈఎంఐలు సులువుగా కట్టవచ్చు.

-సీహెచ్ శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

యూనిట్ వ్యయం, సబ్సిడీ, లబ్ధిదారుల వాటా ఇలా..

యూనిట్ కెపాసిటీ	యూనిట్ విలువ(రూ.)	సబ్సిడీ (రూ.)	రుణం (రూ.)	సభ్యురాలి వాటా (రూ.)	నెలవారీ ఈఎంఐ(రూ.)
2 కిలోవాట్	1,42,200	39,200	1,00,000	3,000	2,243
3 కిలోవాట్	1,92,360	57,360	1,25,000	10,000	2,803

కేబుల్ కార్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్



వచ్చే ఏడాదిలోగా కేబుల్ కార్ అందుబాటులోకి

పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర పర్యాటకుల సౌలభ్యం కోసం వచ్చే ఏడాది కల్లా ఆధునాతన కేబుల్ కార్‌ను అందుబాటులోకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం స్పెయిన్ పర్యటనలో భాగంగా కేబుల్ కార్‌ను పరిశీలించి అందులో తిరిగారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎత్తైన కొండలపై కొలువైన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చారిత్రక భువనగిరి కోట, దుర్గం చెరువు లాంటి అనువైన పర్యాటక ప్రదేశాల్లో అంతర్జాతీయ స్థాయిలో అధునాతన కేబుల్ కార్‌ను ప్రవేశపెట్టేలా చూస్తున్నామని వివరించారు. పర్యాటక ప్రదేశాలను విదేశీ పర్యాటకులకు పరిచయం చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రచార కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.

కోతుల కోసం కుక్క పులి వేషం వేసింది!

పలిమెల: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం బూరుగుగ్గూడెంలో ఓ కుక్క పులి వేషం వేసింది! అదిప్పుడు వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన ఓ రైతు పంట చేనులో కోతుల బెడదను తప్పించుకోవడానికి మార్గం ఆలోచించాడు. శునకం శరీరంపై నలుపు రంగుతో పులి చారలు గీసి చేనులో కాపలా పెట్టాడు. పంట చేను వద్ద పులిని తలపిస్తున్న శునకాన్ని చూసి భయపడిన కోతులు పంట చేనులోకి రావడం లేదని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



పులిలాంటి చారలతో కుక్క



దర్జీ.. దయాకర్

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాసేపు దర్జీగా మారారు. జనగామ జిల్లా కొడకండ్ల శ్రీ వెంకటేశ్వర మండల సమాఖ్యలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు కుట్టుమెషీన్‌పై కూర్చొని కుట్టారు.

- కొడకండ్ల

'సహారా' చీటింగ్ కేసుల వివరాలివ్వండి

డీజీపీ కార్యాలయం ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: డిపాజిట్ల చెల్లింపుల్లో జాప్యం చేస్తూ కష్టమర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న 'సహారా' బ్యాంకింగ్ వ్యవహారంపై డీజీపీ కార్యాలయం స్పందించింది. దీనిపై 'పల్లెల్లో సహారా కలకలం' శీర్షికన ఈనెల 21 నుంచి 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సహారా బాధితులు ఒక్కొక్కరుగా బయటికి వస్తూ.. పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సోమవారం వరకు సిరిసిల్లలో నాలుగు, హన్మకొండలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి చొప్పున చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసులపై ఇంటలిజెన్స్ వర్గాలు డీజీపీకి రిపోర్టు పంపాయి. దీంతో ఇంతవరకూ రాష్ట్రవ్యాప్తంగా సహారాకు సంబంధించి ఎన్ని చీటింగ్ కేసులు నమోదయ్యాయి..? అనే విషయంలో అన్ని జిల్లాల ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లకు డీజీపీ కార్యాలయం ఆదేశాలు పంపింది. ఇక కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో గత నెల 17వ తేదీన ఆత్మహత్యకు పాల్పడిన సహారా మేనేజర్ కందాల సంపత్ (55) నేపథ్యం, ఆత్మహత్యకు ముందురోజు ఏం జరిగింది..? అనే వివరాలపైనా వివరాలు సమర్పించాలని కరీంనగర్ కమిష నరేట్ పోలీసులను డీజీపీ కార్యాలయం ఆదేశించింది.

సాక్షి ఎఫెక్ట్

మేథ్స్‌లో తిప్పలు... కెమిస్ట్రీలో స్కోర్..

ఫిజిక్స్ మధ్యస్తం..

- మొదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు
- గతంలోని ప్రశ్నలే ఎక్కువగా వచ్చాయంటున్న విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) తొలి రోజు మంగళవారం దేశవ్యాప్తంగా జరిగింది. ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరిగే ఈ పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. తెలంగాణలో 1.5 లక్షల మంది జేఈఈ మెయిన్స్ రాస్తున్నారు. రాష్ట్రంలోని 17 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోంది. మంగళవారం ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కువ భాగం క్రితం సంవత్సరాల్లో ఇచ్చిన ప్రశ్నలు వచ్చినట్టు విద్యార్థులు తెలిపారు. అయితే గణితంలో ఇచ్చిన ప్రశ్నలు కష్టంగానే ఉన్నట్టు చెప్పారు. ఫిజిక్స్ మధ్యస్తంగా ఉందని, కెమిస్ట్రీలో ఎక్కువ స్కోర్ చేసే వీలుందని తెలిపారు. పూర్తిగా ఆన్‌లైన్ మోడ్‌లో జరిగిన ఈ పరీక్షలో మేథ్స్ కోసం ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చిందన్నారు.

రీజనింగ్ ఈజీనే...

మేథమెటిక్స్‌లో కొన్ని బేసిక్ ప్రశ్నలకు తేలికగా సమాధానాలు ఇవ్వగలిగారు. అయితే చాలా ప్రశ్నలకు సుదీర్ఘంగా విశ్లేషించక తప్పలేదని చెప్పారు. త్రీడీ, వెక్టర్‌ఆల్‌జీబ్రా, మేథమెటికల్ రీజనింగ్ ప్రశ్నలకు కష్టపడకుండా సమాధానాలు ఇవ్వగలి గారు. ఫిజిక్స్‌లో ఎక్కువ ప్రశ్నలు సెమీ కండక్టర్స్, ఎలక్ట్రో స్టాటిస్టిక్స్, మ్యాగ్నటిజం, మోడ్రన్ ఫిజిక్స్, ఈఎంఐ, ఫిక్షన్ న్యూక్లియర్ ఫిజిక్స్, ఏసీ కరెంట్ నుంచి వచ్చాయి. థియరీ ప్రశ్నలు ఎన్సీఈఆర్‌టీ సిలబస్ నుంచి ఇచ్చారు. కెమిస్ట్రీలో ఎన్సీఈఆర్‌టీ పుస్తకాలు అనుసరించిన వారికి పేపర్ తేలికగానే ఉన్నట్టు కెమిస్ట్రీ అధ్యాపకులు చెబుతున్నారు. ఆర్గా నిక్, ఇన్ ఆర్గానిక్, కెమికల్ కైనటిక్స్, గ్రాఫ్ బేస్డ్ ప్రశ్నలు, కెమికల్ బాండింగ్ ప్రశ్నలు తేలికగానే సమాధానాలిచ్చే స్థాయిలో ఉన్నాయని అంటున్నారు.

ఆన్‌లైన్‌లోనే టీచర్ల బదిలీలు

మంత్రి సబిత స్పష్టీకరణ



తాండూరు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతు లన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తన పుట్టిల్లయిన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కోటబాస్పల్లిలో ఎల్లమ్మ దేవత ఉత్సవాలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపణలను సబిత ఖండించారు. ఆ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, అవగాహన రాహిత్యంతోనే ఆ విధంగా మాట్లాడుతున్నారని చెప్పారు. బదిలీలు, పదోన్నతులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతాయన్నారు. ఈసారి కూడా తాను మహేశ్వరం నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.

బదిలీల జీవో ఎప్పుడు?

ఉపాధ్యాయ వర్గాల్లో ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన జీవో కోసం ఉపాధ్యాయులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. షెడ్యూల్, మార్గదర్శకాలు అనధికారికంగా బయటకొచ్చినా.. జీవో వెలువడక పోవడంతో ఈ షెడ్యూల్ ప్రకారమే ప్రక్రియ కొనసాగుతుందా? మార్గదర్శకాలు ఇవే ఉంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 27 నుంచి ప్రక్రియ మొదలు పెడతామని ప్రకటించినప్పటికీ ఇందుకు అనుగుణంగా జీవో ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా జాగ్రత్త పడేందుకే జీవో విడుదల చేయలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం జీవో ఇస్తే శని, ఆదివారాల్లో కోర్టుకెళ్లే అవకాశం ఉండదని, ఆ తర్వాత వెళ్లినా అప్పటికే ప్రక్రియ మొదలైందని కోర్టుకు చెప్పే వీలుందని అధికారులు అంటున్నారు. ఇదిలావుంటే ప్రసార మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న షెడ్యూల్, మార్గదర్శకాలతో తమకు సంబంధం లేదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన మీడియాతో అన్నారు. అయితే కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే బయటకొచ్చిన మార్గదర్శకాలే జీవోలోనూ ఉంటాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

'ఉపాధ్యాయులకు సెలవుల్లేవ్'

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయ్యే వరకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సెలవులొద్దని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన డీఈవోల సమావేశంలో నిర్ణయించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే సీసీఏ రూల్ 1991 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

డా.ఖాదర్ వలీకి డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ

ఎస్‌జీటీ వర్సిటీ స్నాతకోత్సవంలో ప్రదానం చేసిన వీసీ



సాక్షి, న్యూఢిల్లీ: మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ ఖాదర్ వలీకి గురుగ్రామ్ (హరియాణా)లోని శ్రీ గురు గోవింద్ సింగ్ ట్రైసెంటెనరీ (ఎస్.జీ.టి) యూనివర్సిటీ మంగళవారం గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని ప్రదానం చేసింది. దీంతోపాటు శాలువా కప్పి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసింది. గురుగ్రామ్ సమీపంలోని బుధేరలోని యూనివర్సిటీ ఆవరణలో 9వ స్నాతకోత్సవంలో 500 మందికి డాక్టరేట్లు, డిగ్రీలను ప్రదానం చేశారు. చిరుధాన్యాలు, కేంద్రీయ పరిశోధన, అభివృద్ధి, బయో ప్రాసెసింగ్, జెనెటిక్ ఇంజనీరింగ్ వంటి అనేక రంగాల్లో పరిశోధకుడిగా పొందిన అనుభవానికి గుర్తింపుగా ఖాదర్ వలీని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వర్సిటీ వీసీ ప్రకటించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఖాదర్ వలీ (65) బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసి అమెరికాలోని డ్యుపాంట్ కంపెనీలో పరిశోధన శాస్త్రవేత్తగా పదేళ్లు పనిచేశారు. అనంతరం 1997లో తిరిగి భారత్‌కు వచ్చేశారు. సిరిధాన్యాలు తదితర దేశీయ ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందటం సాధ్యమని ప్రచారం చేస్తూ మరుగున పడిన మిల్లెట్స్‌ను తిరిగి ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఖాదర్ వలీ తనవంతు కృషి చేస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.